RNI No.TELTEL/2005/16755

# ప్రజాబలం

PRAJABALAM Telugu Daily తెలుగు దినపత్రిక

Website: prajabalam.in



27 ఏప్రిల్ 2025 ఆదివారం హైదరాబాద్

# దేశంలో రాష్ట్రాన్ని అగ్రగామిగా నిలుపాలని యత్నిస్తున్నాం

## ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి



తెలంగాణ సంస్కృతిలో మహిళలకు సమాన గౌరవం ఉండాలన్న లక్ష్యంతో ఉచిత రవాణా సౌకర్యం కల్పించాం. 200 యూనిట్ల ఉచిత గృహ విద్యుత్, రూ. 500 లకే గ్యాస్ సిలిండర్, రేషన్ ద్వారా సన్న బియ్యం అందిస్తున్నాం.

ప్రభుత్వం రాష్ట్రంలోని స్వయం సహాయక సంఘాల్లో 67 లక్షల మంది సభ్యులను కోటికి పెంచడమే కాకుండా వారిని కోటీశ్వరులను చేయాలన్న లక్ష్యంతో పనిచేస్తోంది. అందులో భాగంగా మహిళలకు సోలార్ పవర్ ప్లాంట్లు, ఆర్టీసీ బస్సులు, పెట్రోల్ బంకులు, మరియు ప్రీమియం రిటైల్ ఔట్‌లెట్లలో షాపులు, సోలార్ విద్యుత్ ఉత్పత్తి, బస్సులను కేటాయించడం వంటి అనేక చర్యలు చేపట్టాం.

**రంగారెడ్డి జిలాల ప్రజాబలం ప్రతినిధి:** సంక్షేమం, పెట్టుబడులు, ఉద్యోగావకాశాల కల్పన, పర్యావరణ సమతుల్యతను సాధిస్తూ ప్రజల జీవితాలను మెరుగుపరిచేందుకు ప్రజా ప్రభుత్వం చేపట్టిన మిషన్‌లో భాగస్వాములు కావాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి భారత్ సమ్మిట్ వేదికగా ప్రపంచ దేశాలకు విజ్ఞప్తి చేశారు. దేశంలోనే తెలంగాణను అగ్రస్థానంలో నిలపడానికి పారదర్శకమైన సంస్కరణలతో, రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నడిపించడానికి ఇంకా ఎంతో చేయాల్సి ఉందని చెప్పారు. అందుకోసం "తెలంగాణ రైజింగ్" బ్రాండ్ అంబాసిడర్లుగా రాష్ట్ర గొప్పతనాన్ని, ప్రజల ఆకాంక్షలను ప్రపంచానికి చాటాలని సదస్సును ఉద్దేశించి కోరారు.

లోక్‌సభ ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీ , ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టివిక్రమార్క తో పాటు ప్రపంచ దేశాల నుంచి ప్రతినిధులు హాజరైన భారత్ సమ్మిట్ లో ముఖ్యమంత్రి ప్రసంగించారు. ఈ సందర్భంగా తెలంగాణ రాష్ట్రం సాధిస్తున్న ప్రగతిని, సంక్షేమ పథకాలను, మరియు సమగ్ర అభివృద్ధి లక్ష్యాలను వివరించారు.

"విద్యార్థులు, కార్మిక సంఘాలు, రైతులు, మహిళల నాయకత్వంలో దశాబ్దాల పాటు జరిగిన పోరాటాల ఫలితంగా తెలంగాణ ప్రత్యేక రాష్ట్రంగా ఏర్పడింది. మొదటి దశాబ్దంలో ప్రజల ఆకాంక్షలు నెరవేరకపోవడంతో ఏర్పడిన నిరాశను తొలగించడానికి ప్రజా ప్రభుత్వం ఆ వర్గాల ఆశలను నెరవేర్చే స్పష్టమైన లక్ష్యంతో పనిచేస్తోంది.

ప్రభుత్వం వ్యవసాయ రంగానికి అత్యంత ప్రాధాన్యతనిచ్చింది. 20 వేల కోట్ల రూపాయలతో 25 లక్షలకుపైగా రైతులకు రుణమాఫీ చేసి దేశ చరిత్రలోనే అతిపెద్ద రుణమాఫీ కార్యక్రమాన్ని అమలు చేశాం. సేద్యానికి 24 గంటల ఉచిత విద్యుత్‌తో పాటు రైతు భరోసా పథకం కింద ఎకరానికి రూ. 12 వేలు పంట పెట్టుబడి




సహాయం, భూమి లేని వ్యవసాయ కార్మికుల కుటుంబానికి కూడా రూ. 12 వేల మద్దతుని ప్రభుత్వం అందిస్తోంది.

ధాన్యానికి కనీస మద్దతు ధరతో పాటు ప్రతి క్వింటాలుపై రూ. 500 అదనపు బోనస్ అందిస్తూ రైతాంగానికి అండగా నిలుస్తూ ఇతర రాష్ట్రాలకు ఆదర్శంగా నిలుస్తున్నాం.

యువతకు నైపుణ్యాలను అందించేందుకు యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్సిటీని స్థాపించాం. గతంలో ఉద్యోగ నియామకాలు లేని పరిస్థితిని సవరిస్తూ, ప్రభుత్వం ఏర్పడిన తొలి ఏడాదిలోనే 60 వేలకు పైగా ఉద్యోగాలను భర్తీ చేశాం. రాజీవ్ యువ వికాసం పథకం ద్వారా 5 లక్షల మంది యువకులకు ఉపాధి అవకాశాలను కల్పించబోతున్నాం.

దావోస్, అమెరికా, దక్షిణ కొరియా, జపాన్, సింగపూర్‌లలో పెట్టుబడి సమ్మిట్ల ద్వారా రాష్ట్రానికి రూ. 2.5 లక్షల కోట్ల పెట్టుబడులను ఆకర్షించాం. వీటి ద్వారా ప్రైవేట్ రంగంలో ఉద్యోగ అవకాశాలను సృష్టిస్తున్నాం. తెలంగాణ వేగంగా పెరుగుతున్న ఆర్థిక వ్యవస్థ, అత్యధిక స్వంత పన్ను వసూళ్లు, జీసీసీలు, డేటా సెంటర్లు, ఎలక్ట్రిక్ వాహనాల రంగాల్లో అభివృద్ధితో పాటు దేశంలో రాష్ట్రాన్ని అగ్రగామిగా నిలుపాలని యత్నిస్తున్నాం.

విద్య, ఆరోగ్యం ప్రాధాన్యతా రంగాలుగా ఎంచుకున్న ప్రభుత్వం రాజీవ్ ఆరోగ్య శ్రీ పథకం కింద చికిత్సకయ్యే ఖర్చును రూ. 10 లక్షలకు పెంచడం, ముఖ్యమంత్రి సహాయ నిధి కింద ఇప్పటికే వెయ్యి కోట్ల ఆర్థిక సహాయాన్ని అందించాం.

కాలుష్యం నుంచి హైదరాబాద్ నగరానికి విముక్తి కల్పించడానికి ప్రభుత్వం మూసీ పునరుజ్జీవ కార్యక్రమం చేపట్టింది. హైదరాబాద్‌ను ప్రపంచ స్థాయి నగరంగా తీర్చిదిద్దేందుకు 30 వేల ఎకరాల్లో ఫ్యూచర్ సిటీ నిర్మాణంతో పాటు రీజినల్ రింగ్ రోడ్డు, మెట్రో రైలు విస్తరణ ప్రాజెక్టులు చేపట్టడం జరిగింది.

ఓబీసీ జనగణన చేసి దేశంలోనే తొలి రాష్ట్రంగా తెలంగాణ నిలిచింది. ఎస్సీ ఉప కులాల వర్గీకరణ పూర్తి చేయడంలో కూడా దేశంలోనే మొదటి రాష్ట్రం తెలంగాణయే.

ప్రజల సమస్యలను నేరుగా విని పరిష్కరించడానికి పారదర్శకమైన పద్ధతిలో ప్రజావాణి కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నాం. గిగ్ వర్కర్ల సంక్షేమం కోసం సరికొత్త సంక్షేమ విధానాన్ని రూపొందిస్తున్నాం" అని ముఖ్యమంత్రి వివరించారు. అనంతరం రెండు రోజుల పాటు జరిగిన సమ్మిట్ చర్చలపై 44 అంశాలతో కూడిన "హైదరాబాద్ తీర్మానం" విడుదల చేశారు.

# యువతకు ఉపాధి అవకాశాల వృద్ధికి ప్రభుత్వ కృషి

**యువజనులకు కని విని ఎరగని అవకాశాలకు ఇదే తరుణం**

**15వ రోజ్‌గార్ మేళాలో ప్రధాని మోడీ**

**రిక్రూట్లకు 51 వేల పైచిలుకు నియామక పత్రాలు పంపిణీ**



న్యూఢిల్లీ ఏప్రిల్ 26క పత్రాలు పంపిణీ చేసిన అనంతరం 15వ రోజ్‌గార్ మేళాలో ప్రధాని మోడీ ప్రసంగిస్తూ, యువజనులకు కనివిని ఎరగని అవకాశాల కల్పనకుఇదే తరుణమని అన్నారు. భారత్ అత్యంత వేగంగా వృద్ధి చెందుతున్న ప్రధాన ఆర్థిక వ్యవస్థ అని అంతర్జాతీయ ద్రవ్య నిధి (ఐఎంఎఫ్) చెప్పిందని, ప్రతి రంగంలో ఉపాధి అవకాశాలు పెరుగుతున్నాయని మోడీ తెలియజేశారు. ఆటోమొబైట్, పాదరక్షల పరిశ్రమల్లో ఉత్పత్తి, ఎగుమతి కొత్త రికార్డులు సృష్టించాయని, భారీ సంఖ్యలో ఉపాధి కల్పించాయని మోడీ వెల్లడించారు. తన ప్రభుత్వం తీసుకువచ్చిన మార్పుల గురించి ప్రధాని ప్రస్తావిస్తూ, దేశీయ జల మార్గాల ద్వారా సరకుల రవాణా 2014లోని 18 మిలియన్ టన్నుల నుంచి 145 మిలియన్ టన్నులకు పెరిగిందని, జాతీయ జలమార్గాలు ఐదు నుంచి పదికి, వాటి నిడివి 2700 కిమీ నుంచి 5000 కిమీకి చేరుకున్నాయని తెలియజేశారు. వృద్ధి సమ్మిళితం కావడమే భారీ హైలైట్ అని, మహిళల భాగస్వామ్యం ప్రతి రంగంలో పెరిగిందని ప్రధాని చెప్పారు. ఈ ఏడాది యుపిఎస్‌సి పరీక్షలో ఐదుగురు అగ్రశ్రేణి అభ్యర్థుల్లో ముగ్గురు మహిళలని, 90 లక్షల స్వయంసహాయక బృందాలు (ఎస్‌హెచ్‌జిలు)లో పది కోట్ల మందికి పైగా మహిళలు పని చేస్తున్నారని ఆయన తెలిపారు. భారత మహిళా శక్తి అధికార యంత్రాంగం నుంచి రోదసి, వైజ్ఞానిక రంగాలలో కొత్త పుంతలు తొక్కుతున్నదని, గ్రామీణ మహిళల సాధికారతపై కూడా ప్రభుత్వం దృష్టి కేంద్రీకరిస్తోందని ఆయన చెప్పారు. ఈ దశాబ్దంలో టెక్నాలజీ, డేటా, ఆవిష్కరణల రంగాల్లో భారత వృద్ధికి యువత దోహదంచేసిందని, రియల్ టైమ్ డిజిటల్ లావాదేవీల్లో దేశం అగ్రగామిగా ఉందని మోడీ తెలియజేశారు. దేశ నిర్మాణానికి యువత చురుకుగా తోడ్పడుతుండగా దేశం శీఘ్రగతిన అభివృద్ధి చెందుతున్నదని, ప్రపంచ వేదికపై గుర్తింపు పొందుతోందని ఆయన తెలిపారు. దేశంలోని యువతకు ఉపాధి, స్వయం ఉపాధి అవకాశాలు వృద్ధి చెందేందుకు తన ప్రభుత్వం ప్రతి ఒక్క చర్యా తీసుకుంటున్నదని మోడీ చెప్పారు. స్కిల్ ఇండియా, స్టార్టప్ ఇండియా, డిజిటల్ ఇండియా వంటి పథకాల గురించి ప్రధాని ప్రస్తావిస్తూ, అవి యువతకు కొత్త అవకాశాలు సృష్టిస్తున్నాయని, వారి ప్రతిభ ప్రదర్శనకు బహిరంగ వేదిక అవుతున్నాయని తెలిపారు.

## కవితకు టీపిసిసి అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్ కౌంటర్

**దందాలతో దేశవ్యాప్తంగా కవిత ఫేమస్**

**కవిత రౌడీ కాబట్టే..ఆమె బహిరంగంగా చెప్పుకుంటున్నారు**



దోపిడీకి కేరాఫ్ అడ్రస్ కేసిఆర్ కుటుంబం

రజతోత్సవ సభ బిఆర్ఎస్ పార్టీ కోసమా? టిఆర్ఎస్ పార్టీ కోసమా?

రాహుల్ గాంధీ ఆలోచన మేరకే కులగణన, ఎస్సీ వర్గీకరణ, బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు

రాహుల్ మాటకు కట్టుబడి వరంగల్ డిక్లరేషన్ లో పేర్కొన్న విధంగా రైతులకు రుణమాఫీ చేశాం

లిక్కర్ దందాలు చేసే కవితకు రాహుల్ గాంధీ పేరు ఎత్తే నైతిక అర్హత లేదు

త్యాగాలకు పెట్టింది పేరు గాంధీ కుటుంబం

దొంగల ముఠాలా కేసిఆర్ కుటుంబం తెలంగాణనుదోచుకున్నారు

HCU భూముల గురించి కవిత మాట్లాడటం విడ్డూరం

అస్తిత్వం నిల్పుకోవడం కోసం కేసిఆర్ అండ్ కో ఆరాటం

పదేళ్లలో 10 వేలకు పైగా భూములను కేసిఆర్ కుటుంబం దోచుకుంది

జిహెచ్ఎంసి చుట్టూ పక్కల భూములను కారు చౌకగా వారు అనునయులకు కేటీఆర్ దోచి పెట్టారు

## కర్రెగుట్టలో భారీ ఎన్‌కౌంటర్ 28 మంది మావోయిస్టులు మృతి

ఛత్తీస్‌గఢ్, ఏప్రిల్ 26 తెలంగాణ ఛత్తీస్‌గఢ్ సరిహద్దులో మరోసారి భారీ ఎన్‌కౌంటర్ జరిగింది. భద్రతా బలగాల కాల్పుల్లో 28 మంది మావోయిస్టులు మృతి చెందినట్లు తెలిసింది. తెలంగాణ–ఛత్తీస్‌గఢ్ సరిహద్దు కర్రెగుట్టలో కేంద్ర పారామిలటరీ బలగాల నేతృత్వంలో ఐదు రోజులుగా కూంబింగ్ ఆపరేషన్ కొనసాగుతోంది. మావోయిస్టు మోస్ట్ వాంటెడ్ కీలక నేతలు హిడ్మా, దేవా టార్గెట్‌గా జరుగుతున్న ఈ ఆపరేషన్‌లో మూడు రాష్ట్రాల నుంచి 20 వేల మందికి పైగా బలగాలు పాల్గొన్నాయి. ఈ క్రమంలోనే శనివారం ఉదయం కర్రెగుట్టలో మావోయిస్టులు, భద్రతా బలగాల మధ్య భీకర కాల్పులు జరిగాయి. ఈ కాల్పుల్లో 28 మంది మావోయిస్టులు మరణించారని సమాచారం. అయితే, ఈ విషయాన్ని ఇంకా అధికారికంగా ధ్రువీకరించాల్సి ఉంది. కర్రెగుట్టలో సుమారు వెయ్యి మంది మావోయిస్టులు ఉన్నట్లు సమాచారం. దీంతో ఆ ప్రాంతంలో భద్రతా బలగాలు జల్లెడ పడుతున్నాయి. గుట్ట సమీపంలోని ప్రజలు బయటకు రావద్దని ఇప్పటికే ఆంక్షలు విధించారు. ఇక మావోయిస్టుల కోసం రాత్రి పగలు అనే తేడా లేకుండా డ్రోన్ల సాయంతో ఏజెన్సీని భద్రతాబలగాలు జల్లెడ పడుతున్నాయి. దీంతో ఎప్పుడు ఏం జరుగుతుందోనని గిరిజనులు భయాందోళనలకు గురవుతున్నారు. కాగా, భద్రతా సిబ్బందికి 8 హెలికాప్టర్ల ద్వారా ఆయుధాలు, భోజనాలు, నీటిని సరఫరా చేస్తున్నారు.

## జూన్ నుంచి తిరిగి కైలాస్ మానససరోవర్ యాత్ర

**భారత్, చైనా సంబంధాల మెరుగుదల కృషిలో భాగం**

**యాత్రకు ఐదు సంవత్సరాలు విరామం**



న్యూఢిల్లీ ఏప్రిల్ 26 ఐదు సంవత్సరాల విరామం అనంతరం కైలాస్ మానససరోవర్ యాత్ర జూన్‌లో తిరిగి ప్రారంభం అవుతుందని భారత్ శనివారం ప్రకటించింది. భారత్, చైనా నిరుడు అక్టోబర్‌లో కుదుర్చుకున్న ఒక ఒప్పందం ప్రకారం డెమ్‌చోక్, డెప్సాంగ్ ఘర్షణ ప్రాంతాల వద్ద సైనికుల ఉపసంహరణను పూర్తి చేసిన తరువాత సంబంధాల మెరుగుదలకు రెండు దేశాలు తీసుకుంటున్న చర్యల్లో భాగంగా కైలాస్ మానససరోవర్ యాత్రను పునఃప్రారంభిస్తున్నట్లుగా భావిస్తున్నారు. 'విదేశాంగ మంత్రిత్వశాఖ (ఎంఇఎ) నిర్వహించే కైలాస్ మానససరోవర్ యాత్ర జూన్ నుంచి ఆగస్టు వరకు సాగనున్నది' అని భారత్ ఒక ప్రకటనలో తెలియజేసింది. కైలాస మానససరోవర్ యాత్ర 2020 తరువాత సాగలేదు. 'ఈ ఏడాది బృందానికి 50 మంది యాత్రికులతో ఐదు బృందాలు, బృందానికి 50 మంది యాత్రికులు వంతున పది బృందాలు వరుసగా లిపులేఖ్ కనుమ గుండా ఉత్తరాఖండ్ మీదుగా, నాథు లా కనుమ గుండా సిక్కిం రాష్ట్రం మీదుగా సాగనున్నాయి' అని ఎంఇఎ ఆ ప్రకటనలో వివరించింది. యాత్ర కోసం దరఖాస్తులను కెఎంవై.గవ్.ఇన్ వెబ్‌సైట్‌లో సమర్పించవచ్చునని ఎంఇఎ సూచించింది. 'నిష్పాక్షిక, కంప్యూటర్ ఆధారిత, లింగ సమతౌల్య ఎంపిక ప్రక్రియ ద్వారా దరఖాస్తుదారుల నుంచి యాత్రికుల ఎంపిక జరుగుతుంది' అని ఎంఇఎ తెలియజేసింది.







హైదరాబాద్ లో జరిగిన భారత్ సమ్మిట్ లో పాల్గొనడానికి విచ్చేసిన లోక్ సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీని శంషాబాద్ ఎయిర్ పోర్ట్ లో సాదరంగా స్వాగతం పలికిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, ఏఐసీసీ కార్యదర్శి మీనాక్షి నటరాజన్, టీపీసీసీ అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్

ప్రజాబలం

27 ఏప్రిల్ 2025 ఆదివారం

# వివాదాస్పదమవుతున్న గవర్నర్ వ్యవస్థ

దేశంలోని కొన్ని రాష్ట్రాల్లో ప్రభుత్వాధినేతలూ వర్సెస్ రాజ్యాంగాధినేతల మధ్య ఘర్షణ వాతావరణం రోజురోజుకు చర్చనీయాంశం అవుతోంది. రాష్ట్రాల్లో గవర్నర్ వర్సెస్ గవర్నమెంట్ మధ్య దూరం మరింత పెరుగుతోంది. కేంద్ర, రాష్ట్రాల్లో విభిన్న ప్రభుత్వాలున్నప్పుడు ఈ ఘర్షణ అనివార్యమవుతోంది. అధికారాల విషయంలో ఎప్పుడూ ఏదో ఒక అలజడి జరుగుతూనే ఉంది. తరుచూ ఏవో ఒక ప్రకంపనలు చెలరేగుతూనే ఉన్నాయి. కేరళ, తమిళనాడు ఇలా ఒక్కోరాష్ట్రంలో గవర్నర్ వ్యవస్థ వివాదం అవడంతో దేశవ్యాప్తంగా చర్చనడుస్తోంది. రాష్ట్రాలలో గవర్నర్లు, నేషనల్ క్యాపిటల్ టెరిటరీ ఆఫ్ ఢిల్లీతో సహా కేంద్ర భూభాగాల్లో లెఫ్టినెంట్ గవర్నర్లు లేదా అడ్మినిస్ట్రేటర్ ఉన్నారు. గవర్నర్ నామమాత్రపు అధిపతిగా వ్యవహరిస్తారు, అయితే నిజమైన అధికారం రాష్ట్రాలలో రాష్ట్రాల ముఖ్యమంత్రులు, వారి మంత్రి మండలిపై, కేంద్ర పాలిత ప్రాంతాల్లో లెఫ్టినెంట్ గవర్నర్ లేదా అడ్మినిస్ట్రేటర్ వద్ద ఉంటుంది.ఢిల్లీ, పుదుచ్చేరి మినహా గవర్నర్ ఒక ముఖ్యమంత్రి నేతత్వంలోని మంత్రుల మండలితో అధికారాన్ని పంచుకుంటారు. ఆర్టికల్ 153 ప్రకారం ప్రతి రాష్ట్రానికి ఓ గవర్నర్ అవసరం. గవర్నర్లు, లెఫ్టినెంట్ గవర్నర్లను ఐదేళ్ల కాలానికి భారత రాష్ట్రపతి నియమిస్తారు. ఆర్టికల్ 154 ప్రకారం రాష్ట్ర గవర్నర్‌కి కార్యనిర్వాహక అధికారం ఉంటుంది. పరోక్షంగా అధికారుల ద్వారా పరిపాలన చేయవచ్చనేది దీనర్థం. అయితే గవర్నర్ వ్యవస్థ అనేది స్వాతంత్ర్యానికి పూర్వం అంటే బ్రిటీష్ పాలన నుండే ఉన్నది. అప్పట్లో వైశ్రాయ్ కీలకమైన పదవి. గవర్నర్ కేవలం కార్యనిర్వాహక అధిపతి. బ్రిటీష్ చట్టాలకు అనుగుణంగా నాడు ఏర్పడిన ఈ వ్యవస్థ ఇప్పటికీ కొనసాగుతోంది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల మధ్య గవర్నర్ వ్యవస్థ వారధిలా ఉండాలనే ఉద్దేశంతో దీనిని కొనసాగిస్తున్నారు. కానీ ఇదే గవర్నర్ వ్యవస్థను ఆసరా చేసుకుని కేంద్ర ప్రభుత్వాలు, రాష్ట్రాలపై ఆధిపత్యం చెలాయించిన సందర్భాలున్నాయి. రాష్ట్ర ప్రభుత్వం ఓ బిల్లును ఆమోదించినప్పుడు స్పష్టత కోరే అధికారం గవర్నర్‌కు ఉంది. అయినా ఆ బిల్లును అమలు చేసే అధికారం రాష్ట్ర ప్రభుత్వానిదే. దేశంలో గవర్నర్లకు ఆయా రాష్ట్ర ప్రభుత్వాలకు మధ్య వివాదాలు కొత్తేమీ కాదు. చాలా రాష్ట్రాల్లో గతంలో ఇలాంటి వివాదాలు తారాస్థాయికి వెళ్లాయి. మొన్నటిదాకా ఢిల్లీలో అరవింద్ కేజ్రీవాల్ వర్సెస్ అక్కడి గవర్నర్ మధ్య వివాదం గతంలో నిత్యకత్యంలా మారింది. అసలు గవర్నర్ పదవి అనేది ఫెడరల్ వ్యవస్థలో ప్రధాన పాత్ర పోషించాల్సిన బాధ్యతాయుతమైన స్థానం. అయితే ఇక్కడ బాధాకరమైన విషయమేమంటే రాష్ట్రాల్లో ప్రత్యర్థి పార్టీ ప్రభుత్వం ఉన్నపుడు, కేంద్రంలోని అధికార పార్టీకి అనుకూలంగా ఉన్న గవర్నర్లు ప్రభుత్వ విధానాలను అడ్డుకోవడం వంటి ఆరోపణలు ఎదురవుతున్నాయి.

ఈ నేపథ్యంలో సుప్రీం కోర్టు ఇటీవల ఇచ్చిన తీర్పు ఒక చారిత్రాత్మకమైన నిర్ణయంగా మిగిలింది. తమిళనాడు గవర్నర్ ఆర్.ఎన్. రవి వ్యవహారంపై ఇచ్చిన తీర్పులో, రాష్ట్ర శాసనసభలు ఆమోదించిన బిల్లులను గవర్నర్ తిరస్కరించినా, మళ్లీ అవే బిల్లులు తిరిగి రెండోసారి ఆమోదించి పంపినప్పుడు వాటిని రాష్ట్రపతికి పంపకుండా తన వద్దే ఉంచుకోవడాన్ని కోర్టు తీవ్రంగా తప్పుపట్టింది. ఇది ప్రజాస్వామ్య వ్యవస్థపై ప్రభావం చూపే అంశంగా ఉందని, గవర్నర్ తన పదవి ద్వారా స్వాతంత్ర్యాన్ని దెబ్బతీసే విధంగా వ్యవహరించొద్దని హెచ్చరించింది. అలాగే బిల్లులను ఆమోదించడంలో ఆలస్యం చేయకూడదని, మూడు నెలల వ్యవధిలోనే నిర్ణయం తీసుకోవాలని కోర్టు సూచించింది. అలాగే వైస్ ఛాన్సలర్లు, ఇతర విద్యా వ్యవస్థ సంబంధిత నియామకాల్లో రాష్ట్ర ప్రభుత్వ నిర్ణయాలపై జాప్యం చేయకూడదన్న సూచన కూడా ఈ తీర్పులో ఉంది.అయితే ఇది కేవలం తమిళనాడు గవర్నర్ విషయంలోనే కాకుండా, దేశవ్యాప్తంగా అన్ని రాష్ట్రాలకు ఈ తీర్పు మార్గదర్శకంగా నిలుస్తుందనేది న్యాయనిపుణుల అభిప్రాయం. సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పుతో కేంద్ర, రాష్ట్ర సంబంధాల్లో స్పష్టత తీసుకురావడంతో పాటు, ఫెడరల్ వ్యవస్థను మరింత బలపరిచే దిశగా ఉన్నది. కాబట్టి ఇప్పటికైనా గవర్నర్ వ్యవహారశైలి మారకపోతే, ప్రజాస్వామ్య వ్యవస్థపై ప్రజల్లో నమ్మకం దిగజారే ప్రమాదం ఉంది. గవర్నర్ ఒక స్నేహితుడిగా, మార్గదర్శకుడిగా, రాజ్యాంగ ప్రమాణాలను గౌరవించే వ్యక్తిగా ఉండాలన్నది ఈ తీర్పు ద్వారా వెల్లడైన సందేశం.

ఈ గవర్నర్ల వివాదమనేది మన తెలుగు నేలను కూడా గతంలో ఆవహించిన సందర్భాలు ఉన్నాయి. ఉమ్మడి ఎపి, రెండు తెలుగు రాష్ట్రాలకు సంబంధించి ఇప్పటి వరకు పనిచేసిన గవర్నర్లలో అత్యంత వివాదాస్పదుడు రామ్‌లాల్. 1984లో ఎన్‌టి రామారావు ప్రభుత్వాన్ని అప్రజాస్వామికంగా రద్దు చేసి నాదెండ్ల భాస్కరరావును ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రిగా అనుమతించిన గవర్నర్‌గా ఆయన చరిత్రలో నిలిచారు. ఆనాటి కాంగ్రెస్ సారథ్యంలో ఇందిరా గాంధీ అయినా, నేడు బిజెపి సారథ్యంలో నరేంద్ర మోడీ అయినా కేంద్రంలో ప్రభుత్వం మారిన ప్రతీసారి రాష్ట్రాల్లో తమ ఇష్టానుసారంగా గవర్నర్లను మార్చే చర్యల వల్ల రాష్ట్ర ప్రభుత్వాలకు గవర్నర్ వ్యవస్థే ఇబ్బందికరంగా మారింది. దాని పర్యవసానంగానే నేడు గవర్నర్లు కేంద్ర ప్రభుత్వానికి ఏజెంట్లుగా వ్యవహరిస్తూ బిజెపియేతర రాష్ట్ర ప్రభుత్వాలను ఇబ్బందులకు గురి చేస్తున్నారు. ఆయా ప్రభుత్వాల నేతత్వంలో అసెంబ్లీ ఆమోదించిన బిల్లులను క్లియర్ చేయటం లేదు. దీనివల్ల గవర్నర్ వ్యవస్థ రాష్ట్రాల స్వయం ప్రతిపత్తికి భంగం కలిగిస్తుంది. ఇది రాష్ట్రాల మధ్య విభేదాలకు దారితీస్తుంది. మోడీ ప్రభుత్వం గవర్నర్లను అడ్డుపెట్టుకుని రాష్ట్రాల హక్కుల మీద, రాజ్యాంగంలోని ఫెడరల్ సూత్రాల మీద తీవ్రమైన దాడి చేయడం 2014 నుండి జరుగుతూనే ఉంది. మహారాష్ట్ర, పశ్చిమ బెంగాల్, తమిళనాడు, అరుణాచల్‌ప్రదేశ్, గోవా, కర్నాటక, కేరళలో ఈ దాడులను చూశాం. గవర్నర్లకు రాజ్యాంగం ఇచ్చిన కొన్ని విచక్షణాధికారాలను ఉపయోగించుకుని వారు సమాంతర అధికార కేంద్రాలుగా మారడానికి ప్రయత్నిస్తున్నారు. మన రాజ్యాంగంలోని అన్ని మౌలిక అంశాల మీద అంటే లౌకికత్వం, ప్రజాసామ్యం ముఖ్యంగా పార్లమెంటరీ ప్రజాసామ్యం, ఫెడరలిజం మొదలైన రాజ్యాంగ మౌలిక అంశాలన్నింటి మీద జరుగుతున్న దాడిలో ఇదో భాగం. అందుకే ప్రజాస్వామ్యంలో ఏమాత్రం ప్రాధాన్యత లేకుండా ఆరో వేలుగా ఉండి, అసలు ప్రజాస్వామ్యాన్నే పెను ప్రమాదంలోకి నెడుతున్న ఈ గవర్నర్ వ్యవస్థ అవసరం ఇంకా ఉన్నదా? అని ఆలోచించాల్సిన సమయం వచ్చింది.

## మంత్రి పొన్నం ప్రభాకర్ గారి చొరవతో నేడు దుబాయ్ నుండి సొంత ప్రాంతం హుస్నాబాద్ చేరుకోనున్న గల్ఫ్ బాధితుడు చొప్పరి లింగయ్య...




హైదరాబాద్ ప్రజాబలం ప్రతినిధి మంత్రి పొన్నం ప్రభాకర్ గారి చొరవతో నేడు దుబాయ్ నుండి సొంత ప్రాంతం హుస్నాబాద్ చేరుకోనున్న గల్ఫ్ బాధితుడు చొప్పరి లింగయ్య...

ఫ్లైట్ టికెట్ కు డబ్బులు చెల్లించి గల్ఫ్ బాధితుడు చొప్పరి లింగయ్య ను హైదరాబాద్ తీసుకొచ్చిన మంత్రి పొన్నం ప్రభాకర్

గత వారం తీవ్ర అనారోగ్యంతో బాధపడుతూ తనని ఇండియా తీసుకోవాలని హుస్నాబాద్ పట్టణానికి చెందిన గల్ఫ్ కార్మికుడు చొప్పరి లింగయ్య ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కి ,మంత్రి పొన్నం ప్రభాకర్ ని సెల్ఫీ విడియో ద్వారా విజ్ఞప్తి చేశారు..

వెంటనే స్పందించిన మంత్రి పొన్నం ప్రభాకర్ చొప్పరి లింగయ్య కు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం నియమించిన ఎన్నారై అడ్వైజరీ కమిటీ చైర్మన్ బి ఏం వినోద్ కుమార్ ,వైస్ చైర్మన్ మంద భీమ్ రెడ్డి లను సమన్వయం చేశారు..

మంత్రి పొన్నం ప్రభాకర్ పంపించిన పలువురు ఎన్నారై ప్రతినిధులు అనారోగ్యంతో ఉన్న చొప్పరి లింగయ్య వద్దకు వెళ్లిన పరామర్శించి ధైర్యం చెప్పారు..

అనారాగ్యంతో ఇబ్బందులు పడుతున్న తనకి బాగోగులు చూసుకోవడానికి పంపించి ,ఫ్లైట్ టికెట్ డబ్బులు చెల్లించి స్వగ్రామానికి తీసుకొచ్చిన మంత్రి పొన్నం ప్రభాకర్ కి ధన్యవాదాలు తెలిపిన చొప్పరి లింగయ్య,ఆయన కుటుంబ సభ్యులు..

# కూటమి ప్రభుత్వం రాకతో మత్స్యకారుల దశ మారింది

**ఎన్నికల్లో హామీ మేరకు వేట నిషేధ సమయంలో రూ. 20,000 సాయం విడుదల**

**1,29,178 మత్స్యకార కుటుంబాలకు రూ.259 కోట్ల లబ్ధి**

**గత పాలకుల్లా నేనూ బటన్ నొక్కొచ్చు...కానీ, మిమ్మల్ని కలిస్తేనే మీ సమస్యలు తెలుస్తాయి...**

**ఎచ్చెర్లలో స్కిల్ డెవలెప్మెంట్ సెంటర్ ఏర్పాటు చేస్తాం**

**-సీఎం నారా చంద్రబాబు నాయుడు**

**ఎచ్చెర్ల నియోజకవర్గం బుడగట్లపాలెంలో మత్స్యకారుల సేవలో పథకం ప్రారంభం**






ఎచ్చెర్ల-బుడగట్లపాలెం, ఏప్రిల్ 26: రాష్ట్రంలో ఎన్డీఏ కూటమి ప్రభుత్వం రాకతో మత్స్యకారుల దశ మారిందని ఏపీ సీఎం చంద్రబాబు అన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు వేట నిషేధ సమయంలో ఆర్థికసాయం రెట్టింపు చేసి.. విడుదల చేశామని, దీని వల్ల 1,29,178 మత్స్యకార కుటుంబాలకు రూ. 259 కోట్ల లబ్ధి చేకూరిందని అన్నారు. గత పాలకుల్లా తాను బటన్ నొక్కొచ్చు కానీ అలా చేయనని... ప్రజల మధ్యకు వచ్చి వాళ్ల సమస్యలు తెలుసుకుంటానని అన్నారు. ప్రజలందరికీ సంక్షేమం అందించడమే తన ధ్యేయం అన్నారు. శ్రీకాకుళం జిల్లా ఎచ్చెర్ల నియోజకవర్గం బుడగట్లపాలెంలో మత్స్యకార సేవలో పథకాన్ని సీఎం చంద్రబాబు ప్రారంభించారు. మత్స్యకారులు తురాడ అప్పన్న, అలుపల్లి తవితాయ కుటుంబాలకు చెరో రూ. 20 వేల చొప్పున ఆర్థిక సాయాన్ని సీఎం అందజేశారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రజలను ఉద్దేశించి మాట్లాడారు.

### మత్స్యకారులకు ఇచ్చిన మాట నిలబెట్టుకున్నాం

మత్స్యకారులు పడుతున్న కష్టాలు నాకు తెలుసు. జాలర్లు ప్రాణాలను పణంగా పెట్టి సముద్రంలో వేటకు వెళ్లడం, వారు తిరిగి వచ్చే వరకూ ఆడబిడ్డలు ప్రాణాలు అరచేతిలో పెట్టుకుని ఎదురుచూడటం నేను స్వయంగా చూశాను. కొందరు బోట్లన్నీ కొని మీ సగం ఆదాయం కొట్టేస్తున్నారు. మీ కష్టాలు తీర్చేందుకు నేనున్నాను. జాలర్లు మాటకు కట్టుబడి ఉంటారు. మత్స్యకార గ్రామాలకు గ్రామాలు టీడీపీకి అండగా నిలబడ్డాయి. వెనుకబడిన వర్గాల సంక్షేమం తెలుగుదేశం ధ్యేయం. సముద్రంలో వేట నిషేధ సమయంలో మత్స్యకారులు ఇబ్బందులు పడకుండా ఆర్థిక సాయం చేయాలని నిర్ణయించాం. ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు వేట విరామ సమయంలో మత్స్యకారులకు ఆర్థిక సాయాన్ని రూ.10,000 నుంచి రూ.20,000కు పెంచాం.

### అభివృద్ధి అంటే.. గత పాలకుల్లా బటన్ నొక్కడం కాదు

గత పాలకుల్లా బటన్ నొక్కి ప్రచారం చేసుకోవడం నాకూ వచ్చు. కానీ చేయాల్సింది అది కాదు. ప్రజలందరికీ సంక్షేమం అందించడమే నా ధ్యేయం. గత పాలకులు ఫిష్ ఆంధ్ర పేరుతో రూ. 300 కోట్లు ఖర్చు పెట్టామన్నారు. ఒక్క మత్స్యకారుని కుటుంబమైనా బాగుపడిందా? 2014లో తొలిసారిగా తెలుగుదేశం ప్రభుత్వమే వేట నిషేధ సమయంలో మత్స్యకార కుటుంబాలకు భృతిని ప్రవేశ పెట్టింది. 2014-2019 మధ్య మత్స్యకారుల సంక్షేమం కోసం రూ.788 కోట్లు ఖర్చు పెట్టాము. అంతేకాకుండా వలలు, పడవలు, ఐస్ బాక్సులు అదనంగా ఇచ్చింది. మత్స్యకారుల పిల్లలకు ప్రత్యేకంగా 6 రెసిడెన్షియల్ పాఠశాలు ఏర్పాటు చేశాము. రాష్ట్రంలో 68,396 మంది మత్స్యకారులకు నెలనెలా పింఛన్లు అందిస్తున్నాము. మత్స్యకారులు చేపల వేట సమయంలో మరణిస్తే రూ.10 లక్షలు ఎక్స్‌గ్రేషియో చెల్లిస్తున్నాము. వేటకు వెళ్లే బోట్లకు లీటర్ డీజిల్‌పై రూ.9 సబ్సిడీ ఇస్తున్నాం.

### చేపల ఎగుమతుల్లో ఏపీ టాప్

రాష్ట్రంలో 555 మత్స్యకార గ్రామాలున్నాయి. అయినా నేను బుడగట్లపాలెంకు ఎందుకొచ్చానంటే ఇక్కడి నుంచే జాలర్ల దశదిశా మార్చాలని. చేపల ఎగుమతుల్లో మన రాష్ట్రం ముందువరుసలో ఉంది. దేశంలో ఉత్పత్తయ్యే మత్స్యసంపదలో 29 శాతం మన రాష్ట్రం నుంచే ఉంటోంది. ఏపీ నుంచే 32 శాతం మత్స్య సంపద ఎగుమతులు జరుగుతున్నాయి . మత్స్య ఉత్పత్తుల ద్వారా 16.50 లక్షల మందికి ఉపాధి లభిస్తోంది. చేపల పెంపకం వల్ల ఎన్నో లాభాలున్నాయి. ప్రజలు ఆరోగ్యంగా ఉండాలంటే చేపలు తినాలి. మనుషుల్లో తెలివితేటలు, పిల్లల మెదడు చురుకుగా పనిచేయాలంటే చేపలు తినాలి.

### దేశమంతా శ్రీకాకుళం వాసులే

హైదరాబాద్ , ఢిల్లీ సహా దేశంలోని పలు ప్రాంతాల్లో శ్రీకాకుళం కాలనీ ఉంటుంది. ఆర్మీలో శ్రీకాకుళం వాసులున్నారు. జిల్లాలో తెలివితేటలున్న నాయకులుకు కొరత లేదు. నాగావళి, వంశధార ద్వారా నీరు సమృద్ధిగా వస్తుంది. జిల్లా వెంబడి ఎక్కువ జాతీయ రహదారులు ఉన్నాయి. బంగారం పండే భూములు, గనులున్నాయి. ఇక్కడి ఎమ్మెల్యే ఈశ్వర రావు మంచి వాక్ చాతుర్యం కలిగిన వ్యక్తి. ఈ జిల్లాకు చెందిన టీడీపీ కార్యకర్త అప్పలనాయుడు ఎంపీ అయ్యాడు. ముచ్చటగా మూడోసారి గెలిసిన రామ్మోహన్ నాయుడు కేంద్రమంత్రి అయ్యాడు. విశాఖ వాసులు తలసరి ఆదాయంలో ముందుంటే రాష్ట్రం మొత్తంలో తక్కువ తలసరి ఆదాయం వచ్చే జిల్లా శ్రీకాకుళం. నేను భోగాపురం ఎయిర్ పోర్టు తీసుకొస్తే గత పాలకులు దాన్ని అటకెక్కించారు. మళ్లీ నేనే దాన్ని పూర్తిచేస్తాను. ఆనాడు నా మిత్రుడు ఎర్రన్నాయుడు కేంద్రమంత్రిగా ఉన్నప్పుడు ఉద్దానంకు నీళ్లు తెచ్చారు. ఆయన కుమారుడు రామ్మోహన్ నాయుడు ఆధ్వర్యంలో భోగాపురం పూర్తి కాబోతోంది. రామ్మోహన్ నాయుడు పనితీరును ఢిల్లీ నాయకులు గొప్పగా చెబుతున్నారు. అయితే శ్రీకాకుళం అభివృద్ధి కాకపోతే నీ డిగ్రీ తిరిగి ఇవ్వాల్సిందేనని రామ్మోహన్ కు నేను తేల్చి చెప్పాను.

### గత పాలకులు రాష్ట్రాన్ని భ్రష్టుపట్టించారు

ఎన్డీఏ ప్రభుత్వం వచ్చి పది నెలలయింది. ఎన్నో సమస్యలున్నాయి 4వ సారి ముఖ్యమంత్రిగా చేస్తున్న నాకే సమస్యలు అర్థం కావడంలేదు. గత ప్రభుత్వం నుంచి రూ. 10 లక్షల కోట్ల అప్పు వారసత్వంగా వచ్చింది. ఆ సొమ్ము ఏం చేశారో లెక్కలు లేవు. నా ఇబ్బందులు మీకు చెప్పి మిమ్మల్ని ఇబ్బంది పెట్టను. ఎన్ని సమస్యలు ఉన్నా ప్రజలను ఆదుకుంటాను. ఇలాంటి సభలు గడిచిన ఐదేళ్లలో ఎలా జరిగాయో మీకు తెలుసు. గత పాలకులు వస్తున్నారంటే మీ కొబ్బరిచెట్లు గోవిందా...ఒక నాయకుడు వస్తే చెట్లు నరికేయడం, పరదాలు కట్టేయడం చూశాం. కొందరిని ఇంట్లో నుంచి బయటకు రానివ్వకుండా నెత్తిన చెయ్యి పెట్టేవారు. ఐదేళ్లూ అభివృద్ధి ఆగిపోయింది. పెట్టుబడులు లేవు. పరిశ్రమలు పారిపోయాయి. దీనివల్ల చాలా నష్టం జరిగింది. 2019 తర్వాత కూడా టీడీపీ అధికారంలో ఉండుంటే రూ. 7 లక్షల కోట్ల సంపద పెరిగేది. దీనివల్ల ప్రతి ఇంటికి రూ. 50 నుంచి 70 వేలు తలసరి ఆదాయం పెరిగేది.

### ఎచ్చెర్లను అభివృద్ధి చేస్తా

ఎచ్చెర్ల నియోజకవర్గం ప్రజల తలసరి ఆదాయం తక్కువ ఉంది. ఈ నియోజకవర్గాన్ని అభివృద్ధి చేస్తాం. ప్రజల జీవన ప్రమాణాలు పెంచుతాం. నియోజకవర్గంలో స్కిల్ డెవలెప్మెంట్ సెంటర్ ఏర్పాటు చేస్తాం. 9 ఫిషింగ్ హార్బర్లు సిద్ధం చేస్తున్నాం. బోట్లు కొనిచ్చి గ్రామాన్ని ఒక సెంటర్ గా తీసుకుని ఆర్థికంగా ఆదుకుంటాం. ఈ గ్రామంలో 499 ఇళ్లు ఉన్నాయి . 18 మందికి ఇంటి జాగా లేదు. 6 నెలల్లోగా ఇళ్లు ఇవ్వాలని కలెక్టర్లను ఆదేశిస్తున్నాను. స్థానిక ఎమ్మెల్యే ఈశ్వర రావు బాగా పనిచేస్తున్నారు. మిత్రపక్షాలను కలుపుకుపోతున్నారు. రిజర్వాయర్లు సహా కాలువలు పూర్తిచేసి ఎచ్చెర్లను సస్యశ్యామలం చేసే బాధ్యత తీసుకుంటాం.

### అందరికీ సంక్షేమం అందిస్తాం

పేదలందరికీ సంక్షేమ పథకాలు అందేలా చర్యలు తీసుకుంటున్నాం. ఇప్పటికే 200కు పైగా అన్న క్యాంటీన్లు ఏర్పాటు చేశాం. పేదలకు రూ. 4,000 పింఛు ఇస్తున్నాం. దీపం 2 పథకం కింద 3 గ్యాస్ సిలిండర్లు ఉచితంగా ఇస్తున్నాం. టీచరు పోస్టులు భర్తీ చేస్తున్నాం. రైతులకు అన్నదాత సుఖీభవ కింద ఏడాదిలో మూడు విడతల్లో రూ. 20 వేలు పెట్టుబడి సాయం అందిస్తాం. జూన్ నాటికి తల్లికి వందనం కింద ఇంట్లో ఎంతమంది పిల్లలుంటే అందరికీ రూ. 15 వేలు అందిస్తాం. వాట్సాప్ గవర్నెన్స్ ద్వారా 270 సేవలు అందిస్తున్నాం. వాటిని 1,000కి పెంచుతాం. భావనపాడులో పోర్టు కట్టాలనుకున్నాం. గత పాలకులు దాన్ని మూలపేటకు తెచ్చారు. ఐదేళ్లు ఆలస్యమైంది. రాబోయే సంవత్సరంలో మూలపేట పోర్టు పూర్తిచేస్తాం. అనకాపల్లిలో రూ. లక్ష కోట్ల పెట్టుబడితో స్టీల్ ప్లాంట్ వస్తోంది. దీనివల్ల 40 వేల మందికి ఉపాధి లభిస్తుందని సీఎం చంద్రబాబు అన్నారు.

# విశాఖ పోరాట యోధుడు అమృత రావు

తమనంపల్లి అమృతరావు. ఈ పేరు చాలా మందికి తెలియదు. 59 ఏళ్ళక్రితం విశాఖలో ఉక్కు పరిశ్రమ ఏర్పాటుకు పెద్ద ఎత్తున ఉద్యమం జరిగింది. ఒక పోరాట యోధుని మొండి పట్టు, మొక్కవోని దీక్షతో కేంద్ర ప్రభుత్వం దిగివచ్చి విశాఖలో ఉక్కు కర్మాగారం ఏర్పాటు సఫలం కాగా, నేడు కేంద్ర ప్రభుత్వ నిర్ణయం మేరకు, పోరాడి తెచ్చుకున్న ఫ్యాక్టరీ ప్రైవేటు పరం కాబోతోంది. ఈ నేపధ్యంలో నాడు విశాఖ ఉక్కు పరిశ్రమ కోసం దీక్షా దక్షులై విజయం సాధించి గొప్ప పోరాట యోధుని గుర్తుకు చేసుకోవాల్సిన తరుణం, సందర్భం. విశాఖ ఉక్కు- ఆంధ్రుల హక్కు 57ఏళ్లు దాటినా తెలుగు ప్రజల హృదయాలలో ప్రతిధ్వనిస్తున్న నినాదమది. మరచి పోలేని జ్ఞాపకాలను ఇప్పటికీ గుర్తించే అలాంటి నినాదాన్ని అమృత తుల్యం చేసి, శాశ్వతం చేసిన మహనీయుడు తమనంపల్లి అమృతరావు. అలా ఉక్కు పరిశ్రమను ఏర్పాటు, తద్వారా ఆధునిక విశాఖ నిర్మాణంలో ఆయన పాత్ర అపూర్వం, అనిర్వచనీయం. అమోఘం. 1920 అక్టోబరు 21 తేదీన గుంటూరు జిల్లా మేడికొండూరు మండలం విశదల గ్రామంలో ఆరుళప్ప అన్నమ్మ దంపతులకు జన్మించారు. చిన్న తనం నుండి రాజకీయాల మీద ఆసక్తి ఎక్కువ ఉండేది. కర్నూలు జిల్లా డోన్లో విద్యాభ్యాసం చేసిన అమృతరావు చిన్న వయస్సు లోనే క్విట్ ఇండియా ఉద్యమంలో పాల్గొని జైలు జీవితం గడిపారు. నేతాజీ స్థాపించిన ఇండియన్ నేషనల్ ఆర్మీలో కొంతకాలం పనిచేశారు. నైజాం ప్రాంతంలో జరిగిన రజాకార్ల ఉద్యమంలో పాల్గొన్న అమృత రావు నిజాం రైల్వే శానిటరీ ఉద్యోగ సంస్థ ప్రధాన కార్యదర్శిగా పని చేశారు. భాషా ప్రాతి పదికన ప్రత్యేక ఆంధ్ర రాష్ట్రాన్ని ఏర్పాటు చేయాలని కోరుతూ ప్రకాశం పంతులు నివాస గృహం ఎదుట నిరాహార దీక్ష చేశారు. పొట్టి శ్రీరాములు చేస్తున్న దీక్ష నేపథ్యంలో పలువురు రాష్ట్ర నాయకుల సూచన మేరకు నిరాహార దీక్షను విరమించారు. విశాఖలో ఉక్కు పరిశ్రమ ఏర్పాటు చేస్తామని కేంద్రం అప్పట్లో ప్రకటన చేసినా కూడా అది ఆచరణకు నోచుకోలేదు. దాంతో, రాష్ట్ర, కేంద్ర పాల కుల ఉదాశీనత ఓ వైపు, మరో వైపు ఉక్కు పరి శ్రమ వేరే రాష్ట్రాలకు తరలి పోతుందన్న ఆందోళన నేపధ్యంలో చెప్పిన మాటకు కట్టుబడి విశాఖలో ఉక్కు పరిశ్రమను ఏర్పాటు చేయాల్సిందేనని ఎలుగెత్తి అరచి ఒకే ఒక గొంతు అమృతరావుదే. అంతవరకూ విశాఖకు ఉక్కు పరిశ్రమ కావాలని కోరిన వారే తప్ప దాని, ఆచరణాత్మక కార్యక్రమాలు చేపట్టింది లేదు. పతాకస్థాయికి చేర్చి భారీ ఉద్యమాన్ని నిర్మించిన ఘనత మాత్రం అమృతరావుదే నని చెప్పాలి. ఆ 1966 సంవత్సరం అక్టోబర్ నెల 14వ తేదీ ఆరో ఓ మహోద్యమానికి శ్రీకారం చుట్టిన రోజు. ప్రత్యేక ఆంధ్ర రాష్ట్రం కోసం 56 రోజులు అకుంఠిత దీక్ష చేపట్టి, అమరణ దీక్షలోనే అసువులు బాసిన అమరజీవి పొట్టి శ్రీరాములు బాటను నడచి, చరిత్ర గర్వించిన మరో గొప్ప ఉద్యమానికి ఆవిష్కరణ జరిగిన రోజు. అదే "విశాఖ ఉక్కు ఆంధ్రుల హక్కు" నినాదంతో అమృతరావు చేపట్టిన పోరు. అమృతరావు విశాఖ కలెక్టరేట్ వద్ద ఆమరణ దీక్ష చేపట్టగా.. "విశాఖ ఉక్కు- ఆంధ్రుల హక్కు"నినాదంతో ఆంధ్ర దేశాన్ని కుదిపేసింది.ఆ ఉద్యమంలో 32 మంది ప్రాణాలను కోల్పోయారు. విద్యార్థులు బందులు నిర్వహించారు. ఈ దీక్ష రాష్ట్రంలోని నిరుద్యోగ యువత, విద్యార్థులను కదిలించింది. వామపక్షాలను ఉద్యమం వైపు అడుగులు వేయించింది. అన్ని రాజకీయ పక్షాలతో ఏర్పాటుచేసిన బహిరంగ సభలో తెన్నేటి విశ్వనాథం, యం.వి.భద్రం, రావిశాస్త్రి, చౌదరి సత్యనారాయణ తదితరులు ప్రసంగించారు. అమృతరావు దీక్షకు మద్దతుగా జనసంఘ్ పార్టీ నాయకులు, ప్రజాపార్టీ నాయకులు దీక్ష చేశారు. రోజులు గుడు స్తున్నా. ఆరోగ్యం క్షీణిస్తున్నా కూడా అమృతరావు వెనక్కు తగ్గలేదు. మొక్కవోని దీక్షతో ఉక్కు కల్పమే చూపించారు. అమృతరావు దీక్ష విరమింప జేయాలని నాటి పీసీసీ అధ్యక్షుడు తిమ్మారెడ్డి, వావిలాల గోపాలకృష్ణయ్య, అప్పడు దొర, భాట్టం శ్రీరామ్మూర్తి కొందరు కాంగ్రెస్ నాయకులు కేంద్రాన్ని కోరారు. అప్పటి ముఖ్యమంత్రి కాసు బ్రహ్మానందరెడ్డి పాటు, ఎంపీలు, మంత్రులు అంతా కూడా ఆయనను దీక్ష నుంచి విరమించు కోమని కోరారు. అదేం కుదరదు కచ్చితమైన ప్రకటన రావాల్సిందే, లేదా నా చావును అంతా చూడాల్సిందేనని భీష్మించుకు కూర్చున్నారు. కాసు బ్రహ్మానందరెడ్డి ఆఘమేఘాల మీద ఢిల్లీకి వెళ్లి అక్కడి పెద్దలను కలసి విశాఖ ఉక్కు ఉద్యమాన్ని గురించి వివరించారు. అప్పటికే కొత్తగా ప్రధానమంత్రి అయిన శ్రీమతి ఇందిరాగాంధీ దృష్టిలో విశాఖ ఉక్కు ఉద్యమం పడింది. అమృతరావు మొండితనాన్ని గురించి ఆమె తెలుసు కున్నారు. విశాఖలోనే ఉక్కు పరిశ్రమను ఏర్పాటు చేస్తామని లిఖిత పూర్వకంగా ఇచ్చారు. కాసు బ్రహ్మానందరెడ్డి విశాఖకు నేరుగా వచ్చి, కలెక్టరేట్ వద్ద దీక్షలో ఉన్న అమ్ముృతరావుకు కేంద్రం ప్రకటనను వినిపించి, నిమ్మరసం ఇచ్చి దీక్షను విరమింప చేశారు. ఆ విధంగా విశాఖలో 1971లో ఉక్కు కర్మాగారం ఏర్పడింది. ఆయన సతీమణి చిరంజీవి కూడా గుంటూరులో విశాఖ ఉక్కు కోసం పది రోజులు ఆమరణ దీక్ష చేయడం గమనార్హం. అమృతరావు తమ జీవితాన్ని ప్రజాసేవకే అంకితం చేయదలచి గాంధీజీ మిషన్ అనే సంస్థను స్థాపించారు.1956లో ఢిల్లీలో జరిగిన జాతీయ స్థాయి మధ్య నిషేధ కార్యకర్తల మండలికి సభ్యులయ్యారు. గుంటూరు పట్టణం లో పొట్టి శ్రీరాములు నగర్ ఏర్పాటుకు కృషి చేసి వందలాది నిరు పేదలకు వసతి సౌకర్యం కలిగించారు 1971లో జై.ఆంధ్ర ఉద్యమంలో ఆది ఆంధ్ర సేవను స్థాపించారు. ఎస్సీ కార్పొరేషన్ నిధులతోవారి అభ్యున్నతికి కృషి చేశారు. అమృతరావు హైదరాబాద్ జంట నగరాలలో సెట్విన్ బస్సుల ఏర్పాటుకు కృషి చేశారు. జాతీయ ప్రొహిబిషన్ కౌన్సిల్ సభ్యుడిగా వ్యవహరించారు. మన పుణ్యభూమి వారపత్రికకు సంపాదకులుగా వ్యవహరించిన అమృతరావు 1989 ఏప్రిల్ 27న కన్నుమూశారు. ప్రజల కోసం అమృతరావు పోరాటం తెలుగువారికి ప్రత్యేక రాష్ట్రం కావాలన్న డిమాండుతో మొదలైంది. ప్రత్యేక రాష్ట్రం కోరుతూ అప్పటి ముఖ్యమంత్రి టంగుటూరి ప్రకాశం పంతులుకు రక్తంతో లేఖ రాశారు. మద్రాసులో సీఎం కార్యాలయం ఎదుట దీక్షకు కూర్చున్నారు. ముఖ్యమంత్రి విజ్ఞప్తి మేరకు ఆ దీక్ష విరమించారు. అనంతరం విశాఖ ఉక్కు కోసం పోరాటంలో భాగంగా దీక్ష చేశారు. 1978లో కొత్తగా ఏర్పడిన తాడికొండ నియోజకవర్గం నుంచి ఎమ్మెల్యేగా గెలుపొందారు. అప్పట్లో వైఎస్ రాజశేఖర్రెడ్డి, చంద్రబాబుతో కలిసి అసెంబ్లీలో అడుగుపెట్టారు. రాష్ట్రంలో ఎస్సీ కార్పొరేషన్ తొలి ఛైర్మెన్గా పనిచేశారు. 1989లో కన్ను మూశారు. ఆ సమయంలో అంత్యక్రియల ఖర్చుల కోసం కూడా కుటుంబసభ్యులు వేరే వారిపై ఆధారపడాల్సి వచ్చిందని ఆయన మనవడు మోహనగాంధీ వివరించారు.

# తెలంగాణ సాధనలో తెరాస పాత్ర సింహావలోకనం

తెలంగాణ రాష్ట్ర చరిత్రలో ఏప్రిల్ 27 మరిచి పోలేని రోజు. ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర సాధనే ఏకైక లక్ష్యంగా తె.రా.స పార్టీ ఆవిర్భవించిన రోజు. ఆనాడు కేసీఆర్ మరి కొందరి భాగస్వామ్యంతో తె.రా.స ఉద్యమ పార్టీ ఏర్పాటు జరగక పోతే, నేటి ప్రత్యేక రాష్ట్ర ఏర్పాటు తెలంగాణ ప్రజల చిర కాల వాంచితంగానే మిగిలి పోయి ఉండేదేమో. తెలంగాణ ప్రత్యేక రాష్ట్ర సాధన తొలి దశలో ఉవ్వెత్తున ఎగసిన ఉద్యమం స్వార్థ ప్రయోజనాల కారణంగా చల్లారి పోగా, మలి దశ ఉద్యమం కేసీఆర్ సమర్థ నాయకత్వం, వ్యూహాత్మక ఎత్తుగడలు, ప్రణాళికా బద్ధమైన కార్యక్రమాలు, రాజకీయ జేఏసీ ఏర్పాటు, ఉద్యోగ, స్వచ్ఛంద సంస్థల తోడ్పాటు, గ్రామ గ్రామాన ఉద్యమ రూపాలు, ప్రధానంగా ప్రజల ప్రత్యక్ష భాగస్వామ్యాన్ని కల్పించిన నేపద్యం వెరసి లక్ష్య సాధనకు దోహదం అయింది. తొలిదశ తెలంగాణ ఉద్యమం, మలిదశలో తెలంగాణ సిద్ధాంతకర్త జయశంకర్ ప్రారంభించిన కార్యక్రమాలు కేసీఆర్ పై తొలగని ప్రభావం చూపాయి. 2001లో కొత్తగా ఉత్తరాఖండ్, జార?ండ్, ఛత్తీస్గఢ్ రాష్ట్రాల ఏర్పాటు నేపద్యం తెలంగాణ ఏర్పాటు సాధ్యాసాధ్యాల గురించి చర్చలకు తెర లేపాయి. ఈ క్రమంలోనే తెలంగాణ ఉద్యమకారులతో ఏర్పాటుచేసిన సమావేశాల్లో రాష్ట్ర సాధన ఉద్యమం గురించి కేసీఆర్ విస్తృతంగా చర్చించారు. ఫలితంగా ప్రజల మనోభావాలకు అనుగుణంగా, తెలంగాణ రాష్ట్ర సమితి పార్టీ ఏర్పాటుచేయాలన్న ఆలోచనను బలపరిచాయి. ఫలితంగా, 2001 ఏప్రిల్ 27 న కల్వకుంట్ల చంద్రశేఖరరావు అప్పటి ఆంధ్రప్రదేశ్ శాసనసభ ఉపసభాపతి పదవికి, శాసనసభా సభ్యత్వానికి, తెలుగుదేశం పార్టీ ప్రాథమిక సభ్యత్వానికి రాజీనామా చేసి, తన ఆలోచనలతో ఏకీభవించిన కొందరు నాయకులతో కలిసి తెరాసను ఏర్పాటు చేశారు. నిజాం మనుమరాలు సలీమా బాషా (అస్మత్ బాషా కుమార్తె), ఆమె కుమార్తె రఫత్షా ఆజంపురాలు తెలంగాణకు మద్దతు ప్రకటించారు. పాతబస్తీలోని ముస్లిం వర్గాలు తెలంగాణకు వ్యతిరేకం కాదని అన్నారు. 2001 ఏప్రిల్ 27న కొండా లక్ష్మణ్ బాపూజీ నివాసం జలదృశ్యంలో టీఆర్?ఎస్? పార్టీ పురుడు పోసుకుంది. సుదర్శన్ రావు, నాయిని నర్సింహారెడ్డి, హన్మంతరావు, గాదె ఇన్నయ్య, వి. ప్రకాశ్ , నిమ్మ నర్సింహారెడ్డి, నారాయణరెడ్డి, గొట్టె భూపతి, మందాడి సత్యనారాయణరెడ్డి, హరీశ్ రావు తదితరులు ఆనాటి కార్యక్రమంలో పాల్గొన్న వారిలో ఉన్నారు. సుమారు ఏడాదికి పైగా జలదృశ్యం లోనే టీఆర్ ఎస్ పార్టీ కార్య కలాపాలు సాగాయి. 2001 మే 17న కరీంనగర్ ఎస్ ఆర్ ఆర్ కాలేజీ గ్రౌండ్ లో నిర్వహించిన బహిరంగ సభ ఉమ్మడి ఏపీ రాజకీయాల్లో పెను మార్పులకు బీజం వేసింది. జేఎంఎం చీఫ్ , అప్పటి జార?ండ్ సీఎం శిబూ సోరెన్ ఈ సభకు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. కొన్ని రోజుల తర్వాత తెలంగాణ రాష్ట్ర సమితి కార్యకలాపాలు నందినగర్ , హైదరాబాద్ లోని కేసీఆర్ నివాసానికి మారాయి. ఆరు నెలల తర్వాత ఎమ్మెల్యే కాలనీలోని మాజీ మంత్రి వేదంతరావు ఇంటికి పార్టీ కార్యాలయాన్ని మార్చారు. 2004లో వైఎస్ ప్రభుత్వం బంజారాహిల్స్ రోడ్? నంబర్? 12లో ప్రస్తుతం తెలంగాణ భవన్? ఉన్న స్థలాన్ని టీఆర్ఎస్ కు కేటాయించింది. రేకుల షెడ్డు వేసి టీఆర్?ఎస్? పార్టీ ఆఫీసు నిర్మాణాన్ని ప్రారంభించారు. 2006లో తెలంగాణ భవన్ ను ప్రారంభించారు. పార్టీకి సైద్ధాంతిక భూమిక కల్పించడం దగ్గర్నుంచి కార్యాచరణను నిర్దేశించడం వరకు , తెలంగాణ సమాజాన్ని, దేశ రాజకీయ వ్యవస్థ స్వభావాన్ని లోతుగా అధ్యయనం చేసి, అర్థం చేసుకుని, తెలంగాణ ఉద్యమ వ్యూహానికి రూపకల్పన చేశారు కేసీఆర్. స్ట్రీట్ ఫైట్ స్థానంలో స్టేట్ ఫైట్ ఉండాలని భావించి , అందుకు వాహకంగా తెలంగాణ రాష్ట్ర సమితి (టీఆర్ఎస్ )ని ప్రణాళికా బద్ధంగా తీర్చిదిద్దారు. 2004 లో టిఆర్ఎస్ కాంగ్రెస్ పార్టీతో ఎన్నికల పొత్తు పెట్టుకుని, టిఆర్ఎస్ 26 మంది ఎమ్మెల్యేలను, 5 మంది ఎంపిలను గెలుచుకుంది. తద్వారా శాసనసభ, లోకసభలలో స్థానాలను పొందింది. టిఆర్ఎస్ అధ్యక్షుడు కెసిఆర్ కేంద్ర మంత్రిగా కొంతకాలం పనిచేశారు. కొంతకాలం పోర్ట్ఫోలియో లేకుండా కూడా కొనసాగారు. 2006 లో తన మంత్రిత్వ శాఖకు రాజీనామా చేశారు. సెప్టెంబర్ 2006 లో కెసిఆర్ కరీంనగర్ లోక్ సభ స్థానానికి రాజీనామా చేసి ఉప ఎన్నికలో భారీ మెజారిటీతో గెలిచారు. ఏప్రిల్ 2008 లో, టిఆర్ఎస్ పార్టీ ఎమ్మెల్యేలచే రాజీనామా చేయించి, రాష్ట్ర ప్రభుత్వం నుండి వైదొలిగారు. కానీ, ఈ ఉప ఎన్నికలో టిఆర్ఎస్ 7 ఎమ్మెల్యే, 2 లోక్ సభ స్థానాలను మాత్రమే నిలుపుకో గలిగింది. 2009 ఎన్నికలలో టిడిపి పొత్తుతో టిఆర్ఎస్ 10 ఎమ్మెల్యే సీట్లు, 2 ఎంపి సీట్లు మాత్రమే గెలుచుకో గలిగింది. తెలంగాణ రాష్ట్ర సమితి 2004 ఎన్నికల్లో కాంగ్రెస్తో పొత్తు, నాటి కాంగ్రెస్ అధినేత్రి సోనియాతో కరీంనగర్లో ప్రత్యేక తెలంగాణ ఇస్తామని ప్రకటింప జేయడం, రాష్ట్రపతి ప్రసంగంలో తెలంగాణ అంశాన్ని చేర్చడం, యూపీఏ కనీస ఉమ్మడి ప్రణాళిక (కామన్ మినిమమ్ ప్రోగ్రాం)లో తెలంగాణ అంశం చేర్చడంలో టీఆర్ఎస్ విజయం సాధించింది. తెలంగాణకు అనుకూలంగా దాదాపు 36 పార్టీలు లేఖ ఇవ్వడంలో ఢిల్లీ వేదికగా టీఆర్ఎస్ పార్టీ కృషి చేసింది. "కేసీఆర్ వచ్చుడో తెలంగాణ వచ్చుడో" అంటూ కేసీఆర్ నవంబర్ 29, 2009 న, కేసిఆర్ నిరవధిక నిరాహార దీక్షను చేపట్టారు. ఆయన దీక్షతో తెలంగాణలో ఉద్యమం ఉధృతం అయింది. డిసెంబర్ 7 న అఖిలపక్ష సమావేశానికి రాష్ట్ర ప్రభుత్వం పిలుపునిచ్చింది. దీంతో దిగివచ్చిన యూపీఏ2 ప్రభుత్వం తెలంగాణ ఏర్పాటు దిశగా ప్రక్రియ ప్రారంభిస్తామంటూ 2009 డిసెంబర్ 9న ఒక ప్రకటన చేసింది. కానీ, కోస్తాంధ్ర, రాయలసీమ ప్రాంతాల నుంచి నిరసనలు వెల్లువెత్తడంతో డిసెంబర్ 23న ఆ నిర్ణయాన్ని వెనక్కి తీసుకుంది. తెలంగాణ ఏర్పాటుపై అందరి అభిప్రాయాలను సేకరించేందుకు శ్రీకృష్ణ కమిటీని ఏర్పాటు చేసింది.తెలంగాణ జెఏసి, అనేక సంస్థలు, ప్రొఫెసర్ కోదండరం దాని ఛైర్మన్గా టిజెఎసి ప్రారంభించిన పలు ఆందోళనలు, నిరసనలలో టిఆర్ఎస్ గ్రామస్థాయి నుండి చురుకుగా పాల్గొన్నారు. ఈ రాజకీయ ఐక్య కార్యాచరణ కమిటి ప్రత్యేక తెలంగాణ కోసం కేంద్రంపై ఒత్తిడిని తీవ్రం చేసింది. 2010 డిసెంబర్ 16న వరంగల్లో టీఆర్ఎస్ తలపెట్టిన మహా గర్జనకు 20 లక్షల మంది హాజరు అయ్యారు. శ్రీకృష్ణ కమిటీ నివేదిక సమర్పణ తర్వాత 2011 జనవరి నుండి టీఆర్ఎస్ అనేక ఆందోళన కార్యక్రమాలు చేపట్టింది.తెలంగాణ రాష్ట్ర ఉద్యమంలో భాగంగా 2013 అక్టోబర్లో తెలంగాణ బిల్లుకు కేంద్ర కేబినెట్ ఆమోదం తెలిపింది.2014 ఫిబ్రవరి 18న లోక్సభ, 20న రాజ్యసభ ఆమోదం తెలిపింది. మరో వైపు 2014 ఏప్రిల్లో సాధారణ ఎన్నికలు జరుగగా, మే 16న ఫలితాలు వచ్చాయి. తెలంగాణలోని 119 అసెంబ్లీ స్థానాలకు గాను టీఆర్ఎస్ 63, 11లోక్సభ స్థానాలను గెలుపొందింది. దీంతో తెలంగాణలో జూన్ 2న రాష్ట్ర ఆవిర్భావంతో పాటు రాష్ట్ర తొలి ముఖ్యమంత్రిగా కేసీఆర్ ప్రమాణ స్వీకారం చేశారు. 2018 డిసెంబరు 7 న జరిగిన తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల్లో టీఆర్ఎస్ 88 స్థానాల్లో గెలుపొంది ఘనవిజయం సాధించి, డిసెంబరు 13 గురువారం మధ్యాహ్నం 1:25 నిమిషాలకు రాజ్ భవన్లో కేసీఆర్ తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రిగా కేసీఆర్ ప్రమాణ స్వీకారం చేశారు. మలి సారి పదవీ బాధ్యతలు చేపట్టారు. ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు ధ్యేయంగా పార్టీని స్థాపించిన ఉద్యమ నేత కేసీఆర్ రెండు సార్లు అధికారంలోకి వచ్చి ముఖ్యమంత్రిగా స్వయం పాలనా పగ్గాలు చేపట్టారు. తెలంగాణలోని సంఘాలు, విద్యార్థులు, రాజకీయ నేతల సహాయంతో ఉధృతంగా ఉద్యమం చేసి, ప్రత్యేక రాష్ట్రాన్ని సాధించిన టీఆర్?ఎస్, ఎన్నో ఆటుపోట్లను చవిచూసింది. ఎందరో పార్టీని వీడి వెళ్లారు. ఎందరో చేరారు. తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు తర్వాత పూర్తి స్థాయి బలమైన రాజకీయ పార్టీగా మారింది. కేసిఆర్ నేతృత్వంలో ప్రస్తుతం భారతీయ రాష్ట్ర సమితిగా పేరు మార్చుకుని, రాష్ట్ర రాజకీయాలలో కీలక పాత్ర పోషిస్తూ , ఇటీవలి సాధారణ ఎన్నికల్లో ఓటమిని చవి చూసి, అధికారాన్ని కోల్పోయి, ప్రతిపక్ష పాత్ర పోషిస్తూ, గడ్డుకాలంలో కొట్టుమిట్టాడుతున్నది.

## ప్రసూతి చికిత్స పితామహుడు

డాఎం వి.ఎన్.శిరోద్కర్ ప్రపంచవ్యాప్తంగా 'శిరోద్కర్ కుట్టు' కనుగొన్న వ్యక్తిగా ఖ్యాతిగాంచారు. ఆయన మహిళల వ్యాధుల చికిత్సకు ఎంతో దోహదం చేశారు. విఠల్ నగేశ్ శిరోద్కర్ 1899లో గోవాలోని శిరోదా గ్రామంలో జన్మించారు. గ్రామం పేరు మీదనే వారికి ఆ ఇంటి పేరు సంక్రమించింది. హుబ్లీలో విద్యను అభ్యసించి ముంబయిలోని గ్రాంట్ వైద్య కళాశాలలో చేరారు. 1923లో ఎం.బి.బి.ఎస్. పరీక్షలో ఉత్తీర్ణులయ్యారు. గర్భధారణ, ప్రసూతి శాస్త్రంలో స్పెషలైజేషన్తో ముంబయి విశ్వవిద్యాలయం నుంచి 1927లో యం.డి. పట్టా పొందారు. ఉన్నత విద్య కోసం ఇంగ్లాండు వెళ్ళారు. అక్కడ పని చెయ్యటం ఆయనకు ఎంతగానో తోడ్పడింది. ఆధునిక శస్త్ర చికిత్స విధానాలను అక్కడ నేర్చుకున్నారు. ఎందరో ప్రముఖ వైద్యులను, శాస్త్రజ్ఞులను కలుసుకున్నారు. 1931లో ఎఫ్.ఆర్.సి.ఎస్ (ఇంగ్లాండు) పొందారు. ముంబయిలో జె.జె.ఆసుపత్రులకు గర్భధారణ, స్త్రీల వ్యాధులలో గౌరవ ఆచార్యులుగా నియుక్తులయ్యారు. జె.జె.ఆసుపత్రి చాలా విశిష్టమైనది. 4,000 పడకలతో ప్రపంచంలోని పెద్ద ఆసుపత్రులలో అది ఒకటి. 1,500 పట్టా స్థాయి, 650 పిజి స్థాయి విద్యార్థులు ఉంటారు. అది ఆసియాలో ఆధునిక విద్యకు 175 సంవత్సరాల చరిత్ర కలిగిన ఒక ప్రాచీన విద్యా సంస్థ. ఇదే సంస్థలో చారిత్రక ఖ్యాతి గాంచిన రాబర్ట్ కాచ్ పనిచేశారు. క్షయ వ్యాధి మీద చేసిన పరిశోధనలకు అతనికి నోబెల్ పురస్కారం లభించింది. మామూలు గర్భసంచిలో గర్భాశయ ముఖ కండరం మూసుకుని ఉంటుంది. బలహీన గర్భాశయంలో గర్భాశయ ముఖద్వారం తెరుచుకుని ఉంటుంది. 1955లో డాఎం శిరోద్కర్ గర్భాశయ ముఖానికి శస్త్ర చికిత్స గురించి వివరించారు. కాల పరీక్షకు నిలబడి ఈనాటికీ దీనిని పాటిస్తున్నారు. గర్భాశయ లోపాలను సరిచేయడానికి ప్రత్యేకమైన పరికరాలను రూపొందించారు. దీనికి చాలా మార్పులు చేశారు కానీ అసలు శస్త్ర చికిత్స ఇప్పటికీ అద్వితీయంగా నిలిచి ఉంది.1951లో పారిస్ లోనూ, 1956లో నేపుల్స్ లోనూ జరిగిన అంతర్జాతీయ సమావేశాలలో తన శస్త్ర చికిత్స గురించి వివరించారు. ఒక హాలీవుడ్ తారకి ఈ పద్ధతితో శస్త్ర చికిత్స సఫలం కావడంతో అతడి ఇటాలియన్ బంధం మరింత బలపడింది. అన్ని రకాల గర్భస్రావాలకు తన శస్త్ర చికిత్స పని చేయదని తెలుసుకోగల సునిశిత బుద్ధి ఆయనది. ఎటువంటి పరిస్థితుల్లో తన శస్త్ర చికిత్స ఉపయోగపడే అవకాశముందో, ఎటువంటి వాటిలో ఉపయోగపడదో స్పష్టంగా విశదీకరించారు. సామాన్యంగా అనిపించే ప్రతిదానిని ప్రశ్నించే తత్వం కలిగిన డాఎం శిరోద్కర్కు శస్త్ర చికిత్స, దాని వెనక ఉన్న ఆలోచన తట్టి ఉండొచ్చు. ఈ శస్త్ర చికిత్సపై రాసిన పత్రానికి పీఠికలో ఇలా పేర్కొన్నారు "పరిపూర్ణం కాని శస్త్ర చికిత్స పద్ధతుల పట్ల నేను సంతృప్తి చెందేవాడిని కాదు. ఎప్పటి నుంచో వాడుకలో ఉన్న పద్ధతులను మెరుగు పరచడానికి నాకు ఉపాయాలు తడుతూ ఉండేవి."1951 జూన్లో ఫ్రెంచి గైనకాలజీ సంఘ రజతోత్సవ ఉత్సవాల్లో, గర్భాశయ ముఖం చుట్టూ మూడు వరుసల కాటన్ పెట్టడానికి శస్త్ర చికిత్స చేసే విధానాన్ని చిత్రాల ద్వారా చూపించారు. ఆ తరువాత కరిగే గుణం ఉన్న కాటన్ ఇందుకు సరైనది కాదని గమనించారు. ఈ పద్ధతిని మార్చి 4-6 నెలల్లో అకారణంగా జరిగే గర్భస్రావాలకు తొడ నుంచి తీసిన నారపట్టి (ఫాసియా లాటా) లినెన్లు ఉపయోగించే శస్త్ర చికిత్సను రూపొందించారు. దీనినే ఇప్పుడు ప్రపంచ వ్యాప్తంగా "శిరోద్కర్ శస్త్ర చికిత్స"గా పిలుస్తున్నారు. ఇందుకు రాబోయే తరాలు ఎప్పటికీ ఆయనను గుర్తుంచుకుంటాయి. 1971 మార్చి 7న ప్రొఫెసర్ శిరోద్కర్ ముంబయిలో మరణించారు. ఆయన తల్లి గర్భాశయ ముఖ క్యాన్సర్తో మరణించారు. డాఎం శిరోద్కర్ కుమారుడు మనోహర్ శిరోద్కర్ ఈ వ్యాధికి ఉన్న వైరల్ కారణాలపై పరిశోధనలు జరిపారు. మొదట్లో ఆయన జాన్ హాప్కిన్స్ ప్రజారోగ్య కళాశాలలో పని చేశారు. క్యాన్సర్ కారకమైన 'రౌస్ సర్కోమా' వైరస్ (మొట్టమొదటగా కనుగొన్న క్యాన్సర్ వైరస్) గురించి పరీక్షలు జరిపారు. తరవాత ఆయన పూనాలోని రాక్ ఫెల్లర్ ఫౌండేషన్ వైరస్ పరిశోధనా కేంద్రంలో పని చేశారు. యువకునిగా ఉన్నప్పుడు మనోహర్ శిరోద్కర్, ప్రఖ్యాతిగాంచిన తన తండ్రి పట్ల ఆరాధన ఉన్నప్పటికీ, వైద్య విద్య పట్ల ఆసక్తి చూపలేదు. 1976లో, మనోహర్, ఆయన భార్య సుధ డాఎంవి.ఎన్.శిరోద్కర్ జ్ఞాపక పరిశోధన ఫౌండేషన్ ని స్థాపించారు. ఈ సంస్థ మనోహర్ శిరోద్కర్, ఆయన తండ్రి కన్న కలలకు రూపాన్ని ఇచ్చింది. ఈ సంస్థ అట్టడుగు వర్గాలకు చెందిన యువతుల్లో గర్భాశయ ముఖ క్యాన్సర్ పరీక్షలు జరుపుతుంది. వైరల్ వ్యాధులను నయం చేయడానికి కొత్త జైవిక ఏజెంట్లపై పరిశోధనలు చేస్తుంది. విధి నిర్వహణలో తీరిక లేకుండా ఉండటమే కాకుండా, ప్రొ. వి.ఎన్. శిరోద్కర్ విస్తృతంగా రాసేవారు. సాంఘిక వైద్యంలో ఆసక్తి కనపరిచేవారు. గర్భస్రావాలకు సంబంధించిన శాంతీలాల్ షా కమిటీలో ఆయన సభ్యులు. భారత దేశంలో కుటుంబ నియంత్రణ సంస్థను స్థాపించారు. 1971లో భారత ప్రభుత్వం ఆయనను పద్మ విభూషణ్ బిరుదుతో సత్కరించింది.

## అన్నదమ్ముల మధ్య 100 కోట్ల దావా

విజయవాడ, ఏప్రిల్ 26 కేశినేని బ్రదర్స్ మధ్య గొడవ ముదురుతోంది. విశాఖలో ఉర్సా కంపెనీకి భూముల కేటాయింపు నేపథ్యంలో విజయవాడ మాజీ ఎంపీ అయిన కేశినేని నాని.. ప్రస్తుత ఎంపీ, సోదరుడు అయిన కేశినేని చిన్నిపై ఇటీవల ఆరోపణలు చేశారు. జవాడ బ్రదర్స్ కేశినేని నాని, కేశినేని చిన్నిల మధ్య యుద్ధం పీక్ కు చేరుకుంది. గత రెండు రోజులుగా కేశినేని నాని చేస్తున్న ఆరోపణలపై ప్రస్తుత విజయవాడ ఎంపీ కేశినాని చిన్ని స్పందించారు. వంద కోట్ల రూపాయల పరిహారం కోరుతూ లీగల్ నోటీసులు పంపారు. అయితే లీగల్ నోటీసులకు కేశినేని నాని స్పందించారు. తాను పది సంవత్సరాల పాటు పార్లమెంటు సభ్యుడిగా పనిచేశానని, జవాబుదారీతనం పారదర్శక,సమగ్రతతో పనిచేశానని చెప్పారు. తాను చేసిన ఆరోపణలకు ఇప్పటికీ కట్టుబడి ఉన్నానని అన్న కేశినేని నాని తాను మౌనంగా ఉండబోనని, అక్రమాలపై ప్రశ్నలు వేస్తే సమాధానాలు చెప్పకుండాబెదిరింపులకు దిగుతారని ఆగ్రహం వ్యక్తం చేశారు.ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుకు కేశినేని నాని లేఖ కూడా రాశారు. ఈ నేపథ్యంలో వైసీపీ హయాంలో జరిగిన మద్యం కుంభకోణం నుంచి ప్రజల దృష్టి మరల్చేందుకు.. విదేశీ కంపెనీలపై అసత్య ప్రచారాలు చేస్తున్నారని కేశినేని చిన్ని (కేశినేని శివనాథ్) మండిపడ్డారు. పెట్టుబడులు రాకూడదనే ఉద్దేశంతో విషం చిమ్ముతున్నారంటూ విమర్శించారు. ఈ క్రమంలోనే కేశినేని నానిపై కేశినేని చిన్ని వంద కోట్లకు పరువు నష్టం దావా వేస్తూ లీగల్ నోటీసులు పంపించారు. ఈ నేపథ్యంలో కేశినేని చిన్ని పరువు నష్టం దావాపై కేశినేని నాని స్పందించారు. ఎక్స్ వేదికగా ట్వీట్ చేశారు.కేశినేని చిన్ని పంపించిన లీగల్ నోటీసుపై కేశినేని నాని సోషల్ మీడియా ద్వారా కౌంటర్ ఇచ్చారు. రూ. 100 కోట్లు కాదు లక్ష కోట్లకు పరువు నష్టం దావా వేసినా ప్రజల సంపద దోచుకునే వారిపై తన పోరాటం అగదని కేశినేని నాని స్పష్టం చేశారు. విజయవాడ ప్రజలు తనకు పదేళ్లు ఎంపీగా పనిచేసే అవకాశం ఉచ్చారని.. అలాంటి ప్రజల పట్ల తాను జవాబుదారీతనం, పారదర్శకత, నిజాయతీతో ఉంటానన్నారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుకు రాసిన లేఖలోని ప్రతీ మాటకు తాను కట్టుబడి ఉన్నట్లు కేశినేని నాని స్పష్టం చేశారు.కేశినేని చిన్ని తనకు పంపించింది కేవలం లీగల్ నోటీసు మాత్రమే కాదని.. విమర్శలను బెదిరించడానికి , మౌనంగా ఉంచడానికి, నోరు మూయించడానికి చేస్తున్న ప్రయత్నమని ఆరోపించారు.

# అధికారులకు కలిసిరాని ఇంటెలిజెన్స్ బ్యూరో

# నిన్న ఏవీబీ...ఇవాళ పీఎస్ ఆర్

విజయవాడ, ఏప్రిల్ 26, ఆంధ్రప్రదేశ్‌లో ఐపీఎస్ అధికారులకు ఇంటెలిజెన్స్ బాధ్యతలు పెద్దగా అచ్చి రావడం లేదు. గత పదేళ్లలో ప్రభుత్వాలకు కళ్లు, చెవులుగా పనిచేసిన ఇద్దరు డీజీ స్థాయి అధికారులు తర్వాతి కాలంలో చిక్కుల్లో పడ్డారు. 2014-19 మధ్య కాలంలో ఇంటెలిజెన్స్ బాధ్యతలు చూసిన ఏబీ వెంకటేశ్వరరావు వైసీపీ ప్రభుత్వంలో వేధింపులకు గురైతే, 2019-24 మధ్య కాలంలో ఇంటెలిజెన్స్ చీఫ్‌గా పనిచేసిన పిఎస్సార్ ఆంజనేయులు ఏకంగా జైలుకు వెళ్లాల్సి వచ్చింది.

ఏపీలో రాజకీయాలకు ప్రభుత్వ అధికారులు మూల్యం చెల్లించుకోవాల్సి వస్తోంది. ప్రభుత్వాలను నడిపించే నేతల ఆదేశాలను తూచ తప్పకుండా పాటించడమే వారికి శాపంగా మారుతోందనే విమర్శలు ఉన్నాయి. గత పదేళ్లలో ఇద్దరు డీజీ స్థాయి అధికారులు ఎదుర్కొన్న పరిణామాలు చర్చనీయాంశంగా మారాయిఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో కీలకమైన నగరాల్లో విజయవాడ పోలీస్ కమిషనరేట్ ఒకటి. హైదరాబాద్ తర్వాత కమిషనరేట్ హోదా పొందిన విజయవాడ నగరంలో పనిచేయడం ఐపీఎస్ అధికారులు గుర్తింపుగా భావించేవారు. రాష్ట్ర విభజన తర్వాత విజయవాడ సీపీలుగా పనిచేసిన ఇద్దరు ఐపీఎస్ అధికారులు ఇంటెలిజెన్స్ చీఫ్‌లు అయ్యారు. రాష్ట్ర విభజన తర్వాత 2014లో ఏపీలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చింది. హైదరాబాద్ ఉమ్మడి రాజధానిగా ఏపీలో పాలన మొదలైంది. 2014లో తొలి ఏడాది పాలనలో కుదురుకోడానికి, రాజధాని నగరాన్ని ఎంపిక చేసుకోవడంలోనే కాలం గడిచి పోయింది. అప్పట్లో ఆంధ్రప్రదేశ్ పాలనా యంత్రాంగం మొత్తం హైదరాబాద్ నుంచి నడిచేది.

విజయవాడలో సీఎం చంద్రబాబు తాత్కాలిక బస ఏర్పాటు చేసుకోడానికి కూడా ఏడెనిమిది నెలల సమయం పట్టింది.

ఇరిగేషన్ శాఖకు చెందిన పులిచింతల ఎస్ఈ కార్యాలయాన్ని దశల వారీగా సిఎం క్యాంపు ఆఫీసుగా మార్చుకున్నారు. అప్పట్లో ఇంటెలిజెన్స్ బాధ్యతలు ఐపీఎస్ అధికారి ఏఆర్ అనురాధ పర్యవేక్షించేవారు. 2015 మే నెలలో హైదరాబాద్‌లో జరిగిన రాజకీయ పరిణామాలతో టీడీపీ ప్రభుత్వం ఇరకాటంలో పడింది. ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో జరిగిన ఘటనలు ఏపీ, తెలంగాణల మధ్య రాజకీయంగా తీవ్రమైన ఒత్తిడికి కారణమైంది. అదే ఏడాది జులైలో అనురాధను ఇంటెలిజెన్స్ బాధ్యతల నుంచి తప్పించారు.

ఆ సమయంలోనే విజయవాడ సీపీగా ఉన్న ఏబీ వెంకటేశ్వరరావుకు ఇంటెలిజెన్స్ బాధ్యతలు అప్పగించారు. విజయవాడ సీపీగా గౌతమ్ సవాంగ్‌ను నియమించారు. ఏబీ వెంకటేశ్వరరావు ఆ తర్వాత 2019 వరకు ఆయన ఆ పదవిలో కొనసాగారు. 2019లో వైసీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత నిఘా విభాగంలో అక్రమాలు జరిగాయంటూ ఆయనపై వైసీపీ ప్రభుత్వం సస్పెన్షన్ వేటు పడింది. ఆయనపై పలు అభియోగాలు నమోదు చేశారువైసీపీ అధికారంలోక వచ్చిన తర్వాత అంతకు ముందు ప్రభుత్వంలో వైసీపీకి వ్యతిరేకంగా జరిగిన పరిణామాలకు ఆయన్ని బాధ్యుడిని చేశారనే ఆరోపణలు ఉన్నాయి. 2014-19 మధ్య కాలంలోగా చంద్రబాబు ప్రభుత్వంలో కీలకంగా పనిచేసిన అధికారులంతా జగన్ హయంలో కీలక బాధ్యతలు దక్కించుకున్నారు.

సిఎంఓ ముఖ్య కార్యదర్శిగా పనిచేసిన సతీష్ చంద్ర వంటి అధికారులకు కూడా కీలక పోస్టింగులు దక్కాయి. ఏబీ వెంకటేశ్వరరావు మాత్రం పోస్టింగ్ కోసం వైసీపీ నాయకుల వద్దకు వెళ్లాలని సన్నిహితులు సూచించినా తాను వెళ్లలేదని చెప్పేవారు. ఈ క్రమంలోనే ఏబీ వెంకటేశ్వరరావు దాదాపు నాలుగున్నరేళ్ల పాటు ఎలాంటి పోస్టింగ్ లేకుండా ఉండాల్సి వచ్చింది. 2019-24 మధ్య కాలంలో పోస్టింగ్ కోసం హైకోర్టు, సుప్రీం కోర్టులలో న్యాయ పోరాటం చేయాల్సి వచ్చింది. ఉన్నత పోస్టింగ్‌లో ఉండాల్సిన అధికారి చివరి క్షణం వరకు పోస్టింగ్ కోసం పోరాడారు. చివరకు కోర్టు ఆదేశాలతో చివరి రోజు ప్రింటింగ్ అండ్ స్టేషనరీ విభాగంలో పదవీ విరమణ చేయాల్సి వచ్చింది. టీడీపీ హయంలో 23 మంది వైసీపీ ఎమ్మెల్యేలు పార్టీ ఫిరాయించడానికి ఏబీ వెంకటేశ్వరరావు కారణమనేది వైసీపీ వర్గాల ఆరోపణ. రాజకీయ నిర్ణయాలతో తనకు సంబంధం లేదని ఆయన పలు సందర్భాల్లో ప్రకటించారు. 2024లో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఆయనకు ప్రాధాన్యత లభిస్తుందని భావించినా ప్రభుత్వం ఇచ్చిన పోస్టింగ్ స్వీకరించలేదు. ఇటీవల రాజకీయాల్లోకి వస్తున్నట్టు ప్రకటించారు. 2019లో వైసీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత మొదట్లో కొద్ది నెలల పాటు తెలంగాణ క్యాడర్‌కు చెందిన స్టీఫెన్ రవీంద్ర ఏపీ ఇంటెలిజెన్స్ బాధ్యతలు ఇవ్వాలని జగన్ భావించారు. స్టీఫెన్ బదిలీకి కేంద్ర ప్రభుత్వం నుంచి అమోదం లభించక పోవడం, తెలంగాణలో తగినంత క్యాడర్ స్ట్రెంగ్త్ లేకపోవడంతో ఆయన డిప్యూటేషన్‌కు కేంద్రం అనుమతించలేదు.

2019 ఎన్నికల సమయంలో ఈసీ ఆదేశాలతో ఏబీ వెంకటేశ్వరరావును తప్పించి మనీష్ కుమార్ సిన్హాకు ఇంటెలిజెన్స్ బాధ్యతలు అప్పగించారు. ఆ తర్వాత స్టీఫెన్ రవీంద్ర డిప్యూటేషన్ రాకపోవడంతో నిఘా విభాగం బాధ్యతలు తాత్కలికంగా ఇతరులకు అప్పగించారు. ఆ తర్వాత పిఎస్సార్ ఆంజనేయులుకు అవకాశం లభించింది. ఏపీపీఎస్సీ బాధ్యతలతో పాటు ఇంటెలిజెన్స్ విభాగాన్ని కూడా పర్యవేక్షించారు. పిఎస్సార్ ఆంజనేయులు గతంలో 2010-11లో విజయవాడ పోలీస్ కమిషనర్‌గా పనిచేశారు. అప్పట్లో నాటకీయ పరిణామాల మధ్య విజయ ంవాడ సీపీ బాధ్యతల నుంచి ఆయన్ని తప్పించారు. దీంతో ఆయన కేంద్ర సర్వీసులకు వెళ్లిపోయారు.

టీడీపీ నాయకుడు వల్లభనేని వంశీతో తలెత్తిన వివాదాలు చివరకు ఆయన బదిలీకి కారణం అయ్యాయి. అప్పట్లో టీడీపీ నగర అధ్యక్షుడిగా ఉన్న వంశీ వాహనాల కాన్వాయ్‌తో నగరంలో తిరిగే వారు. కాంగ్రెస్ నాయకుడు దేవినేని నెహ్రూకు, వంశీకి రాజకీయ విభేదాలు ఉన్నాయి. టీడీపీలో దేవినేని ఉమా వర్గంతో పడేది కాదు. ఈ క్రమంలో వంశీ కాన్వాయ్‌లో షికార్లకు పిఎస్సార్ బ్రేకులు వేశారు. ఆ తర్వాత కమిషనరేట్‌లో వంశీని కౌన్సిలింగ్‌కు పిలిపించడం చర్చనీయాంశం అయ్యింది. ఈ వివాదాల నడుమ ఓ మహి ళా డాక్టర్ అంశం తెరపైకి వచ్చింది. పిఎస్సార్ ఆంజనేయులు మహిళను వేధిస్తున్నారంటూ వల్లభనేని వంశీ వ్యక్తిగత ఆరోపణలు చేయడం, మీడియాలో పెద్ద ఎత్తున వాటిని హైలైట్ చేయడంతో పిఎస్సార్‌ను అప్పటి ప్రభుత్వం బదిలీ చేసింది. ఏపీలో జగన్ ప్రభుత్వం అధి.కారంలోకి వచ్చిన తర్వాత పిఎస్సార్ ఆంజనేయులు అనూహ్యంగా ప్రాధాన్యత పెరిగింది. వైసీపీ నాయకుల ఆదేశాలను తూచా తప్పకుండా అమలు చేశారంటూ టీడీపీ పలు సందర్భాల్లో ఆరోపించింది. టీడీపీ నేతలపై కేసులు పెట్టడం, అరెస్టులు చేయడం వెనుక పిఎస్సార్ ఉన్నాడని ఆ పార్టీ భావించింది. ఈ క్రమంలో ముంబైకు చెందిన సినీ నటి కాందబరి జెత్వాని వ్యవహారంలో ఆయనపై కేసు నమోదు చేశారు. ఇదే కేసులో విజయవాడ సీపీ కాంతిరాణా తాతా, విశాల్ గున్నీ, ఏసీపీ హనుమంతరావు, సీఐ సత్యనారాయణలపై కూడా కేసు నమోదైంది. ఈ కేసులో పిఎస్సార్ మినహా మిగిలిన వారంతా ముందస్తు బెయిల్ పొందారు. జెత్వానీ వ్యవహారంలో తాను ఏ తప్పు చేయలేదని పిఎస్సార్ చెబుతూ వచ్చారు. అరెస్టైన తర్వాత కూడా కోర్టులో ఇదే వాదించారు. కేసుల విచారణలో తన ప్రమేయం లేదని, తనను ఇరికించారని ఆరోపించారు. ప్రభుత్వాలను నడిపే పాలక పార్టీలు రాష్ట్రంలో జరిగే పరిణామాలను ఎప్పటికప్పుడు ఇంటెలిజెన్స్ ద్వారా తెలుసుకుంటుంది.

ఈ క్రమంలో రాజకీయ కక్ష సాధింపులకు అదే ఇంటెలిజెన్స్ విభాగాన్ని బాధ్యుల్ని చేసే ధోరణి ఏపీలో కొనసాగుతోంది. ఇప్పటికే ఇంటెలిజెన్స్ బాధ్యతలు తమకొద్దని ఐపీఎస్‌లు తప్పుకునే వాతావరణం ఏపీలో వచ్చేసిందని పోలీస్ అధికారులు చెబుతున్నారు

# తిరుమలలో గట్టి నిఘా...



తిరుపతి, ఏప్రిల్ 26, జమ్మూ కశ్మీర్ పహల్గాం ఉగ్ర దాడి నేపథ్యంలో టీటీడీ అప్రమత్తమైంది. జమ్మూ కశ్మీర్‌లోని ప్రస్తుత పరిస్థితికి తోడు నిఘావర్గాల హెచ్చరికల నేపథ్యంలో శ్రీవారి భక్తుల భద్రత కోసం తిరుమల తిరుపతి దేవస్థానం అనేక చర్యలు చేపడుతోంది. అందులో భాగంగా తిరుమలలో క్యాబ్‌లు నడుపుతున్న వారితో టీటీడీ చీఫ్ విజిలెన్స్ అండ్ సెక్యూరిటీ ఆఫీసర్ హర్షవర్ధన్ రాజు సమావేశమయ్యారు. 400 మంది క్యాబ్ డ్రైవర్లు, 50 మంది యజమానులతో భేటీ అయ్యారు. ఈ సమావేశంలో.. ఆలయ పరిసరాల్లో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, అనుసరించాల్సిన విధానాలపై వారికి అవగాహన కల్పించారు. తిరుమలలో భక్తుల భద్రతకు సంబంధించి డ్రైవర్లది కీలకమైన పాత్ర అని హర్షవర్ధన్ రాజు తెలిపారు. తిరుమలలో క్యాబ్‌లు, వాహనాలు నడిపే డ్రైవర్లు తప్పనిసరిగా లైసెన్స్ కలిగి ఉండాలని స్పష్టం చేశారు. అలాగే నిషేధిత వస్తువులను తిరుమలకు తీసుకురాకూడదని టీటీడీ చీఫ్ విజిలెన్స్ అండ్ సెక్యూరిటీ ఆఫీసర్ హర్షవర్ధన్ రాజు స్పష్టం చేశారు. నిషేధిత వస్తువులను ఎవరైనా తీసుకువచ్చినట్లు గుర్తిస్తే తమకు సమాచారం ఇవ్వాలని ఆదేశించారు. తిరుమలలో ఎవరైనా నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తప్పవని వార్నింగ్ ఇచ్చారు. దొంగలు, నేరస్థులు తమ వాహనాలను ఎక్కినట్లు క్యాబ్ డ్రైవర్లు గుర్తిస్తే పోలీసులకు కానీ, డయల్ 112కు గానీ సమాచారం ఇవ్వాలని సూచించారు. తిరుమలలో ప్రతి ఒక్కరూ ఓ సైనికుడిలా పనిచేయాలని.. తమ దృష్టికి ఎలాంటి అనుమానాస్పద సమాచారం వచ్చినా పోలీసులకు తెలియజేయాలని సూచించారు. మరోవైపు పహల్గామ్ ఉగ్రదాడి నేపథ్యంలో తిరుమలలో భద్రతా దళాలు మాక్ డ్రిల్ నిర్వహించాయి. ఉగ్రవాదులు చొరబడితే ఏం చేయాలి, ఎలా వ్యవహరించాలనే దానిపై టీటీడీ సిబ్బందికి అవగాహన కల్పించారు. భక్తులను ఎలా రక్షించాలనే దానిపై తిరుమల లేపాక్షి సర్కిల్ వద్ద ఉన్న సుదర్శన్ సత్రంలో భద్రతా దళాలు మాక్ డ్రిల్ నిర్వహించాయి. ఒకటిన్నర గంటపాటు ఈ మాక్ డ్రిల్ నిర్వహించారు. ఈ మాక్ డ్రిల్‌లో ఆక్టోపస్ కమాండోలు, టీటీడీ విజిలెన్స్ సిబ్బంది, పోలీసులు, ఏపీఎస్పీ సిబ్బంది పాలుపంచుకున్నారు. ఉగ్రదాడి జరిగినప్పుడు ఎలా వ్యవహరించాలనే దానిపై టీటీడీ నిఘా, భద్రతా సిబ్బందితో పాటుగా సివిల్, రిజర్వు పోలీసులకు, ఆలయ సిబ్బందికి వివరించారు.

## భగీరథ కాలనీగా మారిన పాకిస్తాన్ కాలనీ

విజయవాడ, ఏప్రిల్ 26, ఏపీలో( పాకిస్తాన్ పేరుతో ఒక కాలనీ ఉంది. మీరు వింటున్నది నిజమే. విజయవాడలోని పాకిస్తాన్ కాలనీపేరుతో ఒక ప్రాంతం ఉంది. ఎప్పటినుంచో ఆ పేరు కొనసాగుతోంది. అయితే ఆ పేరు మార్చాలని స్థానికులు చాలా ఏళ్లుగా కోరుతూ వస్తున్నారు. కానీ ఎట్టకేలకు వారి విన్నపాన్ని మన్నించింది ఏపీ ప్రభుత్వం. ఆ కాలనీ పేరును మార్చింది. స్థానికులకు ఇష్టమైన మరో పేరును ప్రకటించింది. విజయవాడలోని 62వ డివిజన్ పరిధిలో ఈ పాకిస్తాన్ కాలనీ ఉంది. ఆ కాలనీ పేరును తాజాగా మార్చారు. భగీరథ కాలనీగా నామకరణం చేశారు. అదే సమయంలో స్థానికుల ఆధార్ చిరునామాను సైతం మార్చినట్లు జిల్లా కలెక్టర్ స్వయంగా ప్రకటించారు. దీంతో స్థానికులు ఆనందం వ్యక్తం చేశారు. పాకిస్తాన్ కాలనీగా ఉన్న ఈ కాలనీ పేరు మార్చాలని గత కొద్ది రోజులుగా స్థానికులు డిమాండ్ చేస్తూ వచ్చారు. ప్రజా ప్రతినిధులతో పాటు అధికారులకు విన్నపాలు చేసేవారు. ఎట్టకేలకు ఆ పేరు మార్పు సహకారం అయింది. పాకిస్తాన్ కాలనీ పేరు వెనక చాలా చరిత్ర ఉంది. 1971లో జరిగిన యుద్ధంలో పాకిస్తాన్ పై భారత్ విజయం సాధించింది. ఆ తరువాత పాకిస్తాన్ నుంచి బంగ్లాదేశ్ విడిపోయింది. ఆ సమయంలో ఈరుద్దేశాల సరిహద్దుల్లో ఎన్నో కుటుంబాలు నిరాశ్రయులయ్యారు. అప్పట్లో కొన్ని కుటుంబాలు ఇండియాకు వచ్చి తలదాచుకున్నాయి. అటువంటి సమయంలోనే 40 కుటుంబాలతో విజయవాడలోని పాయకాపురంలో ఈ కాలనీ ఏర్పాటు అయింది. 1984లో 40 గృహాలు, మూడు రోడ్లతో నిర్మించిన ఈ కాలనీకి పాకిస్తాన్ కాలనీగా పేరు పెట్టారనే ఒక వాదన ఉంది. ఇక్కడ మరో రకమైన ప్రచారం కూడా జరుగుతోంది. దేశ విభజన సమయంలో కొన్ని కుటుంబాలు నిర్వాసితులుగా, శరణార్థులుగా.. పాకిస్తాన్ లోని సింధు ప్రావిన్స్ నుంచి గుజరాత్ మీదుగా భారత్ లోకి వచ్చారని చెబుతున్నారు. వందలాది కుటుంబాలు వలస వచ్చాయని.. చెన్నై కోల్కత్తా రైలు మార్గంలో ఉన్న విజయవాడ ప్రధాన కూడలిగా ఉండడంతో.. ఈ కుటుంబాలన్నీ ఇక్కడకు వచ్చాయని ఒక ప్రచారం. అలా ఇక్కడ స్థిరపడడంతో పాకిస్తాన్ కాలనీ పేరిట గృహ సముదాయాన్ని ఏర్పాటు చేసుకున్నారనేది ఒక కథనం. అయితే దశాబ్దాల కిందట వచ్చిన వీరు స్థానికులతో కలిసి పోయారు. ఎక్కడి వారు గా మారిపోయారు. సుదీర్ఘ నిరీక్షణ తర్వాత పాకిస్తాన్ కాలనీ కాస్త భగీరథ కాలనీగా మారింది. కొత్త పేరుతో ఈ ప్రాంతంలో నివాసం ఉండే దాదాపు 60 మందికి ఆధార్లో అడ్రస్ మార్చినట్లు జిల్లా కలెక్టర్ డాక్టర్ లక్ష్మీశ తెలిపారు. గత కొన్నేళ్లుగా ఈ కాలనీ పేరు మార్చాలని కోరుతూ స్థానికులతో పాటు రాష్ట్ర సగర్ రాజపుత్ సేవా సమితి సభ్యులు పోరాడుతూ వచ్చారు. దానికి స్పందిస్తూ ప్రభుత్వం కాలనీ పేరు మార్చుతూ నిర్ణయం తీసుకున్నట్లు కలెక్టర్ వెల్లడించారు. అయితే దశాబ్దాలుగా ఎదురుచూస్తున్న పేరు మార్పుతో.. స్థానికులు ఆనందం వ్యక్తం చేశారు.

# ఉత్తరాంధ్రలో కోలుకొనేది ఎలా

విశాఖపట్టణం, ఏప్రిల్ 26, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఉత్తరాంధ్రలో కోలుకునే పరిస్థితులు కనిపించడం లేదు. అక్కడి నేతలు కూడా పెద్దగా యాక్టివ్ గా లేరు. శాసనమండలిలో నేతగా ఉన్న బొత్స సత్యనారాయణ, మాజీ మంత్రి గుడివాడ అమర్నాథ్ మినహా ఉత్తరాంధ్రలోని శ్రీకాకుళం, విజయనగరం, విశాఖ జిల్లాల నుంచి ఏ వైసీపీనేత వాయిస్ వినిపించడం లేదు. ఎందుకో తెలియదు కానీ.. మొదటి నుంచి అంటే ఎన్నికల ఫలితాలు వచ్చిన నాటి నుంచి సౌండ్ లేకుండా పోయింది. తమ్మినేని సీతారాం, ధర్మాన ప్రసాదరావు, ధర్మాన కృష్ణదాస్ తో పాటు పలువురు కీలక నేతలు ఈ ప్రాంతంలో ఉన్నప్పటికీ వారు పెద్దగా యాక్టివ్ గా లేకపోవడంతో అసలు ఉత్తరాంధ్రలో పార్టీ ఉందా? అన్న అనుమానాలు కలుగుతున్నాయి ఉత్తరాంధ్రలో 2019 ఎన్నికల్లో గణనీయమైన ఫలితాలను సాధించిన ఫ్యాన్ పార్టీ 2024 ఎన్నికలకు వచ్చేసరికి పూర్తిగా డీలా పడిపోయింది. విశాఖను రాజధానిగా ప్రకటించినప్పటికీ అక్కడి ప్రజలు ఏ మాత్రం సానుకూలంగా వైసీపీ పక్షాన నిలవలేదు. భూ కబ్జాలు, ఆక్రమణలతో పాటు అనేక విషయాలు పార్టీకి ఓటమిని తెచ్చి పెట్టాయన్న అభిప్రాయం వైసీపీలోనే వ్యక్తమవుతుంది. ఇచ్ఛాపురం నుంచి విశాఖ వరకూ కూటమి పార్టీలు దాదాపుగా క్లీన్ స్వీప్ చేశాయనే చెప్పాలి. శ్రీకాకుళంలో పది, విజయనగరంలో తొమ్మిది, విశాఖలో పదిహేను శాసనసభ నియోజకవర్గాలు ఉండగా మొత్తం ముప్పయి నాలుగు స్థానాలుండగా మొన్నటి ఎన్నికల్లో కూటమికి మూడు జిల్లాల్లో ముప్పయి రెండు స్థానాలు రాగా, వైసీపీకి కేవలం రెండు స్థానాలు మాత్రమే వచ్చాయి. అది కూడా ఎస్.టి నియోజకవర్గాలే కావడం గమనార్హం. ఈసారి ఈప్రాంతంలో నియోజకవర్గాలు పెరిగే అవకాశముంది. ఇటీవల మాజీ మంత్రి కన్నబాబును ఉత్తరాంధ్ర జిల్లాలకు జగన్ కన్వీనర్ గా నియమించారు. అయితే ఈ ప్రాంతంలో ఎక్కువ మంది సీనియర్ నేతలుండటంతో వారిని కలుపుకుని పోవడం కూడా కన్నబాబుకు కష్టంగా మారిందంటున్నారు. అదే సమయంలో సీనియర్ నేతలు ఎవరూ పార్టీకి కష్టపడి పనిచేసి పూర్వ వైభవం తేవాలన్న ఉద్దేశ్యంలో అయితే మాత్రం లేరనే అర్థమవుతుంది. తమకు విశ్రాంతి దొరికిందని ఇంట్లోనో, లేక హైదరాబాద్ లోనో విశ్రాంతి తీసుకుంటున్నారు తప్పించి పార్టీని తిరిగి నిలబెట్టే ప్రయత్నం చేయడం లేదు. కూటమి పార్టీల్లో ఉన్న లొసుగులను కూడా వారు తమకు అనుకూలంగా మలచుకునే ప్రయత్నం చేయడం లేదంటే వారు ఎంతటి నిరాసక్తతలో ఉన్నారో చెప్పకనే అర్థమవుతుంది. విశాఖపట్నంలో అతి తక్కువ ధరకు భూములను కొత్తకంపెనీకి అప్పజెప్పినా కనీసం ఉద్యమం చేయాలన్న ధ్యాస వారిలో కనిపించ లేదంటే వారు ఏ పరిస్థితుల్లో ఉన్నారో అర్థమవుతుంది. అధికారంలో ఉండగా అంతా మాదే అన్నట్లు వ్యవహరించిన వారు సయితం ఇప్పుడు మొహం చాటేస్తున్నారు. ఈ పరిస్థితిపై కనీసం వైఎస్ జగన్ కూడా ఫోకస్ పెట్టడం లేదు. వస్తే రాష్ట్ర వ్యాప్తంగా ఫ్యాన్ గాలి వీస్తుందని, ఒక ప్రాంతంలో వచ్చి మరొక ప్రాంతంలో మరొకలా ఉండదని జగన్ భావించి లెక్కలు వేసుకుని మౌనంగానే ఉంటున్నారని తెలిసింది. జగన్ కామ్ గా ఉన్న వైనాన్ని చూసి నేతలు ఎవరూ బయటకు అస్సలు రాకపోవడంతో ఉత్తరాంధ్రలో వైసీపీ పూర్తిగా పడకేసిందన్నది వాస్తవం.

# దువ్వాడ కొంపముంచిన అడల్టరీ

విజయనగరం, ఏప్రిల్ 26, ఎమ్మెల్సీ దువ్వాడ శ్రీనివాస్ రాజకీయ జీవితం డోలాయమానంలో పడింది. ఆయన రాజకీయ జీవితానికి ఫుల్ స్టాప్ పడేలా ఉంది. ఇటీవల వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ నుంచి దువ్వాడ శ్రీనివాస్ ను సస్పెండ్ చేసిన సంగతి తెలిసిందే. వ్యక్తిగత కారణాలతో తనను పార్టీ నుంచి సస్పెండ్ చేశారని ఎమ్మెల్సీ దువ్వాడ చెబుతున్నారు. అయితే పార్టీ క్రమశిక్షణ అతిక్రమించినందుకే వేటు వేసినట్లు హైకమాండ్ ప్రకటించింది. అదే సమయంలో మంత్రి లోకేష్ ను పొగడడం వల్లే దువ్వాడ శ్రీనివాసును సస్పెండ్ చేశారని టిడిపి, జనసేన సోషల్ మీడియాలో హోరెత్తిస్తున్నాయి. ఇంకోవైపు వైసీపీ సోషల్ మీడియాలో మాత్రం దువ్వాడను ఏనాడో సస్పెండ్ చేయాల్సిందేనన్న పోస్టులు కనిపిస్తున్నాయి. అయితే రకరకాల విశ్లేషణలు ఉన్నాయి కానీ.. అసలు దువ్వాడను ఎందుకు సస్పెండ్ చేశారు అన్నది స్పష్టత లేకుండా పోతోంది. వాస్తవానికి దువ్వాడపై ఎప్పుడో సస్పెన్షన్ విధించాల్సి ఉన్న.. ఆయన వైఖరి మారుతుందేమోనన్న ఆలోచనతో ఇన్నాళ్లు హై కమాండ్ వేచి చూసినట్లు తెలుస్తోంది. రోజురోజుకు ఆయన పరిస్థితిపై విమర్శలు ఎక్కువ అవుతుండడంతో చివరికి వేటు వేశారని తెలుస్తోంది. భార్య పిల్లలతో తగాదా పెట్టుకున్నారు దువ్వాడ శ్రీనివాస్. ప్రేయసి మాధురితో కలిసి చట్టా పట్టాలు వేసుకుని తిరుగుతున్నారు. రోజురోజుకు వారు స్వేచ్ఛగా వ్యవహరిస్తున్నారు. సోషల్ మీడియాలో రచ్చకెక్కుతున్నారు. మీడియాకు ఇంటర్వ్యూలు ఇస్తున్నారు. అది పార్టీకి చెడ్డ పేరుగా మారుతోంది. వాస్తవానికి కుటుంబ వివాదం వెలుగులోకి వచ్చిన నేపథ్యంలో టెక్కలి ఇన్చార్జి పోస్టు నుంచి దువ్వాడ శ్రీనివాసును తొలగించారు. అయితే అది పనిష్మెంట్ గా భావించలేదు దువ్వాడ. మళ్లీ ఎన్నికల నాటికి తనకే టికెట్ అన్న ధీమా ఆయనది. అందుకే కొంచెం విపరీతంగా ప్రవర్తించారు. అందుకే హై కమాండ్ తోక కత్తిరించినట్లు వైసిపి వర్గాలు చెబుతున్నాయి. మరోవైపు టెక్కలి నియోజకవర్గంలో సైతం దువ్వెల మాధురి తల దూర్చుతున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. ఇక్కడ వైయస్సార్ కాంగ్రెస్ ఇన్చార్జిగా పేరాడ తిలక్ ఉన్నారు. మొన్నటి ఎన్నికల్లో తిలక్కు శ్రీకాకుళం పార్లమెంట్ స్థానం నుంచి పోటీ చేశారు. దువ్వాడ శ్రీనివాస్ అసెంబ్లీ స్థానానికి పోటీ చేశారు. కానీ ఇద్దరూ ఓడిపోయారు. టెక్కలి ఇన్చార్జిగా దువ్వాడ శ్రీనివాసును తప్పించారు. పేరాడ తిలక్ కు ఆ బాధ్యతలు అప్పగించారు. కానీ ఇటీవల మాధురి సోషల్ మీడియాలో ఒక పోస్ట్ చేశారు. పుష్ప డైలాగును గుర్తుచేసేలా..' దమ్ముంటే తెచ్చుకోరా టిక్కెట్టు.. తెచ్చుకుంటే వదిలేస్తే పోస్టింగు' ఆల్టో పెట్టిన సోషల్ మీడియా పోస్ట్ వైయస్సార్ కాంగ్రెస్ పార్టీలో చర్చకు దారితీసింది. దీనిపై టెక్కలి నియోజకవర్గ ఇన్చార్జ్ తిలక్ తో పాటు చాలామంది వైసీపీ నేతలు హై కమాండ్కు ఫిర్యాదు చేసినట్లు తెలుస్తోంది. దీనిపైనే హై కమాండ్ సీరియస్ గా స్పందించి చర్యలు తీసుకున్నట్లు సమాచారం. మరోవైపు అడల్టరీ పేరుతో దువ్వాడ శ్రీనివాస్ జంట చేస్తున్న హడావిడి అంతా ఇంతా కాదు. సోషల్ మీడియాతో పాటు మీడియా ఛానళ్లకు వారు ఇంటర్వ్యూలు ఇస్తున్నారు. అడ్డగోలుగా మాట్లాడుతున్నారు. అయితే ఇవి మహిళల విషయంలో ఇబ్బందికరంగా ఉన్నాయని వైయస్సార్ కాంగ్రెస్ పార్టీకి చెందిన మహిళా నేతలు జగన్మోహన్ రెడ్డికి ఫిర్యాదు చేశారు. వారి ప్రవర్తనతో పార్టీకి చెడ్డ పేరు వస్తోందని.. ముఖ్యంగా మహిళలు యావగించుకుంటున్నారని.. చర్యలు తీసుకోకపోవడంతో హై కమాండ్ తీరును ఎక్కువమంది తప్పు పడుతున్నారని ఫిర్యాదు చేశారు. అందుకే అధినేత జగన్మోహన్ రెడ్డి చర్యలకు ఆదేశించినట్లు ప్రచారం జరుగుతోంది. మరి అందులో ఎంత వాస్తవం ఉందో చూడాలి.

# ఇక బడా నేతలే...

తిరుపతి, ఏప్రిల్ 26, ఏపీలో కూటమి సర్కార్ దూకుడు పెంచింది. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో జరిగిన అవినీతి, అక్రమాలు, నేరాలు-ఘోరాలను వెలికితీసేందుకు యాక్షన్ ప్లాన్ ను స్పీడప్ చేసిందని పొలిటికల్ సర్కిల్స్ లో చర్చ నడుస్తోంది. దీంతో కూటమి సర్కార్ కొలువైన దగ్గరి నుంచే వైసీపీ అవినీతి గుట్టలను బద్దలు కొడుతూ ఒక్కో రాయిని పెకిలించి వేస్తోంది. అలా ఇప్పటివరకు అనేక కేసుల్లో ఇరుక్కుకున్న విపక్షానికి చెందిన నేతలను అరెస్ట్ చేస్తూ వస్తున్నారు పోలీసులు. ఏపీలో పిన్నెల్లి రామకృష్ణారెడ్డితో మొదలైన అరెస్టుల పర్వం ఇంకా కంటిన్యూగా కొనసాగుతోంది. పిన్నెల్లితో పాటు నందిగం సురేష్, వల్లభనేని వంశీ, పోసాని కృష్ణమురళి, బోరుగడ్డ అనిల్, మాజీ వైసీపీ ఎంపీ గోరంట్ల మాధవ్ వంటి వారు అరెస్ట్ అయ్యారు. ఇందులో కొందరు ప్రస్తుతం రిమాండ్ లో ఉన్నారు. మరికొందరు మాజీలు అరెస్టు భయంతో కోర్టుల చుటూ తిరుగుతున్నారు. ఇప్పటికే మాజీ మంత్రి విడదల రజినిపై ఉన్న కేసులో ఆమె మరిది గోపిని అరెస్టు చేశారు. అలాగే మాజీ ఇంటిలిజెన్స్ చీఫ్ ఖాఖీ ఆంజనేయులును నటి జత్వాని కేసులో అరెస్టు చేసి రిమాండ్ కి పంపారు పోలీసులు.ఇక లిక్కర్ స్కాం కేసులో ఇప్పటికే కీలక సూత్రధారి అయిన కేసిరెడ్డిని అరెస్ట్ చేసిన సిట్ అధికారులు ఈ కేసులో 8వ నిందితుడిగా ఉనన కేసిరెడ్డి తోడల్లుడు బూనేటి చాణక్యని కూడా అరెస్ట్ చేశారు సిట్ అధికారులు. వసూళ్లు చేసిన కమిషన్ల మొత్తాన్ని చాణక్య?రాజ్ కసిరెడ్డికి అందించేవారని..అక్కడి నుంచి ఎంపీ మిథున్‌రెడ్డి, మాజీ ఎంపీ సాయిరెడ్డి, భారతి సిమెంట్స్ లో పనిచేసే బాలాజీ, అలాగే వైఎస్ అనిల్ రెడ్డికు చేరేవని సిట్ విచారణలో తేలిందట. వీరి ద్వారా వివిధ రూపాల్లో కమిషన్లు.. అంతిమంగా అప్పటి సీఎం జగన్‌కు చేరేవని సిట్ విచారణలో తేలిందని సమాచారం.అయితే బూనేటి చాణక్య రిమాండ్ రిపోర్టులో అనేక సంచలన అంశాలు పొందుపరిచారట సిట్ అధికారులు. దాని ప్రకారం..వైసీపీ అధికారంలోకి వచ్చిన వెంటనే 2019 తొలినాళ్లలో హైదరాబాద్‌లోని ఓ హోటల్లో సజ్జల శ్రీధర్ రెడ్డి నేతృత్వంలో ఒక భేటీ జరిగిందట. మద్యం కుంభకోణానికి అక్కడే బీజం పడిందట. ఇక రాష్ట్రవ్యాప్తంగా సంచలనం సృష్టించిన మదనపల్లె సబ్‌కలెక్టర్ కార్యాలయంలో ఫైళ్ల దహనం కేసులో మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి ముఖ్య అనుచరుడు మాధవరెడ్డిని గురువారంనాడు సీఐడీ పోలీసులు అరెస్టు చేశారు.కేసులో 3నెలల క్రితం సబ్ కలెక్టరేట్ సీనియర్ అసిస్టెంట్ గౌతమ్ తేజ్‌ను అరెస్టు చేశారు. మరో నిందితుడైన అప్పటి ఆర్డీవో మురళి ఏసీబీ అదుపులో ఉన్నారు. పెద్దిరెడ్డి అనుచరుడు మాధవరెడ్డి పట్టుబడడంతో త్వరలో మరిన్ని పెద్దతలకాయలను సీఐడీ పోలీసులు అరెస్టు చేసే అవకాశం ఉందని టాక్. పెద్దిరెడ్డితో పాటు ఆయన కుమారుడు, ఎంపీ మిథున్‌రెడ్డి, ఆయన సోదరుడు, తంబళ్లపల్లె ఎమ్మెల్యే ద్వారకానాథరెడ్డిని అదుపులోకి తీసుకోవచ్చున్న టాక్ రాజకీయవర్గాల్లో విన్పిస్తోంది.ముఖ్యంగా మాజీ మంత్రి విడదల రజిని, కాకాణి గోవర్ధన్ రెడ్డిలపై కేసులు నమోదు అవ్వడంతో త్వరలోనే వారిని కూడా అరెస్ట్ చేసే అవకాశం ఉందంటూ పొలిటికల్ సర్కిల్స్ లో చర్చ నడుస్తోంది. అలాగే లిక్కర్ స్కాంలో మిథున్ రెడ్డి అరెస్ట్ అయ్యే ఛాన్స్ ఉందని సమాచారం. అయితే ఈ అరెస్ట్‌లతో కూటమి సర్కార్ రాజకీయాలకు..ఓ రకమైన సందేశం ఇస్తుందా అనే చర్చ జరుగుతోంది. ఎందుకంటే ఒకప్పుడు నేతల మధ్య మాటల యుద్ధం అంటే రాజకీయంగా ఉండేది.

కొంతకాలంగా రాజకీయమే యుద్ధంగా మారుతోందట. వ్యక్తిగత విషయాలను టార్గెట్ చేస్తూ..వ్యక్తిగత దూషణలకు దిగుతున్నారు కొందరు నేతలు. ఇక వాళ్లు వాడే భాష జుగుప్సాకరం, అసభ్యకరం, అభ్యంతకరంగా ఉందన్నది మరికొందరి అభిప్రాయం. దీంతో సింపథీ వర్కౌట్ కాకపోగా..ఒకరకమైన చర్చ జనాల్లో మొదలవుతోంది. దీంతో ఇలాంటి ఇక చెల్లవ్ అని పరోక్షంగా చెప్పేందుకే..వరుస అరెస్ట్‌లు జరుగుతున్నాయా అనేది మరికొందరి వాదన.మొత్తానికి ఏపీలోని ప్రతిపక్ష నేతలకు అరెస్టుల భయం పట్టుకుందట. ఏ రోజు.. ఏ క్షణంలో తమ చేతులకు పోలీస్ సంకెళ్లు పడతాయోనని తెగ టెన్షన్ పడుతున్నారట. తాజాగా అరెస్టుల పర్వం మరోసారి స్పీడప్ కావడంతో విపక్ష నేతల గుండెల్లో రైళ్లు పరుగెడుతున్నాయట. అయితే తొలుత చిన్న లీడర్లను అరెస్ట్ చేస్తున్న పోలీసులు?వారిచ్చే కీలక సమాచారంతో బిగ్ లీడర్స్ టార్గెట్ గా పావులు కదుపుతున్నారట. వైసీపీ హయాంలో జరిగిన అవినీతి, అక్రమాల కేసుల్లో రాబోయే రోజుల్లో బిగ్ షాట్స్ అరెస్ట్ తప్పదనే చర్చ నడుస్తోంది. దీంతో నెక్ట్స్ టార్గెట్ ఎవరు? నెక్ట్స్ అరెస్ట్ ఎవరిదంటూ ఏపీ పొలిటికల్ సర్కిల్స్ లో తెగ చర్చ నడుస్తోందట.

# ఇంకా ఆ పీడకలే....

జమ్ము కశ్మీర్ లో ప్రసిద్ధ పర్యటక ప్రాంతమైన పహల్గాంలో జరిగిన తీవ్రవాదుల దాడిలో 26 మంది పర్యటకులు చనిపోవడంతో ఆ ప్రాంతంలో భయాందోళనలు పెరిగాయి.జమ్ము కశ్మీర్ నుంచి తిరుగు పయనమైన పర్యటకుల సంఖ్య పెరిగిపోయింది. పర్యటకులను శ్రీనగర్ విమానాశ్రయానికి చేర్చే టాక్సీలు బారులు తీరుతున్నాయి. హైవేలపై కూడా తిరుగు ప్రయాణికులను తీసుకువెళ్లే వాహనాల సంఖ్య పెరుగుతోంది.“మాకు భయంగా ఉంది. టెర్రరిస్టులు ఎక్కడ ఉన్నారో, తర్వాత ఏం జరుగుతుందో తెలియదు” అని గౌతమ్ అనే టూరిస్ట్ చెప్పారు. జమ్ము కశ్మీర్‌లో పర్యటించేందుకు ఆయన బోలెడు ప్రణాళికలతో వచ్చారు. కానీ ఇప్పుడాయన ఇంటికి తిరిగి వెళ్లిపోయే హడావుడిలో ఉన్నారు.జమ్ము కశ్మీర్ దశాబ్దాలుగా హింసకు కేంద్రంగా ఉన్నప్పటికీ, పర్యటకుల మీద దాడులు జరగడం చాలా అరుదు.”ఇటీవలి సంవత్సరాలలో సాధారణ పౌరులను లక్ష్యంగా చేసుకుని జరిగిన దాడుల్లో ఇది చాలా పెద్దది” అని ముఖ్యమంత్రి ఒమర్ అబ్దుల్లా అన్నారు.1947లో బ్రిటిషర్ల నుంచి స్వాతంత్ర్యం పొందిన తర్వాత ఈ రెండు దేశాలు ముస్లింలు మెజార్టీగా ఉన్న కశ్మీర్ కోసం రెండు యుద్ధాలు చేశాయి. 1980, 90లలో భారతదేశ పాలనకు వ్యతిరేకంగా ఈ ప్రాంతంలో చెలరేగిన అసంతృప్తి తిరుగుబాటుకు దారి తీసింది. దీనికి పాకిస్తాన్ నిధులు అందిస్తోందని భారతదేశం ఆరోపిస్తోంది. ఈ సంఘర్షణలో వేల మంది చనిపోయారు.

అయితే ఇటీవలి సంవత్సరాలలో హింస తగ్గిందని ప్రభుత్వం చెబుతోంది.2004- 2014 మధ్య 7217 టెర్రరిస్ట్ సంఘటనలు జరిగాయని, అయితే 2014 నుంచి 2024 మధ్య వాటి సంఖ్య 2242కి తగ్గింది” అని కేంద్ర హోంమంత్రి అమిత్‌షా పార్లమెంట్‌లో చెప్పారు.సంప్రదాయంగా ఈ ప్రాంత ఆర్థిక వ్యవస్థకు అతి పెద్ద చోదకశక్తిగా ఉన్న పర్యటకం, ఇటీవల బాగా పుంజుకుంది.2023లో జమ్ము కశ్మీర్‌ను 2 కోట్ల మంది పర్యటకులు సందర్శించారని భారత పర్యటక శాఖ తెలిపింది. కోవిడ్‌కు ముందున్న సంఖ్యతో పోలిస్తే ఇది 20శాతం ఎక్కువ.అయితే పహల్గాం దాడి తర్వాత ఈ పరిస్థితికి ముప్పులా కనిపిస్తోంది.”అంతా అయిపోయింది. నాకు కన్నీళ్లు వస్తున్నాయి” అని పహల్గాంలో శాలువాలు అమ్ముకునే షకీల్ అహ్మద్ చెప్పారు.”మా జీవితం అంతా పర్యటకుల మీద ఆధారపడి ఉంది. నేను బ్యాంకు నుంచి అప్పు తీసుకుని ఈ వ్యాపారం చేస్తున్నాను. ఇప్పుడు నా వస్తువులను కొనుక్కోవడానికి ఎవరూ లేరు” అని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు.”పాశవికమైన, క్రూరమైన దాడి. ఇది కశ్మీర్‌కు, ఈ ప్రాంత పర్యటక పరిశ్రమకు చెడ్డవార్త “ అని స్థానిక హోటల్ వ్యాపారి జావెద్ అహ్మద్ చెప్పారు.అహ్మద్ హోటల్‌లో రూములు జూన్ వరకు బుక్ అయ్యాయి. అయితే ఇప్పుడీ సంఘటన కారణంగా పర్యటకులు రావడం ఆగిపోయినా, బుకింగ్స్ రద్దు చేసుకున్నా, తన వ్యాపారం దెబ్బ తింటుందని ఆయన ఆందోళన చెందుతున్నారు.జమ్ము కశ్మీర్‌లో పర్యటక రంగానికి ఇది కీలకమైన సీజన్. వేసవి ఎండల నుంచి ఉపశమనం కలిగించే స్వర్గధామంలా ఈ ప్రాంతాన్ని పరిగణిస్తుంటారు. పాఠశాలలకు వేసవి సెలవుల కారణంగా దేశం నలుమూలల నుంచి కుటుంబసమేతంగా ఇక్కడకు వస్తుంటారు.అయితే ఈ సెలవుల సీజన్ భిన్నంగా ఉండే అవకాశం ఉంది. ఎందుకంటే కశ్మీర్ లోయ ఇప్పుడు భద్రతా చట్రంలో చిక్కుకుపోయింది.ప్రస్తుతం శ్రీనగర్‌లోని పర్యటకులలో భయం ఏర్పడిందని, త్వరలో వెళ్లాలనుకుంటున్న వారిలో ఆగ్రహం, భయం ఉన్నాయని ముంబయి కేంద్రంగా గ్రూప్ టూర్స్‌ను నిర్వహించే అభిషేక్ హాలిడేస్ సంస్థ అధిపతి అభిషేక్ సంసారే చెప్పారు.బుకింగ్‌లను రద్దు చేయాలని అనేకమంది ఫోన్లు చేస్తున్నారు” అని ఆయన చెప్పారు.ఈ దాడిని ప్రపంచ దేశాల నాయకులు ఖండించారు. దాడికి పాల్పడిన వారిని శిక్షిస్తామని ప్రధానమంత్రి మోదీ, హోంమంత్రి అమిత్‌షా చెప్పారు.బాధితులకు న్యాయం జరగాలని కోరుతూ కశ్మీరీలు నిరసన ప్రదర్శనలు చేశారు.పహల్గాం లైన్ ఆఫ్ కంట్రోల్ నుంచి 200 కిలోమీటర్ల దూరంలో ఉంది.

కశ్మీర్‌కు ప్రత్యేక ప్రతిపత్తి తొలగించిన తర్వాత ఈ ప్రాంతంలో పర్యటక రంగానికి ఊపు తెచ్చేందుకు కేంద్ర ప్రభుత్వం అనేక చర్యలు తీసుకుంది. 2023లో జీ ట్వంటీ టూరిజం వర్క్‌షాప్ గ్రూప్ సమావేశానికి శ్రీనగర్ ఆతిథ్యమిచ్చింది. ఈ సమావేశానికి అనేక మంది విదేశీ అతిథులు హాజరయ్యారు.ప్రత్యేక ప్రతిపత్తి తొలగించిన తర్వాత తొలిసారి 2024లో శ్రీనగర్‌లో పర్యటించిన ప్రధానమంత్రి నరేంద్రమోదీ స్థానికంగా వ్యవసాయ, పర్యటక రంగాల అభివృద్ధికి 6,400 కోట్ల రూపాయల విలువైన ప్రాజెక్టులను ప్రకటించారు.

”అభివృద్ధిలో జమ్మూ కశ్మీర్ కొత్త ఎత్తుల్ని తాకుతోంది. ఎందుకంటే అది ఇప్పుడు స్వేచ్ఛా వాయువుల్ని పీలుస్తోంది. ఈ ప్రాంత అభివృద్ధికి అడ్డంకిగా ఉన్న ఆర్టికల్ 370 తొలగించిన తర్వాత స్వేచ్ఛ వచ్చింది” అని ప్రధాని మోదీ అన్నారు.

ఆర్టికల్ 370 తొలగించిన తొలినాళ్లలో, పరిస్థితులు ఇంకా చక్కబడకముందే పర్యటకుల సంఖ్య పెరుగుతోందని కొందరు ఆందోళన చెందారు.”పర్యటకం అంటే సాధారణ స్థితి కాదు. ఇది ఆర్థిక కార్యకలాపాలకు సూచిక. సాధారణ స్థితి అంటే భయం లేకపోవడం. టెర్రరిజం లేకపోవడం, ఉగ్రవాదుల దాడులు తగ్గడం, ప్రజాస్వామిక పాలన వల్ల కశ్మీర్ ప్రస్తుతం సాధారణంగా ఉంది” అని ప్రస్తుత ముఖ్యమంత్రి ఒమర్ అబ్దుల్లా 2022లో అన్నారు.2024లో జరిగిన ఎన్నికల్లో గెలిచి ఆయన ముఖ్యమంత్రి అయ్యారు.పహల్గాం దాడి ఘటనపై ఆయన ఎక్స్‌లో స్పందించారు. “టెర్రరిస్టుల దాడి తర్వాత పర్యటకులు కశ్మీర్ లోయ నుంచి వెళ్లిపోవడం చూస్తుంటే హృదయ విదారకంగా ఉంది” అని ఆయన అందులో పేర్కొన్నారు.పచ్చని పచ్చిక బయళ్లతో ప్రకృతి సౌందర్యంతో పర్యటకులకు మరపురాని అనుభూతిని పంచుతుంది. సినిమా నిర్మాతలకు చాలా ఇష్టమైన ప్రాంతం కూడా.హింసాత్మక దాడులు చాలా తక్కువ. అలాంటిది మంగళవారం జరిగిన దాడి అనేక మందిని నిర్ఘాంత పోయేలా చేసింది.”క్షేత్ర స్థాయిలో పరిస్థితులు ఏంటో ఇప్పుడు దేశం మొత్తానికి తెలిశాయి” అని శ్రీనగర్‌లో కశ్మీర్ హోటల్ అండ్ రెస్టారెంట్ అసోసియేషన్ నాయకత్వంలో నిరసన ప్రదర్శన చేసిన తర్వాత మెహబూబ్ హుస్సేన్ మీర్ చెప్పారు.”ప్రత్యేక ప్రతిపత్తి తొలగించడానికి ముందు, తొలగించిన తర్వాత కూడా దాడులు జరుగుతున్నాయి. ఇక్కడ ఎప్పుడూ అశాంతి రాజ్యమేలుతుంది. దీని వల్ల స్థానికులే బాధ పడుతున్నారు. దీనికి ప్రభుత్వం పరిష్కారం కనుక్కోవాలి. లేకపోతే మా జీవితాలు ఊగిసలాడుతూనే ఉంటాయి” అన్నారు.

## ప్రైవేటు బస్సు బోల్తా..ప్రయాణికులకు స్వల్ప గాయాలు

నరసరావుపేట శివారు శాంతి నగర్ వద్ద రోడ్డు ప్రమాదం జరిగింది. ఒక ప్రైవేటు ట్రావెల్స్ బస్సు అదుపుతప్పి బోల్తా పడింది. ప్రమాదంలో పలువురు ప్రయాణికులకు స్వల్ప గాయాలు అయ్యాయి. క్షతగాత్రులను నరసరావుపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. హైదరాబాద్ నుండి చీరాల వెళుతుండగా జరిగిన ప్రమాదం జరిగింది. జిల్లా ఎస్పీ శ్రీనివాసరావు, నరసరావుపేట డిఎస్పీ , నాగేశ్వరరావు,ఎమ్మెల్యే చదలవాడ అరవింద బాబు ఘటనా స్థలానికి చేరుకొని క్షతగాత్రులను ఆస్పత్రికి తరలించారు.

# కరోనా నుంచి కోలుకోని మెట్రో...

**హైదరాబాద్ ప్రజాబలం ప్రతినిధి**, ఏప్రిల్ 26, హైదరాబాద్ నగర ప్రజల నుంచి విశేషమైన ఆదరణ పొందినప్పటికీ.. మెట్రో రైల్ ఆర్థికంగా కుదేలవ్వడానికి అనేక కారణాలు ఉన్నాయి. 2020-21 మధ్య ప్రపంచాన్ని వణికించిన కోవిడ్-19 మహమ్మారి సమయంలో విధించిన లాక్‌డౌన్ కారణంగా దాదాపు ఒక సంవత్సరం పాటు మెట్రో సేవలు పూర్తిగా నిలిచిపోయాయి. ఆ సమయంలో ప్రయాణికుల రాకపోకలు పూర్తిగా స్తంభించడంతో ఆదాయం భారీగా పడిపోయింది.మరోవైపు.. మెట్రో ప్రాజెక్ట్ కోసం తీసుకున్న భారీ రుణాల చెల్లింపుల భారం సంస్థపై తీవ్రంగా ఉంది. వివిధ బ్యాంకులు, ఆర్థిక సంస్థల నుంచి తీసుకున్న రుణాలకు అధిక వడ్డీలు చెల్లించాల్సి రావడంతో ఆర్థిక పరిస్థితి మరింత దిగజారింది. ప్రయాణికుల సంఖ్య కోవిడ్ ముందు స్థాయికి చేరుకోవడానికి దాదాపు రెండేళ్లు పట్టడం కూడా నష్టాలకు ఒక ప్రధాన కారణం. ఈ అంశాలన్నీ కలిసి మెట్రోకు రూ. 4,828.55 కోట్ల నష్టం వాటిల్లిందని ఆర్థిక నిపుణులు విశ్లేషిస్తున్నారు. గతేడాది మెట్రో తన కొన్ని ఆస్తులను తాకట్టు పెట్టడం ద్వారా కొంతమేరకు ఆర్థిక భారాన్ని తగ్గించుకోవడానికి ప్రయత్నించింది.టికెట్ల విక్రయం.. ప్రకటనల ద్వారా మెట్రో సుమారు రూ.1400 కోట్ల ఆదాయం పొందినప్పటికీ.. చెల్లించాల్సిన అధిక వడ్డీలు ఈ ఆదాయాన్ని మించిపోతున్నాయి. దీంతో మెట్రో నిరంతరం భారీ నష్టాల్లో కూరుకుపోతోంది. భవిష్యత్తులో ఈ ఆర్థిక సంక్షోభం నుంచి హైదరాబాద్ మెట్రో ఎలా బయటపడుతుందో చూడాల్సి ఉంది. ప్రభుత్వం లేదా ఎల్ అండ్ టీ సంస్థ నుంచి ఎలాంటి సహాయం అందుతుందో వేచి చూడాలి. ఈ నేపథ్యంలోనే.. మెట్రో టికెట్ ధరలు పెంచనున్నారన్న వార్తలు వైరల్ అవుతుండగా.. అలా అయినా నష్టాలను కొంతమేర పూడ్చొచ్చన్న ఆలోచన చేస్తున్నట్టుగా సమాచారం.

## టార్గెట్ స్లీపర్ సెల్స్

**హైదరాబాద్ ప్రజాబలం ప్రతినిధి** ఏప్రిల్ 26, 2025 ఏప్రిల్ 22న పహల్గామ్‌లో జరిగిన ఉగ్రవాద దాడిలో 26 మంది పర్యాటకులు ప్రాణాలు కోల్పోగా, అనేక మంది గాయపడ్డారు. పుల్వామా 2019 తర్వాత జరిగిన అత్యంత దారుణమైన దాడుల్లో ఇది ఒకటి. ఈ దాడి తర్వాత, కర్ణాటక సర్కార్ అప్రమత్తమైంది. ముఖ్యంగా బెంగళూరులో భద్రతను పటిష్టం చేసుకునేందుకు వేగంగా చర్యలు చేపట్టింది.పహల్గామ్ ఉగ్రదాడి నేపథ్యంలో పాకిస్తాన్ పౌరులకు అన్ని వీసాలు రద్దు చేసింది కేంద్రం. పాక్ పౌరులు దేశం విడిచి వెళ్లాలని ఆదేశాలు జారీచేశారు. మెడికల్ వీసాలకు మాత్రం ఏప్రిల్ 29 వరకు అనుమతి ఇచ్చారు. భారత పౌరులు పాకిస్తాన్ వెళ్లరాదని కేంద్రం సూచించింది. మరోవైపు కేంద్ర హోంమంత్రి అమిత్ షా స్వయంగా ముఖ్యమంత్రులకు ఫోన్ చేసి, పాకిస్థానీయులను వెంటనే పంపించాలని ఆదేశించారు. ఈ క్రమంలోనే పాకిస్తాన్ నుండి అక్రమ వలసదారులను, స్లీపర్ సెల్స్‌ను వెతికే పనిలో పడ్డారు కర్ణాటక పోలీసులు.సార్క్ వీసా మినహాయింపు పథకం కింద పాకిస్తానీ జాతీయులు భారతదేశంలోకి ప్రవేశించకుండా నిషేధించాలన్న కేంద్రం ఆదేశాలను అనుసరించి, చెల్లుబాటు అయ్యే పత్రాలు లేని వారిని గుర్తించి బహిష్కరించడంలో కర్ణాటక ప్రభుత్వం అన్ని విధాలుగా జాగ్రత్త తీసుకుంటుందని కర్ణాటక హోం మంత్రి జి. పరమేశ్వర స్పష్టం చేశారు. అక్రమ నివాసితులపై ఉచ్చు బిగించడంతోపాటు.. సరైన డాక్యుమెంటేషన్ లేని పాకిస్తాన్ వ్యక్తులపై కఠిన చర్యలు తీసుకుంటామని పరమేశ్వర తెలిపారు. “కేంద్ర నిఘా సంస్థలతో కలిసి పనిచేస్తున్నామని, కర్ణాటకలో, ముఖ్యంగా బెంగళూరులో చట్టవిరుద్ధంగా నివసిస్తున్న పాకిస్తానీ జాతీయులను గుర్తించి, అదుపులోకి తీసుకుని, బహిష్కరణ కోసం వారిని హైకమిషన్‌కు అప్పగిస్తామని ఆయన అన్నారు.కేంద్ర ప్రభుత్వ ఆదేశాలను అమలు చేయడానికి, కర్ణాటక రాష్ట్ర పోలీసులు లాడ్జీలు, అతిథి గృహాలు, ఇతర స్థావరాల్లో ప్రత్యేక బృందాలతో గాలింపు చేపట్టారు. స్లీపర్-సెల్ కార్యకలాపాల గురించి ఏదైనా సమాచారం అందిన వెంటనే చర్య తీసుకోవడానికి నగరవ్యాప్తంగా స్థానిక పోలీసు స్టేషన్లలో అఃఎ, ఎః అధికారులను మోహరించారు.బెంగళూరులో పాకిస్తానీయులు ఉన్నారంటూ ఇటీవలి శాసనసభ సమావేశంలో పరమేశ్వర తెలిపారు. కర్ణాటక రాష్ట్రవ్యాప్తంగా మొత్తం 137 మంది అక్రమ వలసదారులను గుర్తించి అరెస్టు చేసిందని, వారిలో 25 మంది పాకిస్తానీ జాతీయులు అని వెల్లడించారు. ఇందులో 84మందిని బెంగళూరు నగరంలోనే అదుపులోకి తీసుకున్నట్లు తెలిపారు. పాకిస్తాన్ నుండి వచ్చి సరియైన పత్రాలు లేని నివాసితులకు బెంగళూరు మహానగరం ప్రాథమిక కేంద్రంగా మారిందన్నారు.2024 చివరలో, ఇంటెలిజెన్స్ బ్యూరో సూచన ప్రకారం బెంగళూరు శివార్లలోని జిగాని పారిశ్రామిక బెల్ట్‌లో అధికారులు సోదాలు నిర్వహించారు. ఆ సమయంలో నకిలీ పత్రాలతో చట్టవిరుద్ధంగా నివసిస్తున్న ఒక పాకిస్తానీ జాతీయుడు, మరో ముగ్గురు అనుమానితులను అరెస్టు చేశారు. వారికి నకిలీ పాస్‌పోర్టులు, గుర్తింపు తారుమారుకి దోహదపడే పెద్ద రహస్య నెట్‌వర్క్‌తో సంబంధాలున్నాయని ప్రాథమిక దర్యాప్తులో తేలింది. ఇటువంటి స్లీపర్ సెల్స్ నెలలు, సంవత్సరాలు సైలెంట్‌గా ఉంటారని, పెద్ద టాస్క్‌లో భాగం అయ్యేవరకు నగరంలోని సాధారణ జనంతో కలిసిపోతారని నిఘా వర్గాలు హెచ్చరిస్తున్నారు. స్లీపర్ సెల్స్‌పై ఫుల్ ఫోకస్ పెట్టిన బెంగళూరు పోలీసులు.. ఎలాంటి కమ్యూనల్ హింసకు తావు లేకుండా?. వారి అంతు తేల్చగలరా అన్నది ముమ్ముందు తేలనుంది.

## ప్రభుత్వ పాలసీలతో పైకొచ్చిన వారు పేదలకు చేయూతనివ్వాలి

### -సీఎం చంద్రబాబు నాయుడు

ఎచ్చెర్ల, ఏప్రిల్ 26 :- ప్రభుత్వ పాలసీలతో ఆర్థికంగా పైకొచ్చిన వారు సమాజంలోని పేదలకు చేయూతనిచ్చి అన్ని విధాలా వారిని అభివృద్ధి చేసేలా చొరవ తీసుకోవాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పిలుపునిచ్చారు. శ్రీకాకుళం జిల్లా, ఎచ్చెర్ల నియోజకవర్గం, బుడగట్లపాలెంలో మత్స్యకారుల సేవలో పథకాన్ని శనివారం ముఖ్యమంత్రి ప్రారంభించారు. అనంతరం ప్రజావేదిక సభలో జీరో పావర్టీ-పీ4 కార్యక్రమాన్ని ఉద్దేశించి మాట్లాడారు. ‘రాష్ట్రంలో పేదరికాన్ని సమూలంగా నిర్మూలించాలి. పేదలకు ప్రభుత్వ పథకాలు అందివ్వడమే కాకుండా మార్గదర్శుల ద్వారా సాయం అందించి అన్ని విధాలా పైకి తీసుకొచ్చే కార్యక్రమానికి శ్రీకారం చుట్టాం. మార్గదర్శులు దత్తత తీసుకున్న కుటుంబాలకు ఏం చేస్తున్నాయో కూడా సమీక్ష చేస్తాం. 2029 నాటికి రాష్ట్రంలో పేదరికం లేకుండా చేయాలన్నది నా లక్ష్యం. అన్ని విధాలా ఆర్థికంగా పైకొచ్చిన వారు పేద కుటుంబాలను ఆదుకుంటే సమాజంలో అసమానతలు ఉండవు.’ అని సీఎం చంద్రబాబు అన్నారు. అనంతరం మార్గదర్శులకు సీఎం చంద్రబాబు శాలువాలు కప్పి సన్మానం చేశారు.

# భారత్ సమ్మిట్‌లో ఇండియా మ్యాప్‌ని అలా?

# రేవంత్ సర్కారు కొత్త తలనొప్పి

**హైదరాబాద్ ప్రజాబలం ప్రతినిధి** ఏప్రిల్ 26 జమ్మూ కాశ్మీర్‌లో పహల్గామ్‌లో జరిగిన మారణహోమంపై దేశమంతా రగిలిపోతున్న వేళ.. తెలంగాణ కాంగ్రెస్ మరో వివాదంలో చిక్కుకుంది. ‘గ్లోబల్ జస్టిస్ అందించడమే ప్రధాన లక్ష్యం’ అనే ఇతివృత్తంతో హైదరాబాద్‌లోని హెచ్ఐసీసీ వేదికగా ఏప్రిల్ 25 నుంచి ఏప్రిల్ 26 వరకు “భారత్ సమ్మిట్ 2025” నిర్వహిస్తుండగా.. సుమారు 100 దేశాల నుంచి 450 మంది విదేశీ ప్రతినిధులు పాల్గొంటున్న ఈ సమ్మిట్‌లో.. ఏర్పాటు చేసిన భారతదేశ చిత్ర పటం తప్పుగా ఉండటం ఇప్పుడు సర్వత్రా విమర్శలకు తావిస్తోంది. భారత సమ్మిట్‌లో పాల్గొన్న ఫొటోలను మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి ఎక్స్ (ట్విట్టర్)లో పోస్ట్ చేయగా.. ఈ వివాదం చెలరేగింది. రాజగోపాల్ రెడ్డి ఫొటోల్లో దూరంగా ఓ ఇండియా చిత్రం కనిపిస్తుండగా అందులో జమ్మూ కాశ్మీర్‌ను పూర్తిగా ముద్రించనట్టుగా కనిపిస్తోంది. దీంతో.. ఒక్కసారిగా వివాదం చెలరేగింది. బీజేపీ నేతలే కాకుండా చాలా మంది నెటిజన్లు.. ఈ విషయంపై తీవ్ర స్థాయిలో విమర్శలతో విరుచుకుపడ్డారు. ఈ పరిణామంతో కాసేపటికే ఆ పోస్ట్‌ని రాజగోపాల్ రెడ్డి డిలీట్ చేశారు.అయినప్పటికీ.. కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి పోస్ట్ చేసిన ఫొటోలను స్క్రీన్ షాట్ తీసిన.. బీజేపీ నేతలు, కార్యకర్తలు సోషల్ మీడియాలో వైరల్ చేస్తూ రచ్చ చేశారు. ఇది కాంగ్రెస్ పార్టీ దేశద్రోహి, ప్రజావ్యతిరేక స్వభావాన్ని బహిర్గతం చేసే ఓ క్లాసిక్ ఉదాహరణ అని బీజేపీ నేతలు ఆరోపిస్తూ.. పోస్టులు పెడుతున్నారు. ఈ మేరకు బీజేపీ తెలంగాణ అఫీషియల్ ఖాతాలో స్క్రీన్ షాట్‌లతో పాటు కాంగ్రెస్ పార్టీపై తీవ్ర వ్యాఖ్యలు పోస్టు చేశారు. తెలంగాణ ప్రజల పన్నుల నుంచి వచ్చిన ప్రభుత్వ నిధులను వినియోగిస్తూ.. కేవలం కాంగ్రెస్ పార్టీ నేతలు మాత్రమే ఆహ్వానితులుగా సమ్మిట్‌ను నిర్వహించారని ఆరోపించారు. ఇది కేవలం రాజకీయ నిర్లక్ష్యం మాత్రమే కాదు, ఇది దేశ ద్రోహం అని బీజేపీ తెలంగాణ అభివర్ణించారు.కాంగ్రెస్ పార్టీ విడుదల చేసిన మ్యాప్‌లో లద్దాఖ్, పాక్ ఆక్రమిత కశ్మీర్ ను ఉద్దేశపూర్వకంగా తొలగించారని బీజేపీ తెలంగాణ మండిపడింది. ఇది ప్రపంచానికి చాలా ప్రమాదకరమైన, నీచమైన సందేశాన్ని పంపుతోందని నిప్పులు చెరిగింది. అంటే ఇవి ఇకపై భారత్‌లో భాగం కావని వారి ఉద్దేశమంటూ విమర్శించింది. ప్రజల పన్ను డబ్బులతో నిర్వహించిన ఈ కార్యక్రమం మన జవాన్ల త్యాగాలను అవమానించడం మాత్రమే కాకుండా, భారత దేశ సార్వభౌమాధికారాన్ని నేరుగా దెబ్బతీయడంగా బీజేపీ తెలంగాణ తీవ్ర స్థాయిలో దుయ్యబట్టింది. కాంగ్రెస్ పార్టీ ఇప్పుడు అన్ని రెడ్ లైన్స్ దాటి పోయిందని.. ఇది దేశద్రోహ చర్య అని స్పష్టంగా కనిపిస్తోందని బీజేపీ తెలంగాణ దుయ్యబట్టింది.కాంగ్రెస్ పార్టీ ఇలాంటి వివాదాల్లో చిక్కుకోవడం ఇది మొదటిసారి కాదు. గత ఏడాది డిసెంబర్‌లో కర్ణాటకలోని బెళగావిలో జరిగిన కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ సమావేశాల్లోనూ ఇదే తరహా వివాదం చోటుచేసుకుంది. ఆ సమయంలో కాంగ్రెస్ పార్టీ నేతలు ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలలో భారత దేశ పటాన్ని కశ్మీర్, లేహ్ లేకుండా ముద్రించడం తీవ్ర విమర్శలకు దారితీసింది. బీజేపీ నాయకులు అప్పట్లో కాంగ్రెస్ పార్టీ కావాలనే దేశానికి వెన్నుపోటు పొడుస్తోందని తీవ్రంగా దుయ్యబట్టారు. ఇప్పుడు తాజాగా చోటుచేసుకున్న ఈ ఘటన కూడా అదే తరహా దేశద్రోహ చర్య అని బీజేపీ నేతలు అభిప్రాయపడుతున్నారు. ఈ ఘటనపై కాంగ్రెస్ పార్టీ వెంటనే స్పందించి వివరణ ఇవ్వాలని, దేశ ప్రజలకు క్షమాపణ చెప్పాలని డిమాండ్లు పెరుగుతున్నాయి. ఈ వ్యవహారం రానున్న రోజుల్లో రాజకీయంగా ఎలాంటి పరిణామాలకు దారితీస్తుందో వేచి చూడాలి.

## ఎస్ఎల్బీసీ సహాయక చర్యలు నిలిపివేయడం దారుణం

### మాజీ మంత్రి నిరంజన్ రెడ్డి

వనపర్తి శ్రీశైలం సొరంగంలో సహాయక చర్యలు నిలిపివేయడం కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యం. ఆరుగురు కార్మికుల మృతదేహాలను బయటకు తీయకుండానే మూడు నెలలు సహాయక చర్యలు నిలిపేయడం దారుణమని మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి అన్నారు. అవగాహన, సమీక్ష లేకుండా హడావుడిగా పనులు మొదలుపెట్టి ఎనిమిది మంది ప్రాణాలు బలిగొన్నారు. కేవలం ఇద్దరి మృతదేహాలను బయటకు తీసి 63 రోజుల తర్వాత మిగిలిన వారిని వదిలేసి చేతులెత్తేశారని విమర్శించారు.హెలికాప్టర్ లో తిరిగి, చేపలకూరలు తిని హంగామా చేసిన మంత్రులు, ముఖ్యమంత్రి అధికారికంగా ఎందుకు ఈ ప్రమాదం విషయంలో ప్రకటన చేయడం లేదు ? మరణించిన కుటుంబాలకు ఎందుకు సమాధానం చెప్పడం లేదు ? మరణించిన వారి కుటుంబాలకు వారి మృతదేహాలను అప్పగించకుండా కనీసం చివరి చూపుకు కూడా నోచుకోని దయనీయ పరిస్థితి ఈ కాంగ్రెస్ ప్రభుత్వం కల్పించింది. శ్రీశైలం సొరంగం ప్రమాదం సహాయక చర్యల విషయంలో ప్రభుత్వం ఒక స్పష్టమైన ప్రకటన చేయాలని అయన డిమాండ్ చేసారు.

# రాజకీయ వ్యూహాత్మక చర్యలు...

శ్రీనగర్, ఏప్రిల్ 26, జమ్మూ కాశ్మీర్‌లోని పహల్గాంలో జరిగిన ఉగ్రదాడిలో 25 భారతీయులు, ఒక నేపాలీ పౌరుడు మరణించారు. ఇది గత రెండు దశాబ్దాలలో భారత్‌లో పౌరులపై జరిగిన అత్యంత ఘోరమైన దాడుల్లో ఒకటిగా నిలిచింది. ఈ దాడి కాశ్మీర్‌లోని బైసరాన్ మేడో వద్ద జరిగింది. దీనిని 'మినీ స్విట్జర్లాండ్' అని పిలుస్తారు. ఈ ఘటనకు ప్రతిస్పందనగా, భారత్ పాకిస్థాన్‌పై దౌత్యపరమైన ఒత్తిడిని తీవ్రతరం చేసింది, సింధూ జలాల ఒప్పందంను నిలిపివేసింది, అట్టారీ?వాఘా సరిహద్దును మూసివేసింది. పాకిస్థాన్ దౌత్యవేత్తలను బహిష్కరించింది. అయినప్పటికీ, దేశవ్యాప్తంగా ప్రజలు ఉగ్రవాదులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు. ఈ నేపథ్యంలో, భారత్ ఎదుట ఉన్న సైనిక ఎంపికలు రాజకీయ, వ్యూహాత్మక చర్చలకు కేంద్రబిందువుగా మారాయి.భారత వాయుసేన రఫేల్, మిరాజ్ 2000 వంటి అత్యాధునిక ఫైటర్ జెట్లను ఉపయోగించి, పాకిస్థాన్‌లోని కీలక సైనిక కేంద్రాలు లేదా ఉగ్రవాద స్థావరాలపై కచ్చితమైన దాడులు చేయడం ఒక ఎంపికగా ఉంది. 2019 బాలాకోట్ ఎయిర్‌స్ట్రైక్‌ల తర్వాత సేకరించిన అనుభవాలను ఉపయోగించి, ఈ జెట్లు ప్రత్యర్థి రక్షణ వ్యవస్థలను ఛేదించే సామర్థ్యం కలిగి ఉన్నాయి. అయితే, ఇటువంటి దాడులు అంతర్జాతీయ ఒత్తిడిని తెచ్చిపెట్టవచ్చు. ముఖ్యంగా యునైటెడ్ నేషన్స్ లేదా ఇతర ప్రముఖ దేశాల నుంచి . ఈ ఎంపిక అమలు చేయాలంటే, భారత్ దౌత్యపరమైన ఒత్తిడిని ఎదుర్కొనేందుకు సిద్ధంగా ఉండాలి. దాడులు కచ్చితమైన ఇంటెలిజెన్స్‌పై ఆధారపడి ఉండాలి.పాకిస్థాన్ ఇటీవల సిమ్లా ఒప్పందంను నిలిపివేస్తామని బెదిరించడంతో, నియంత్రణ రేఖ యొక్క పవిత్రతను ప్రశ్నార్థకం చేసింది. ఇది భారత్‌కు ఎల్‌ఓసీ దాటి ఉగ్రవాద స్థావరాలపై దాడులు చేసే అవకాశాన్ని అందిస్తుంది. ఇటీవలి ఎల్‌ఓసీ వద్ద పాకిస్థాన్ జరిపిన సీజ్‌ఫైర్ ఉల్లంఘనలు భారత్‌కు ఈ చర్యలకు నైతిక, వ్యూహాత్మక కారణాన్ని అందిస్తాయి. అయితే, కాశ్మీర్ కఠినమైన భౌగోళిక పరిస్థితులు, పాకిస్థాన్ దళాల బలమైన స్థానాలు, మరియు సుదీర్ఘ ఆపరేషన్ సమయం ఈ ఎంపికను సవాలుగా మార్చవచ్చు. ఈ కార్యకలాపాలు సమర్థవంతంగా అమలు చేయాలంటే, అధిక స్థాయి సమన్వయం మరియు రియల్?టైమ్ ఇంటెలిజెన్స్ అవసరం.2016 సర్జికల్ స్ట్రైక్స్ విజయవంతమైన నేపథ్యంలో, భారత్ పాకిస్థాన్‌లోని పెద్ద ఉగ్రవాద స్థావరాలను లక్ష్యంగా చేసుకొని మరోసారి సర్జికల్ స్ట్రైక్స్ చేపట్టవచ్చు. అయితే, పహల్గాం దాడి తర్వాత పాకిస్థాన్ అప్రమత్తంగా ఉండటం వల్ల ఈ దాడులు ఊహించని ప్రభావాన్ని సృష్టించకపోవచ్చు. విజయవంతమైన సర్జికల్ స్ట్రైక్స్‌కు రియల్?టైమ్ ఇంటెలిజెన్స్, శక్తివంతమైన స్పెషల్ ఫోర్సెస్, కచ్చితమైన ప్లానింగ్ అవసరం. ఈ ఎంపిక తక్కువ స్థాయి ఉద్రిక్తతలను సృష్టిస్తుంది. కానీ భారీ ఫలితాలను హామీ ఇవ్వదు, ముఖ్యంగా పాకిస్థాన్ రక్షణ వ్యవస్థలు హై అలర్ట్‌లో ఉన్నప్పుడు.ఎల్‌ఓసీ సమీపంలో ఉన్న పాకిస్థాన్ ఔట్‌పోస్ట్‌లు, సరఫరా మార్గాలు, లేదా ఉగ్రవాద స్థావరాలను లక్ష్యంగా చేసుకొని శతఘ్నులు, స్నైపర్ గన్స్, భారీ మోర్టార్‌లతో దాడులు చేయడం మరో ఎంపిక. ఈ దాడులు తక్కువ ఉద్రిక్తతలను సష్టిస్తాయి మరియు అంతర్జాతీయ ఒత్తిడిని తగ్గిస్తాయి. ఈ విధానం శత్రు యొక్క సామర్థ్యాలను క్రమంగా బలహీనపరచడంలో సహాయపడుతుంది. కానీ భారీ సైనిక దాడుల వలె గణనీయమైన ఫలితాలను ఇవ్వకపోవచ్చు. ఈ ఎంపిక అమలు సరిహద్దు వెంబడి ఉన్న భారత సైన్యం ఖచ్చితత్వం, సాంకేతిక సామర్థ్యాలపై ఆధారపడుతుంది.సైనిక చర్యలు తీసుకోవడం వల్ల అంతర్జాతీయ సమాజం నుంచి, ముఖ్యంగా ఐక్యరాష్ట్రాలు, చైనా, లేదా ఐరోపా దేశాల నుంచి ఒత్తిడి రావచ్చు. పాకిస్థాన్ ఇప్పటికే సింధూ జలాల ఒప్పందం నిలిపివేతను 'యుద్ధ చర్య'గా పేర్కొంది. ఈ ఒప్పందాన్ని పాకిస్థాన్‌కు జీవనాడిగా భావిస్తోంది, ఎందుకంటే ఇది 240 మిలియన్ల పాకిస్థానీయుల నీటి అవసరాలను తీరుస్తుంది. అదనంగా, పాకిస్థాన్ తమ వైపు నుంచి సిమ్లా ఒప్పందం సహా అన్ని ద్వైపాక్షిక ఒప్పందాలను నిలిపివేస్తామని బెదిరించింది, ఇది భారత్‌కు సైనిక చర్యలకు మరింత నైతిక కారణాన్ని అందిస్తుంది. అయితే, భారత్ ఈ చర్యలను అమలు చేయాలంటే, దౌత్యపరమైన సమతుల్యతను కాపాడుకోవడం, అంతర్జాతీయ మద్దతును సమీకరించడం కీలకం. ఉదాహరణకు, ఫ్రాన్స్ అధ్యక్షుడు ఇమ్మాన్యుయేల్ మాక్రాన్ ఈ దాడిని ఖండిస్తూ భారత్‌కు సంఘీభావం తెలిపారు.ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నేతృత్వంలోని ప్రభుత్వం ఈ దాడికి సంబంధించి "ప్రతి ఉగ్రవాదిని, వారి మద్దతుదారులను గుర్తించి, ఊహించని విధంగా శిక్షిస్తామని" ప్రతిజ్ఞ చేసింది. అయితే, సైనిక చర్యలపై ప్రభుత్వం జాగ్రత్తగా వ్యవహరిస్తోంది, ఎందుకంటే ఏదైనా తప్పిదం ద్వైపాక్షిక ఉద్రిక్తతలను యుద్ధ స్థాయికి తీసుకెళ్లవచ్చు. ఏప్రిల్ 25న హోం మినిస్టర్ అమిత్ షా నివాసంలో సింధూ జలాల ఒప్పందం సస్పెన్షన్‌పై జరిగిన సమావేశం, ఈ చర్యల యొక్క వ్యూహాత్మక ప్రాముఖ్యతను సూచిస్తుంది. అదనంగా, సరిహద్దులో భారత సైన్యం హై అలర్ట్‌లో ఉంది, మరియు సైన్యం అధిపతి సమీక్ష సమావేశాలు నిర్వహిస్తున్నారు, ఇది సైనిక సన్నాహాలను సూచిస్తుందిపహల్గాం దాడి భారత్?పాకిస్థాన్ సంబంధాలను 2019 పుల్వామా దాడి తర్వాత స్థాయికి తీసుకెళ్లింది. ఇప్పుడు ద్వైపాక్షిక సంబంధాలు దాదాపు శూన్య స్థాయికి చేరుకున్నాయి. సైనిక చర్యలు తీసుకుంటే, అవి భారత్ యొక్క జాతీయ భద్రతా లక్ష్యాలను బలపరచవచ్చు కానీ ఆర్థిక, రాజకీయ ఖర్చులను కలిగిస్తాయి. దౌత్యపరమైన చర్యలు, సింధూ జలాల ఒప్పందం సస్పెన్షన్ వంటివి, పాకిస్థాన్‌పై దీర్ఘకాలిక ఒత్తిడిని సృష్టిస్తాయి, కానీ సైనిక చర్యలు తక్షణ ఫలితాలను అందించవచ్చు. భారత్ యొక్క తదుపరి చర్యలు దేశీయ ఒత్తిడి, అంతర్జాతీయ రాజకీయాలు, వ్యూహాత్మక లక్ష్యాల సమతుల్యతపై ఆధారపడి ఉంటాయి.

## బ్యాన్ కీరవాణి....



హైదరాబాద్ ప్రజాబలం ప్రతినిధిఏప్రిల్ 26, గత కొద్దిరోజుల నుండి ఆస్కార్ అవార్డు గ్రహీత కీరవాణి పై పలు ఆరోపణలు వినిపిస్తున్న సంగతి తెలిసిందే. మ్యూజిక్ డైరెక్టర్ గా ఎంతో బిజీ గా గడుపుతున్న ఆయన, ఈటీవీ షో లో 24 సీజన్స్ ని పూర్తి చేసుకున్న 'పాడుతా తీయగా' సింగింగ్ షోలో న్యాయ నిర్ణేతగా వ్యవహరిస్తున్నాడు. ఈ షో ద్వారా రీసెంట్ గానే ఎలిమినేట్ అయినా ప్రవస్తి కీరవాణి, చంద్రబోస్ , సునీత వంటి వారిపై తీవ్రంగా విరుచుకుపడిన సంగతి అందరికీ తెలిసిందే. ఈ వ్యవహారం పై కీరవాణి ఇప్పటి వరకు ఎలాంటి రెస్పాన్స్ ఇవ్వలేదు. దశాబ్దాల నుండి ఇండస్ట్రీ లో ఉంటున్న కీరవాణి పై ఇప్పటి వరకు ఇలాంటి సంచలన ఆరోపణలు ఎవ్వరూ చెయ్యలేదు. ఆ అంశంపై కీరవాణి కి సపోర్ట్ చేసే వాళ్ళు కొంత మంది ఉంటే, వ్యతిరేకించే వాళ్ళు కూడా కొంతమంది ఉన్నారు.కానీ కీరవాణి ఒక సింగింగ్ షోలో క్రిస్టియన్ మతాన్ని పొగుడుతూ హిందూ మరియు ఇతర మతాలను అగౌరవపరిచాడు అంటూ కొన్ని హిందూ సంఘాలకు చెందిన ప్రముఖులు తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు. ఇంతకు ఆయన ఏమన్నాడంటే 'నేను అన్ని మతాలను సమానంగా గౌరవిస్తాను. కానీ క్రిస్టియన్ మతం అంటే కొంచెం ఎక్కువ ఇష్టం. ఎందుకంటే కేవలం ఈ మతం లో మాత్రమే క్షమించే తత్త్వం ఉంటుంది. మిగతా మతాల్లో అది కనపడదు' అంటూ చెప్పుకొచ్చాడు. దీనిపై నెటిజెన్స్ మామూలు రేంజ్ లో ఫైర్ కాలేదు. ముఖ్యంగా హిందూ మతానికి సంబంధించిన వారు అయితే కీరవాణి ని ఏకిపారేస్తున్నారు. ఇతని సినిమాలు బ్యాన్ చేయాలి అంటూ ట్వీట్స్ వేస్తున్నారు. ఒక గురువును కీరవాణి ని ఉద్దేశిస్తూ మాట్లాడిన కొన్ని మాటలు ఇప్పుడు సోషల్ మీడియా లో సంచలనంగా మారాయి. ఇంతకు అతను ఏమి మాట్లాడాడో క్రింది వీడియో లో చూడండి.ఇక కీరవాణి ప్రస్తుతం చేస్తున్న సినిమాల విషయానికి వస్తే మెగాస్టార్ చిరంజీవి తో 'విశ్వంభర' చేస్తున్నాడు. ఈ సినిమా షూటింగ్ దాదాపుగా పూర్తి అయ్యింది. రీసెంట్ గానే 'రామ రామ' అనే పాట కూడా విడుదలై మంచి రెస్పాన్స్ ని సొంతం చేసుకుంది. అదే విధంగా పవన్ కళ్యాణ్ 'హరి హర వీరమల్లు' చిత్రానికి కూడా ఆయన సంగీతం అందిస్తున్నాడు. ఇప్పటికే రెండు పాటలు విడుదలై ఆడియన్స్ నుండి మంచి రెస్పాన్స్ ని సొంతం చేసుకుంది. ఈ రెండు కాకుండా ప్రస్తుతం పాన్ వరల్డ్ చిత్రం మహేష్ బాబు, రాజమౌళి చిత్రానికి కూడా ఈయనే సంగీత

## దానం కారులో ఖర్చీఫ్



హైదరాబాద్, ఏప్రిల్ 26, ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్ కాంగ్రెస్ పార్టీకి దూరం అయ్యేటట్లే కనిపిస్తున్నారు. ఆయన చేస్తున్నవ్యాఖ్యలు, చేస్తున్న పనులు మళ్లీ బీఆర్ఎస్ కు దగ్గరయ్యేందుకేనన్నది స్పష్టంగా అర్థమవుతుంది. అందుకే తరచూ ఆయన చేస్తున్న కామెంట్స్ అధికార పార్టీకి వ్యతిరేకంగా, తాను ఎన్నికై బయటకు వచ్చిన బీఆర్ఎస్ పార్టీకి అనుకూలంగా మారుతున్నాయి. ఈ సౌండ్ విన్న వారికి ఎవరికైనా దానం నాగేందర్ ఖచ్చితంగా తిరిగి కారు ఎక్కేందుకేనన్నది చిన్న పిల్లాడికి కూడా అర్థమవతుంది. 2023 ఎన్నికల్లో బీఆర్ఎస్ నుంచి ఖైరతాబాద్ నియోజకవర్గంలో గెలిచిన దానం నాగేందర్ తర్వాత కాంగ్రెస్ కు అనుకూలంగా మారారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సమక్షంలో కాంగ్రెస్ కండువా కప్పుకున్నారు.మొదటి నుంచి అంతే... అంతటితో ఆగకుండా సికింద్రాబాద్ పార్లమెంటు నియోజకవర్గం నుంచి కూడా 2024లో పోటీ చేసిన దానంనాగేందర్ ఓటమి పాలయ్యారు. అయితే గత కొంతకాలంగా అధికార పార్టీ నిర్ణయాలను బహిరంగంగానే వ్యతిరేకిస్తున్నారు. హైడ్రా కూల్చివేతలను ఆపేయాలనంటూ ఆయన హుకుం జారీ చేశారు. హైడ్రా వల్ల ప్రభుత్వ ప్రతిష్ట మరింత దిగజారి పోతుందని కూడా అన్నారు. అంతటితో ఆగకుండా దానం నాగేందర్ తన నియోజకవర్గంలో హైడ్రా కూల్చివేతలను అడ్డుకునే ప్రయత్నం కూడా చేశారు. దానం నాగేందర్ మూసీ నది ప్రక్షాళన జరగాలంటూనే అదే సమయంలో పేదల ఇళ్లను కూల్చితే తాను ఒప్పుకోనని తెగేసి చెబుతున్నారు. దానం నాగేందర్ కు మంత్రి పదవి వస్తుందని భావించినా అది సాధ్యంకాలేదు. దీంతో నాగేందర్ ఫ్రస్టేషన్ కు లోనవుతున్నట్లు కనిపిస్తుంది. తేలని నిర్ణయం తాజా వ్యాఖ్యలతో... ఇక మరో అడుగు ముందుకు వేసి హైదరాబాద్ యూనివర్సిటీ భూముల వివాదంలో నోటీసులు అందుకున్న ఐఏఎస్ అధికారి స్మితా సబర్వాల్ కు కూడా అండగా నిలిచారు. స్మితా సబర్వాల్ రీట్వీట్ చేసిన విషయాల్లో తప్పేమీ లేదని అనడంతో దానం నాగేందర్ నేరుగా ప్రభుత్వానికి వ్యతిరేకంగానే వ్యాఖ్యానించినట్లు స్పష్టమవుతుంది. స్మితా సబర్వాల్ కాంగ్రెస్ ను ఉద్దేశించి ఏమీ అనలేదని దానం నాగేందర్ వెనకేసుకొచ్చారు. మరొక వైపు ఈనెల 27వ తేదీన జరిగే బీఆర్ఎస్ బహిరంగ సభ విజయవంతమవుతుందని కూడా దానం నాగేందర్ అన్నారు. కేసీఆర్ నాయకత్వంలో ఈ సభకు భారీ సంఖ్యలో జనం హాజరవుతారన్న ఆయన కేసీఆర్ ను చూసేందుకు, ఆయన మాటలను వినేందుకు ప్రజలు ఆసక్తిగా ఎదురు చూస్తున్నారని అని కారులో కర్చీఫ్ వేసినట్లయింది.

## తెలంగాణలో పెరుగుతోన్న వడదెబ్బ మరణాలు..

హైదరాబాద్ ప్రజాబలం ప్రతినిధి ఏప్రిల్ 26 తెలుగు రాష్ట్రాల్లో ఉష్ణోగ్రతలు చాలా పెరిగిపోతున్నాయి. సూర్యుడు ఏ మాత్రం జాలి, దయ, కరుణ లేకుండా తన ప్రతాపాన్ని చూపిస్తున్నాడు. ముఖ్యంగా తెలంగాణలో ఈ ఎండలు మరీ ఘోరంగా ఉన్నాయి. తెలంగాణలోని కొన్ని ప్రదేశాల్లో ఎండతీవ్రత 45 డిగ్రీలుగా ఉంది. దీంతో పలువురు మృత్యువాత పడుతున్నారు. వారం రోజుల్లో తెలంగాణలో హీట్ స్ట్రోక్ వల్ల దాదాపు 11 మంది చనిపోయారని రిపోర్ట్స్ చెప్తున్నాయి. అందుకే ప్రజలు హీటో స్ట్రోక్పై అవగాహన కలిగి ఉండాలని సూచిస్తున్నారు నిపుణులు. వేసవి కాలంలో వడదెబ్బను చాలామంది ఎదుర్కొంటారు. అయితే సరైన జాగ్రత్తలు తీసుకోకుంటే అది ప్రాణాంతకమవుతుందని గుర్తించుకోవాలి. చాలామంది తెలియక దాని గురించి పెద్దగా పట్టించుకోరు. కానీ దానికి ప్రాణాలు హరించే సత్తా ఉందని తెలుసుకోవాలి. అందుకే హీట్ స్ట్రోక్ రాకుండా ఉండేందుకు కొన్ని జాగ్రత్తలు తీసుకోవాలి. వడదెబ్బ వస్తే ఏమి చేయాలో.. ఎలాంటి టిప్స్ ఫాలో అవ్వాలో ఇప్పుడు చూసేద్దాం. ఎండ తీవ్రత ఎక్కువగా ఉన్నప్పుడు లేదా ఉష్ణోగ్రతలు అధికంగా ఉన్నప్పుడు.. శరీర ఉష్ణోగ్రతల్లో మార్పులు సంభవిస్తాయి. అవి హీట్స్ట్రోక్కి దారితీస్తాయి. ఎండలో తిరిగినప్పుడు లేదా.. ఎండలో ఎక్కువ పని చేసినప్పుడు ఇలా జరుగుతుంది. సాధారణంగా ఉండాల్సిన దానికంటే ఎక్కువగా శరీర ఉష్ణోగ్రతలు మారిపోయి వడదెబ్బకు దారితీస్తాయి. మేజర్ కేస్లలో హీట్ స్ట్రోక్ మెదడు, గుండె, మూత్రపిండాలు, కండారలపై తీవ్రమైన ప్రభావం చూపించి మృత్యువుకు దారి తీస్తాయి.

వడదెబ్బకు కారణాలివే..

అధిక ఉష్ణోగ్రతల్లో బయటకు వెళ్లడం, పని చేయడం వడదెబ్బకు దారితీస్తాయి. శరీరానికి కావాల్సిన నీటిని తీసుకోనప్పుడు.. డీహైడ్రేషన్ వల్ల కూడా హీట్ స్ట్రోక్ వస్తుంది. ఎండ ఎక్కువగా ఉన్న సమయాల్లో ఎక్కువగా శారీరకంగా కష్టపడినా కూడా దీని బారిన పడతారు. బిగుతుగా ఉండే డ్రెస్లు కూడా శరీరానికి గాలిని అందించకుండా ఉక్కబోతను పెంచి వడ దెబ్బ సమస్యలను రెట్టింపు చేస్తాయి. వివిధ ఆరోగ్య సమస్యలు ఉన్నవారికి కూడా వడదెబ్బ వచ్చే అవకాశం ఎక్కువగా ఉంటుంది.

వడదెబ్బ లక్షణాలివే..

శరీర ఉష్ణోగ్రత సడెన్గా పెరిగిపోతుంది. 104శీఈ లేదా 40శీఅ దాటిపోతుంది. చర్మం ఎర్రగా, వేడిగా మారుతుంది. ఎక్కువ చెమట రావడం వల్ల పొడిబారిపోతుంది కూడా. గుండె వేగంగా కొట్టుకోవడం, శ్వాస తీసుకోవడంలో సమస్యలు కూడా వడదెబ్బ లక్షణాలే. తీవ్రమైన తలనొప్పి, కళ్లు తిరగడం, కన్ఫ్యూజన్ ఎక్కువ అవ్వడం, వాంతులు, కండరాలు వీక్గా మారడం, నడవలేకపోవడం కూడా హీటోస్ట్రోక్ లక్షణాలని చెప్తున్నారు నిపుణులు.

వడదెబ్బ రాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలు..

ఎండ ఎక్కువగా ఉన్న సమయంలో బయటకు వెళ్లకపోవడమే మంచిది. ముఖ్యంగా ఉదయం 10 నుంచి సాయంత్రం 4 వరకు ఇంట్లోనో లేదా ఆఫీస్లోనో ఉండండి. వీలైనంత వరకు నీటిని తాగండి. మీకు దాహంగా లేకున్నా శరీరానికి నీటిని అందించండి. హైడ్రేషన్ని అందించే ఫుడ్స్ కూడా తినొచ్చు. తప్పనిసరి పరిస్థితుల్లో బయటకు వెళ్లాల్సి వస్తే వదులుగా, కంఫర్ట్గా ఉండే దుస్తులు వేసుకోండి. తలకు కచ్చితంగా క్యాప్ పెట్టుకోండి. లేదా స్కార్ఫ్ కట్టుకుని కళ్లకు షేడ్స్ పెట్టుకోండి. సన్స్క్రీన్ కచ్చితంగా ఉపయోగించాలి. దీనివల్ల శరీరం కూలింగ్ లక్షణాలు పొంది హీట్ బర్న్స్ రాకుండా చేస్తుంది. చల్లని నీటితో స్నానం చేయండి. వీలైనంతవరకు కూల్గా ఉండేందుకు ట్రై చేయండి. వేడి ఎక్కువగా ఉన్నసమయంలో శారీరక శ్రమ ఎక్కువగా లేకుండా చూసుకోండి. పిల్లలు, ఆరోగ్య సమస్యలున్నవారు, వృద్ధులు మరింత జాగ్రత్తగా ఉండాలి.

హీట్ స్ట్రోక్ వస్తే ఫాలో అవ్వాల్సిన టిప్స్..

ఒకవేళ ఎవరైనా వడదెబ్బతో ఇబ్బంది పడుతుంటే వారికి వెంటనే ఫస్ట్ ఎయిడ్ అందించాలి. బాధిత వ్యక్తిని ముందు నీడలోకి తీసుకెళ్లాలి. శరీరంపై బిగుతుగా ఉన్న దుస్తులు తీసేయాలి. చల్లని నీటిని కాకుండా నార్మల్ నీటిని చిన్న చిన్నగా వ్యక్తికి అందించాలి. గాలి ఆడేలా చూసుకోవాలి. వెంటనే వైద్యుల దగ్గరికి తీసుకెళ్తే మరీ మంచిది. సరైన జాగ్రత్తలు తీసుకుంటే వడదెబ్బ రాకుండా చూసుకోవచ్చు. కానీ మీకు వడదెబ్బ వస్తుందని అనిపించిన వెంటనే నీడ ఉండే ప్రదేశాలకు వెళ్లిపోండి. తగినంత నీటిని అందించడం వల్ల శరీరంలోని ఉష్ణోగ్రతలు అదుపులో ఉంటాయి. మీరు ఎలాంటి జాగ్రత్తలు తీసుకోకపోతే ప్రాణాలు పోయే ప్రమాదముంది. కాబట్టి వీలైనంత వరకు నిపుణుల సూచనలు ఫాలో అయిపోండి.

## రికార్డు స్థాయిలో లిక్కర్ సేల్స్

హైదరాబాద్ ప్రజాబలం ప్రతినిధి ఏప్రిల్ 26, వేసవికాలం రాగానే చాలామంది చల్లదనం కోరుకుంటూ ఉంటారు. ఈ క్రమంలో శరీరంలోని ఉష్ణోగ్రతను తగ్గించుకోవడానికి చల్లని పానీయాలను సేవిస్తూ ఉంటారు. అయితే కొందరు సాధారణ కూల్డ్రింక్స్ కు బదులు బీర్లను తాగాలని ఇష్టపడతారు. దీంతో వేసవి కాలంలో బీర్ల అమ్మకాలు విపరీతంగా పెరిగిపోతూ ఉంటాయి. అయితే తెలంగాణ ప్రభుత్వం కొన్ని నెలల కింద బీర్ల ధరలను పెంచింది. అయినా కూడా ధరలను లెక్కచేయకుండా బీర్ల అమ్మకాలు విపరీతంగా పెరుగుతున్నాయి. ఇటీవల వీటి అమ్మకాలు రెట్టింపు స్థాయిలో ఉందని నివేదికలు తెలుపుతున్నాయి. మండే ఎండలతోనే చాలామంది చల్లదనం కోసం ఎక్కువగా బీర్లను ఆశ్రయిస్తున్నట్లు తెలుస్తోంది. ఇంతకీ బీర్ల అమ్మకాలు ఎలా ఉన్నాయంటే?తెలంగాణలో ప్రస్తుతం రాష్ట్రవ్యాప్తంగా రోజుకు 3 లక్షల బీర్ల కేసులు అమౌంట్ అవుతున్నట్లు తెలుస్తోంది. సాధారణ రోజులతో పోలిస్తే ఇవి రెట్టింపు అమ్మకాలు అని వ్యాపార వర్గాలు తెలుపుతున్నాయి. ఎండలు మండిపోవడంతోనే చాలామంది బీర్లు ఎక్కువగా కొనుగోలు చేస్తున్నారని అంటున్నారు. బీర్ల కంటే లిక్కర్ ధరలు తక్కువ గా ఉన్న.. ఎక్కువ శాతం బీర్లను మాత్రమే కొనుగోలు చేస్తున్నారని అంటున్నారు. మరోవైపు శుభకార్యాలకు సమయం ఆసన్నం కావడంతో చాలామంది మద్యం కొనుగోలు చేసే సమయంలో బీర్లను మాత్రమే కొనుగోలు చేస్తున్నారని అంటున్నారు. ఈ తరుణంలో బీర్ల ఉత్పత్తికి డిమాండ్ పెరిగిపోతుందిఅయితే కేవలం వైన్స్ షాపుల ద్వారా మాత్రమే కాకుండా రెస్టారెంట్లు, బార్ల ద్వారా కూడా బీర్ల అ మ్మకాలే ఎక్కువగా ఉన్నాయని అంటున్నారు. దీంతో ఎక్సైజ్ శాఖకు విపరీతమైన ఆదాయం వస్తున్నట్లు తెలుస్తోంది. ఇప్పటికే వేసవికాలంలో నిర్ణయించుకున్న లక్ష్యానికి చేరుతున్నట్లు ఎక్సైజ్ శాఖ భావిస్తోంది. గత ఆర్థిక సంవత్సరంలో 5.48 కోట్ల కేసుల బీర్లు అమ్ముడుపోయాయి. అయితే ఈ ఏడాది సమ్మర్ లో మాత్రమే కోటిన్నర బీర్ల అమ్మకాలు చేయాలని టార్గెట్ పెట్టుకున్నారు. ఈ నేపథ్యంలో ఐ ఎం ఎల్ లిక్కర్ కేసులు కూడా 4 కోట్ల కేసులు పెంచాలని అనుకుంటున్నారు. అయితే లిక్కర్ కంటే బీర్ల అమ్మకాలే ఎక్కువగా ఉన్నట్లు తెలుస్తోంది.గత మార్చి 22వ తేదీన ఒక్కరోజే దాదాపు 4 లక్షల కేసుల బీర్లు అమ్ములు పోయాయి. ఆ తర్వాత రోజు నుంచి యావరేజ్ గా ప్రతిరోజు మూడు లక్షల కేసులు అమ్ముడుపోతున్నాయి. ఇక ఏదైనా సెలవులు వస్తే ఈ సేల్స్ మరింత స్థాయిలో పెరుగుతున్నాయి. ఇలాగే సేల్స్ పెంచుకుంటూ పోతే ఈ రెండు నెలల్లోనే టార్గెట్ ను రీచ్ అయ్యి అవకాశం ఉందని ఎక్సైజ్ శాఖ పేర్కొంటుంది. అయితే త్వరలో లిక్కర్ ధరలు పెంచే ఆలోచనలో ప్రభుత్వం ఉంది. ఇప్పటికే బీర్ల ధరలను పెంచింది. అయినా ధరలను లెక్కచేయకుండా బీర్లను ఎక్కువగా సేవిస్తూ ఉన్నారు. ఎండాకాలం కావడంతో పాటు ఉష్ణోగ్రత తీవ్రంగా పెరగడంతో చల్లదనం కోసం ఎక్కువగా బీర్లని కొనుగోలు చేస్తున్నారు.

# ఎల్కతుర్తి సభకు భారీ ఏర్పాట్లు.. పార్కింగ్ ప్రాంతాలు ఇవే

**వరంగల్|ప్రజాబలం ప్రతినిధి: ఏప్రిల్ 26** ఎల్కతుర్తిలో జరిగే బీఆర్ఎస్ రజతోత్సవ సభా ప్రాంగణానికి చేరుకునేలా జోన్లవారీగా రూట్ మ్యాప్‌లను సిద్ధం చేశారు. 5 జోన్లను ఏర్పాటు చేస్తున్నారు. సభా ప్రాంగణానికి మొత్తం నాలుగు రహదారుల ద్వారా వాహనాలు చేరుకునేలా ఏర్పాట్లు చేశారు. అందులో మూడు జాతీయ రహదారులు సహా.. సభ జరిగే చింతలపల్లికి చేరుకునేలా ధర్మసాగర్ నుంచి వచ్చే మరో రూట్‌ను కూడా సిద్ధం చేశారు.

వాహనాల రాకపోకలు ఇలా..

వరంగల్ నుంచి.. ఇది 163వ జాతీయ రహదారి. ఈ రూట్ గుండా వరంగల్, ఖమ్మం, నల్లగొండ, మహబూబ్‌నగర్, రంగారెడ్డి ఉమ్మడి జిల్లాలు సహా హైదరాబాద్ నుంచి బీఆర్ఎస్ శ్రేణులు వచ్చే అవకాశం ఉంది.

సిద్దిపేట–హుస్నాబాద్ నుంచి.. ఇది 765వ డీజీ జాతీయ రహదారి. ఈ రూట్ నుంచి మెదక్, నిజామాబాద్ ఉమ్మడి జిల్లాలు సహా వెస్ట్ ఆదిలాబాద్.. (ఆదిలాబాద్, నిర్మల్, బోథ్, ఖానాపూర్ నియోజక వర్గాలు) నుంచి కార్యకర్తలు వస్తారని బీఆర్ఎస్ నేతలు చెబుతున్నారు.

కరీంనగర్ రూట్.. ఇది 563వ జాతీయ రహదారి. ఈ రూట్ గుండా ఉమ్మడి కరీంనగర్, ఈస్ట్ ఆదిలాబాద్ (సిర్పూర్ కాగజ్‌నగర్, బెల్లంపల్లి, చెన్నూరు, మంచిర్యాల, ఆసిఫాబాద్, భూపాలపల్లి, కొంత పరకాల నియోజకవర్గాలు) నుంచి కార్యకర్తలు వచ్చే అవకాశం ఉంది.

ధర్మసాగర్ రూట్.. ధర్మసాగర్ నుంచి చింతలపల్లి సభ జరిగే ప్రాంగణానికి అనుకుని ఉన్న రోడ్డు ఇది. ఈ రూట్ నుంచి స్టేషన్ ఘనపూర్, జనగామ నియోజకవర్గాల నుంచి వాహనాలు వచ్చే అవకాశం ఉంది.

5 జోన్లు..

జోన్ 1– నేషనల్ హైవే 163 మీదుగా గుడెప్పాడ్, ఆరేపల్లి, హసన్‌పర్తి, ఎల్లాపూర్ వైపు నుంచి వచ్చే వాహనాలతోపాటు.. హసన్‌పర్తి, ఎల్లాపూర్ మీదుగా ఈ పారింగ్ స్థలానికి చేరుకునే అవకాశం ఉంది. కాకతీయ యూనివర్సిటీ క్రాస్ రోడ్ వరకు వివిధ మార్గాల ద్వారా చేరుకున్న వాహనాలు.. హసన్‌పర్తి, ఎల్లాపూర్ మీదుగా ఈ జోన్–1 పార్కింగ్‌కు చేరుకునేలా ఏర్పాట్లు చేశారు.

జోన్ 2– కరుణాపురం, దేవన్నపేట, మడిపల్లి అనంతసాగర్ మీదుగా ఇక్కడికి చేరుకునే అవకాశం ఉంది. మరో రూట్ వరంగల్ లోని నాయుడు పెట్రోల్ పంప్, భట్టుపల్లి, కడిపికొండ ఆర్వోబీ, మడికొండ మీదుగా.. దేవన్నపేట, మడిపల్లి, అనంతసాగర్ నుంచి ఈ జోన్–2కు చేరుకునేలా ఏర్పాట్లు చేశారు. చింతగట్టు, జయగిరి, అనంతసాగర్ మీదుగా కూడా జోన్–2కు చేరుకోవచ్చు.

జోన్ 3– ధర్మసాగర్ మీదుగా దేవునూరు, దామెర, చింతలపల్లి నుంచి వచ్చే వాహనాలు చేసుకునేలా జోన్–3లో ఏర్పాట్లు చేశారు.

జోన్ 4– కరీంనగర్ జాతీయ రహదారి 563 మీదుగా వచ్చే వాహనాలు.. హుజూరాబాద్, కోతులనడుమ, గ్రానైట్ క్వారీ మీదుగా ఈ పార్కింగ్ జోన్–4కు చేరుకునేలా ఏర్పాట్లు చేశారు.

జోన్ 5– సిద్దిపేట జాతీయ రహదారి 765(డీజీ) మీదుగా సిద్దిపేట, హుస్నాబాద్, ములనూరు, గోపాల్‌పూర్ క్రాస్‌రోడ్, ఇందిరానగర్ మీదుగా జోన్–5కు చేరుకునేలా ఏర్పాట్లు చేశారు. మరో రూట్‌లో వేలేరు, కొత్తకొండ, ముత్తారం వైపు నుంచి జోన్–5 పార్కింగ్‌కు చేరుకునేలా ఏర్పాట్లు జరిగాయి. మరో రూట్ కరీంనగర్ మీదుగా వచ్చే వాహనాలు కోతులనడుమ మీదుగా దారి మళ్లించుకుని గోపాల్‌పూర్, గోపాల్‌పూర్ క్రాస్‌రోడ్, సిద్దిపేట జాతీయ రహదారి మీదుగా ఇందిరానగర్ నుంచి జోన్–5కు చేరుకునేలా ఏర్పాట్లు చేశారు.

సభకు వచ్చే కార్యకర్తలు, ప్రజలు వీటిని గమనించాలని నేతలు కోరారు. వరంగల్ సీపీ, స్థానిక పోలీసులకు బీఆర్ఎస్ నేతలు ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్, పెద్ది సుదర్శన్ రెడ్డి.. పార్కింగ్ జోన్ల గురించి వివరించారు. పోలీసులతో చర్చించి వీటిని ఫైనల్ చేశారు.

# బీఆర్ఎస్ పక్కా ప్లాన్
## అసంతృప్తి వర్గాలను దగ్గరకు తీస్తున్న దళపతి

**వరంగల్|ప్రజాబలం ప్రతినిధి:** ఏప్రిల్ 26, బీఆర్ఎస్ పార్టీ సిల్వర్ జూబ్లీ ఉత్సవాలకు కౌంట్ డౌన్ మొదలైంది. బీఆర్ఎస్ పార్టీ ఆవిర్భవించి 24 ఏళ్లు పూర్తి చేసుకుని, 25వ వసంతంలోకి అడుగుపెడుతున్న నేపథ్యంలో ఈనెల 27న హన్మకొండ జిల్లా ఎల్కతుర్తిలో పెద్ద ఎత్తున రజతోత్సవాలను నిర్వహిస్తోంది. 10 లక్షల జన సమీకరణతో కనీవినీ ఎరుగని రీతిలో సిల్వర్ జూబ్లీ భారీ బహిరంగ సభకు ఏర్పాట్లు స్పీడప్ చేస్తున్నారు బీఆర్ఎస్ నేతలు.దీంతో అంతా వరంగల్ సభవైపే ఆసక్తిగా చూస్తోంటే..గులాబీ బాస్ కేసీఆర్ మాత్రం మాత్రం మరో కోణంలో ఆలోచిస్తున్నారట. 27న జరిగే బహిరంగ సభ సందర్భంగా కాస్త డిఫరెంట్ గా ప్లాన్ చేశారట గులాబీ పార్టీ నేతలు. అధికార కాంగ్రెస్ పార్టీని డిఫెన్స్ లో పడేసేలా ఎవ్వరూ ఊహించని సరికొత్త వ్యూహాన్ని రచించారని తెలుస్తోంది.అధికార కాంగ్రెస్ పార్టీలో అసంతృప్తిగా ఉన్న నేతలపై బీఆర్ఎస్ నేతలు దృష్టి సారించారట. ఈనెల 27న పార్టీ రజతోత్సవ సభలో ఆయా కాంగ్రెస్ నేతలను కారు ఎక్కించేయాలని భావించారని తెలుస్తోంది. తమ ఎమ్మెల్యేలు పార్టీ మారిన పది నియోజకవర్గాల్లో పాత కాంగ్రెస్ నాయకులు తీవ్ర అసంతృప్తితో రగిలిపోతున్నారనే విషయాన్ని గుర్తించిన బీఆర్ఎస్..వారితో కొద్ది రోజులుగా సంప్రదింపులు జరుపుతున్నారట.తమను సీఎం రేవంత్ రెడ్డి, పీసీసీ చీఫ్ మహేష్ గౌడ్ పిలిచి మాట్లాడలేదని, బీఆర్ఎస్ లో గెలిచి కాంగ్రెస్ లోకి వచ్చిన ఎమ్మెల్యేలతో తమకు ఎదురవుతున్న ఇబ్బందులను పట్టించుకోవడం లేదనే అసహనంతో రగిలిపోతున్నారట ఆ 10 నియోజకవర్గాల కాంగ్రెస్ నేతలు. సరిగ్గా ఇక్కడే ప్రతిపక్ష బీఆర్ఎస్ చాలా వ్యూహాత్మకంగా అడుగులు వేసిందన్న చర్చ జరుగుతోంది. అలాంటి అసంతృప్త నేతలను కారెక్కిస్తే అధికార పార్టీకి బిగ్ షాకే ఇచ్చినట్టు ఉంటుందన్నది గులాబీ పార్టీ పెద్దల ఆలోచనగా తెలుస్తోందిగులాబీ పార్టీలోని ఓ కీలక నేత కాంగ్రెస్ అసంతృప్త నాయకులతో రాయబారం నెరిపినట్లు తెలుస్తోంది. పార్టీ ఫిరాయించి కాంగ్రెస్ పార్టీలోకి వెళ్లిన ఎమ్మెల్యేల నియోజకవర్గాల్లో కచ్చితంగా ఉప ఎన్నికలు వస్తాయిని, అప్పుడు మీకే టిక్కెట్లు ఇస్తామని హామీ ఇచ్చారట. అంతే కాకుండా వచ్చే సాధారణ ఎన్నికల్లో కూడా టికెట్స్ మీకేనని గ్యారంటీ కూడా ఇచ్చి వారిని కారెక్కించేందుకు ఒప్పించే ప్రయత్నం చేశారట.

ఈనెల 27న ఎల్కతుర్తి రజతోత్సవ సభలో ఆ పది నియోజకవర్గాల్లో కనీసం ఏడెనిమిది నియోజకవర్గాల ముఖ్య నేతలకు పార్టీ అధినేత కేసీఆర్ చేత గులాబీ కండువాలు కప్పించాలి అని బీఆర్ఎస్ ప్లాన్ చేసిందని సమాచారం. అయితే ప్రతిపక్ష బీఆర్ఎస్ పన్నిన రాజకీయ వ్యూహాన్ని ఇంటెలిజెన్స్ వర్గాలు పసిగట్టినట్లు తెలుస్తోంది.కొన్ని రోజులుగా అధికార కాంగ్రెస్ అసంతృప్తి నేతలతో బీఆర్ఎస్ నేతలు రహస్యంగా సంప్రదింపులు జరపడం, పార్టీలో చేర్చుకునేందుకు ప్రయత్నించడంపై కాంగ్రెస్ ప్రభుత్వ పెద్దలను అలర్ట్ చేశారట.

దీంతో ఒక్కసారిగా ఉలిక్కిపడ్డ కాంగ్రెస్ ముఖ్య నేతలు ఏమాత్రం ఆలస్యం చేయకుండా రంగంలోకి దిగారన్న టాక్ విన్పిస్తోంది. పార్టీ ఫిరాయింపులు జరిగిన ఆ పది నియోజకవర్గాల్లోని అసంతృప్త నేతలను బుజ్జగించేందుకు ప్రయత్నాలను మొదలుపెట్టినట్లు తెలుస్తోంది.బీఆర్ఎస్ లో గెలిచి కాంగ్రెస్ లోకి వెళ్లిన ఆ 10 మంది ఎమ్మెల్యేలను గులాబీ పార్టీ లోకి మళ్లీ రానిచ్చేది లేదంటున్న అక్కడి కాంగ్రెస్ నేతలపై ఆకర్ష్ అస్త్రం వేస్తోంది . మరి గులాబీ అస్త్రానికి ఆ నేతలు చిక్కుతారా .. కారెక్కుతార అన్నది ఇప్పుడు ఆసక్తి రేపుతోంది .. లేదంటే కాంగ్రెస్ బుజ్జగింపులకు తలొగ్గుతారా..ఈ నెల 27న ఓరుగల్లు వేదికగా ఏం జరగబోతుందో చూడాలి మరి.

# అమల్లోకి హెచ్ఎండీఏ బిల్డ్ నౌ సేవలు

**హైదరాబాద్|ప్రజాబలం ప్రతినిధి: ఏప్రిల్ 26** భవన నిర్మాణలు, లేఔట్ల అనుమతుల మంజూరు విషయంలో తెలంగాణ ప్రభుత్వం సరికొత్త సంస్కరణలు తీసుకువచ్చింది. వేగంగా, సులభంగా అనుమతులు పొందేలా 'బిల్డ్ నౌ' అప్లికేషన్ సేవలను ప్రవేశపెట్టింది. మొదట్లో జీహెచ్ఎంసీ పరిధిలోనే ఈ సేవలు అందబాటులో ఉండగా? తాజాగా హెచ్ఎండీఏ పరిధిలోనూ ఈ సేవలు ప్రారంభమయ్యాయి.టీజీ – బీపాస్ ద్వారా భవన నిర్మాణాలు, లేఔట్లకు అనుమతులు వచ్చేవి. అయితే ఇందులో ఇబ్బందులకు పూర్తిస్థాయిలో చెక్ పెట్టడంతో పాటు అత్యంత వేగంగా అనుమతులు ఇచ్చేలా తెలంగాణ ప్రభుత్వం 'బిల్డ్ నౌ' వ్యవస్థను తీసుకువచ్చింది. తొలుత ఈ విధానాన్ని జీహెచ్ఎంసీ పరిధిలో అమలు చేయగా.. సత్ఫలితాలు వచ్చాయి. దీంతో రాష్ట్రవ్యాప్తంగా ఈ సేవలను అందుబాటులోకి తీసుకువచ్చేలా ప్రభుత్వం కసరత్తు చేస్తోంది. అయితే ఈ అప్లికేషన్ ప్రత్యేకతలు, వివరాలెంటో ఇక్కడ తెలుసుకోండి?.

'బిల్డ్ నౌ' అప్లికేషన్ సేవలు – ముఖ్యమైన అంశాలు:

రాష్ట్రంలో భవన నిర్మాణ అనుమతుల ప్రక్రియను సులభతరం చేసేందుకు తెలంగాణ ప్రభుత్వం 'బిల్డ్ నౌ' అనే అప్లికేషన్ తీసుకువచ్చింది.ఈ అధునాతన అప్లికేషన్‌ను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రారంభించారు.

ముందుగా ఈ సేవలను జీహెచ్ఎంసీ పరిధిలో అమలు చేశారు. దీని ద్వారానే దరఖాస్తులను స్వీకరించి? భవన నిర్మాణ అనుమతులను మంజూరు చేశారు.

ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, బ్లాక్‌చైన్, ఆగ్మెంటెడ్ రియాలిటీ, ఆటోమేషన్ వంటి సాంకేతికతను ఉపయోగిస్తారు. ఎలాంటి ఆటంకాలు లేకుండా అత్యంత వేగంగా అనుమతులు మంజూరు చేయడమే 'బిల్డ్ నౌ' సేవల ముఖ్య ఉద్దేశ్యం.

ప్రస్తుతం ఊఓఆం పరిధిలోనూ ఈ అప్లికేషన్ ద్వారానే అనుమతులు మంజూరు చేసేలా ఆదేశాలు జారీ అయ్యాయి. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న మన్సిపాలిటీల్లోనూ ఈ సేవలు అమలు చేసేలా అధికారులు కసరత్తు చేస్తున్నారు.

ఈ అప్లికేషన్ ద్వారా వేగంగా ప్రాసెస్ పూర్తవుతుంది. అనుమతి ప్రక్రియ అంతా ఒకే చోట పూర్తి చేయగల ఏకీకృత సింగిల్ విండో ఇంటర్ ఫేస్ అని అధికారులు చెబుతున్నారు.

గతంలో భవన నిర్మాణ అనుమతులు వారం నుంచి నెలరోజుల్లో వచ్చేవి. అయితే ఈ అప్లికేషన్ ద్వారా అత్యంత వేగంగా? నిమిషాల వ్యవధిలోనే ఔట్ పుట్ ఉంటుంది.

టీజీబీపాస్‌లో ఇన్‌స్టంట్ అప్రూవల్‌కు, మిగతా అనుమతులకు వేర్వేరు విండోస్ ఉండేవి. కానీ బిల్డ్ నౌలో అన్నింటికీ ఒకే విండోతో త్వరితగతిన అనుమతులు జారీ అవుతాయి. భవన నిర్మాణం పూర్తయ్యాక ఎలా ఉంటుందో కూడా త్రీడీలో డిస్ ప్లే అవుతుంది.

ఇప్పటి వరకు డ్రాయింగ్స్ పరిశీలనకే ఎక్కువ రోజులు పట్టేది. కానీ ఎలాంటి భవనాలకైనా ఈ కొత్త అప్లికేషన్ ద్వారా నిమిషాల్లోనే పరిశీలన పూర్తవుతుంది.

ప్రతి అప్లికేషన్ ను ధృవీకరించి ట్రాక్ చేసేందుకు బ్లాక్ చైన్ టెక్నాలజీ అవకాశం కల్పిస్తుంది. ఎలాంటి లోపాలు లేకుండా పని చేసేలా ఈ బిల్డ్ నౌ అప్లికేషన్ ను రూపొందించారు.

జీహెచ్ఎంసీ, హెచ్ఎండీఏ, టీడీసీపీ, ఇతర స్థానిక సంస్థలు, పట్టణాభివృద్ధి సంస్థలు, అగ్నిమాపకశాఖ, నీటిపారుదలశాఖ, రెవెన్యూ, మూసీ నది అభివృద్ధి సంస్థ, తదితర శాఖలన్నీ బిల్డ్ నౌతో అనుసంధానమై ఉంటాయి.

# కాళేశ్వరం కథ కంచికేనా

**కరీంనగర్|ప్రజాబలం ప్రతినిధి: ఏప్రిల్ 26,** కాళేశ్వరం.. ఆసియాలోనే అతిపెద్ద లిఫ్ట్ ఇరిగేషన్‌గా గత కేసీఆర్ ప్రభుత్వం ప్రచారం చేసుకుంది. ఈ ప్రాజెక్టుతో కొత్తగా లక్ష ఎకరాలు సాగులోకి వచ్చినట్లు చెప్పుకుంది. కాళేశ్వరం నిర్మాణంతో తెలంగాణ సస్యశ్యామలమైందని కేసీఆర్‌తోపాటు, నాటి మంత్రులు ఊదరగొట్టారు. సుమారు రూ.లక్ష కోట్లతో నిర్మించిన ఈ ప్రాజెక్టు ప్రారంభించిన మూడేళ్లకే కుంగినోయింది. బుంగలు పడ్డాయి. 2023 అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్ఎస్ ఓటమికి కాళేశ్వరం కుంగుబాటు కూడా ఓ కారణం.కాళేశ్వరం ఎంతో గొప్పలు చెప్పిన గత ప్రభుత్వం హయాంలోనే కీలకమైన లక్ష్మీ బ్యారేజీ పిల్లర్లు కుంగిపోయాయి. అన్నారం బ్యారేజీ పిల్లర్ల వద్ద బుంగలు పడ్డాయి. నిర్మాణ లోపాలు బయటపడ్డాయి తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు తర్వాత మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ నేతృత్వంలో బీఆర్ఎస్ ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా చేపట్టిన కాళేశ్వరం ప్రాజెక్ట్, రాష్ట్ర రైతాంగానికి సాగునీరు అందించి రాజకీయంగా దీర్ఘకాల ప్రయోజనాలు అందిస్తుందని భావించింది. అయితే, 2023 ఎన్నికలకు ముందు మేడిగడ్డ బ్యారేజీలో పగుళ్లు బయటపడటంతో ఈ ప్రాజెక్ట్ బీఆర్ఎస్‌కు భారంగా మారింది. ఇప్పుడు, నేషనల్ డ్యామ్ సేఫ్టీ అథారిటీ సమర్పించిన నివేదిక మరో షాక్ ఇచ్చింది. మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బ్యారేజీలు పనికిరావని, వీటిని ఉపయోగిస్తే ఏ క్షణంలోనైనా కూలిపోయే ప్రమాదం ఉందని తేల్చింది.14 నెలల సుదీర్ఘ అధ్యయనం, పలు పరీక్షల తర్వాత ఔఆూం సమర్పించిన నివేదిక ప్రకారం, కాళేశ్వరం ప్రాజెక్ట్‌లోని మూడు బ్యారేజీల డిజైన్, నిర్మాణంలో తీవ్ర లోపాలు ఉన్నాయి. మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బ్యారేజీలలో సీకెంట్ పైల్స్ కూలిపోవడంతో పాటు, బ్యారేజీల ఎగువ, దిగువ భాగాల్లో రంధ్రాలు ఏర్పడినట్లు గుర్తించారు. ఈ బ్యారేజీలను యథావిధిగా ఉపయోగించకుండా, పూర్తిగా రీడిజైన్ చేసి నిర్మించాలని ఔఆూం స్పష్టం చేసింది. ఈ లోపాల కారణంగా బ్యారేజీలు శాశ్వత నష్టానికి గురయ్యే అవకాశం ఉందని హెచ్చరించింది.నివేదికలో మరో కీలక అంశం బయటపడింది. బ్యారేజీల నిర్మాణానికి ముందు అవసరమైన భూసార పరీక్షలు నిర్వహించలేదు. అన్నారం, సుందిళ్ల బ్యారేజీలను సిఫారసు చేసిన స్థలాలకు బదులు, ఇతర ప్రాంతాలకు మార్చడం జరిగింది, ఇది నిర్మాణ స్థిరత్వాన్ని దెబ్బతీసింది. అంతేకాదు, జాతీయ ఆనకట్టల భద్రత చట్టం?2021 ప్రకారం, వర్షాకాలానికి ముందు బ్యారేజీల భద్రతా తనిఖీలు చేయాల్సిన నిబంధనను కూడా పాటించలేదని నివేదిక వెల్లడించింది.కాళేశ్వరం ప్రాజెక్ట్ నిర్మాణంలో అవకతవకలపై విచారణ జరుపుతున్న జస్టిస్ ఘోష్ కమిషన్‌కు ఔఆూం నివేదిక కీలక ఆధారంగా మారనుంది. ఈ నివేదిక బీఆర్ఎస్ ప్రభుత్వంలో కీలక నిర్ణయాలు తీసుకున్న మాజీ మంత్రులు హరీశ్‌రావు, కేసీఆర్‌లను ప్రశ్నల వరుసకు గురిచేసే అవకాశం ఉంది. రాజకీయంగా, ఈ నివేదిక బీఆర్ఎస్‌కు పెద్ద ఎదురుదెబ్బగా మారి, ప్రతిపక్ష పార్టీలకు రాజకీయ ఆయుధంగా మారవచ్చు. కాంగ్రెస్ ప్రభుత్వం ఈ లోపాలను హైలైట్ చేస్తూ బీఆర్ఎస్‌ను లక్ష్యంగా చేసుకునే అవకాశం ఉంది.ప్రాజెక్ట్ రైతులకు సాగునీరు అందించడంలో కీలక పాత్ర పోషించాలని భావించారు, కానీ ఈ బ్యారేజీలు పనికిరాకపోవడం రైతాంగానికి నష్టం కలిగిస్తుంది. ప్రభుత్వం ఇప్పుడు బ్యారేజీల రీడిజైన్, పునర్నిర్మాణంపై దృష్టి సారించాల్సి ఉంది. ఇది భారీ

# ఎరుపెక్కుతున్న కర్రెగుట్టలు

**వరంగల్, ప్రజాబలం ప్రతినిధి:ఏప్రిల్ 26,** నక్సల్స్ వ్యతిరేక ఆపరేషన్‌కు భద్రతా బలగాలు శ్రీకారం చుట్టాయి. దీంతో తెలంగాణ– ఛత్తీస్‌గఢ్ సరిహద్దు కర్రెగుట్టలు ఎరుపెక్కుతున్నాయి. ఛత్తీస్‌గడ్ రాష్ట్రం బీజాపూర్ జిల్లా.. తెలంగాణ రాష్ట్రం ములుగు జిల్లాల్లో విస్తరించి ఉన్న అడవుల్లోకి సాయుధ బలగాలు దూసుకెళ్తున్నాయి. తారసపడుతున్న మావోయిస్టులపై విరుచుకుపడుతున్నాయి. దీనికి సంబంధించిన ముఖ్యమైన అంశాలు ఇలా ఉన్నాయి.కర్రెగుట్టల్లో భద్రతా బలగాలు దాదాపు 100 పైగా ఐఈడీలను నిర్వీర్యం చేసినట్లు తెలుస్తోంది. కర్రెగుట్టలను జల్లెడ పడుతున్న బలగాలకు అత్యవసర సామగ్రి, ఆహార పదార్థాలను వెంకటాపురం నుంచి హెలికాప్టర్ల ద్వారా సరఫరా చేస్తున్నారు.నడిపల్లి, పూజారికాంకేర్, నంబిలో ప్రధానంగా కాల్పులు జరుగుతున్నాయి. ఊసూరు, రాంపురం, భీమంరంపాడు, కస్తూరిపాడు, చినవుట్లపల్లి, పెదవుట్లపల్లి, గుంజపర్తి, గల్గం, ఎలిమిడి, చెలిమెల, డోలీ, పామునూరు తదితర గ్రామాల్లో ఐఈడీ శబ్దాలు, కాల్పుల మోతతో అక్కడి జనం వణికిపోతున్నారు.ఎండ తీవ్రతకు భద్రతా బలగాలు వడదెబ్బ బారినపడుతున్నాయి. కూంబింగ్‌లో అస్వస్థతకు గురైన సుమారు 15 మందిని వెంకటాపురం చేర్చారు. మావోయిస్టు పార్టీ మిలిటరీ విభాగం పీఎల్‌జీఏ లక్ష్యంగానే పోలీసు బలగాలు బచావో కర్రెగుట్టలు ఆపరేషన్ నిర్వహిస్తున్నాయి..తెలంగాణలోని ములుగు జిల్లా వాజేడు, వెంకటాపురం మండలాలతోపాటు ఛత్తీస్‌గఢ్ వైపు బీజాపూర్ జిల్లా ఊసూరు బ్లాక్ సరిహద్దులుగా సుమారు 90 కిలోమీటర్ల పొడవున ఈ కొండలు విస్తరించి ఉన్నాయి. సముద్ర మట్టానికి సుమారు 9 వేల అడుగుల ఎత్తులో ఉన్నాయి..దాదాపు 10 నుంచి 15 కిలోమీటర్ల మేర విస్తీర్ణం ఉండటంతో.. కొన్నేళ్లుగా మావోయిస్టులు స్థావరంగా మార్చుకున్నారు. దాదాపు వెయ్యి మంది పీఎల్‌జీఏ సభ్యులు ఇక్కడే ఉన్నట్లు నిఘావర్గాల అనుమానిస్తున్నాయి.కేంద్ర కమిటీ అగ్రనాయకులు హిడ్మా, దేవ, వికాస్, దామోదర్ వంటి వారు ఈ గుట్టల్లోనే ఉన్నట్లు భద్రతా బలగాలు భావిస్తున్నాయి. దీంతో సుమారు 3 వేల మంది బలగాలు ఈ ఆపరేషన్‌లో నిమగ్నమైనట్లు సమాచారంకొందరు గుట్టల్లో కూంబింగ్ నిర్వహిస్తున్నారు. మరికొందరు ఊసూరు బ్లాక్‌తోపాటు ఇటు వాజేడు, వెంకటాపురం వైపు మకాం వేసినట్లు తెలుస్తోంది. అటువైపు ఛత్తీస్‌గఢ్ ప్రాంతంలో వేల సంఖ్యలో బలగాలు తిష్ఠ వేసి ఉన్న నేపథ్యంలో.. మావోయిస్టులు తెలంగాణ వైపు గుట్టలు దిగక తప్పదన్న అంచనాతో మాటు వేసినట్లు తెలుస్తోంది.మావోయిస్టు పార్టీలో పీఎల్‌జీఏనే మిలిటరీ ఆపరేషన్లు నిర్వహిస్తోంది. 1999 డిసెంబరు 2న ఉమ్మడి కరీంనగర్ జిల్లా మల్హర్ మండలం కొయ్యూరు ఎన్‌కౌంటర్‌లో పీపుల్స్‌వార్ కేంద్ర కమిటీ సభ్యులు నల్లా ఆదిరెడ్డి, ఎర్రంరెడ్డి సంతోష్‌రెడ్డి, శీలం నరేశ్ మృతిచెందారు. ఆ తరువాత పీపుల్స్ లిబరేషన్ ఆర్మీ(పీజీఏ) ఏర్పాటైంది.సీపీఐ–పీపుల్స్‌వార్‌తో మావోయిస్టు కమ్యూనిస్ట్ సెంటర్ ఆఫ్ ఇండియా2004 సెప్టెంబరు 21న విలీనమై.. సీపీఐ–మావోయిస్టుగా అవతరించింది. ఈ క్రమంలో మిలిటరీ విభాగం పీఎల్‌జీఏగా అవతరించింది..పార్టీలోని సెంట్రల్ మిలిటరీ కమిషన్(సీఎంసీ)కి కోరుట్లకు చెందిన దేవ్‌జీ నేతృత్వం వహిస్తున్నారు. కానీ.. మోస్ట్ వాంటెడ్ హిడ్మా ఆధ్వర్యంలోని మొదటి ప్లటూన్ కీలకంగా ఉంది. దీన్ని నిర్మూలించగలిగితే మావోయిస్టు సీఎంసీ బలహీనపడుతుందని నిఘావర్గాలు నమ్ముతున్నాయి. ఈ నేపథ్యంలోనే కర్రెగుట్టల్లో హిడ్మా బృందం కోసం ముమ్మరంగా వేట కొనసాగిస్తున్నాయి.

## కాలువలోకి దూసుకెళ్లిన శ్రీ సిటీ కంపెనీ బస్సు

నాగలాపురం(మ) వేమ్బాకం పంచాయతీ హెచ్ఎసీ కాలనీ సమీపంలో శనివారం రోడ్డు ప్రమాదం జరిగింది. శ్రీసిటీలోని ఓ కంపెనీ బస్సు రోడ్డు పక్కన ఉన్న కాలువలోకి దూసుకెళ్లింది. వాహనంలో 30 మంది ఉండగా 10 మందికి స్వల్ప గాయాలైనట్లు పోలీసులు తెలిపారు. డ్రైవర్ అరవింద్ అతివేగమే ప్రమాదానికి ఎస్ఐ సునీల్ తెలిపారు. క్షతగాత్రులను 108 వాహనంలో ఆస్పత్రికి తరలించారు.

# రాహుల్ గాంధీ హైదరాబాద్ రాకను ఎద్దేవా చేసిన ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత



**ప్రజాబలం ప్రతినిధి:** బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కవిత కాంగ్రెస్ పార్టీ అగ్రనేత రాహుల్ గాంధీని ఎద్దేవా చేసారు. ఎక్స్ వేదికగా రాహుల్ గాంధీకి ప్రశ్నల వర్షం కురిపించారు. దారితప్పి తెలంగాణకు వస్తున్న ఎన్నికల గాంధీకి స్వాగతం.." అంటూ ఎద్దేవా చేసారు. మోసపూరిత హామీలు, అబద్ధపు వాగ్దానాలతో తెలంగాణ ప్రజలను రాహుల్ గాంధీ మోసగించారని ఎమ్మెల్సీ కవిత ఆగ్రహం వ్యక్తం చేసారు. హైదరాబాద్ పర్యటనలో లాఠీ దెబ్బలు తిన్న సెంట్రల్ యూనివర్సిటీ విద్యార్థులను రాహుల్ గాంధీ పరామర్శించాలి. కాంగ్రెస్ ప్రభుత్వం 16 నెలల పాలనలో ప్రజలను రాచిరంపాన పెట్టింది. హైడ్రా, మూసీ పేరుతో ప్రజల మీదికి బుల్డోజర్లు పంపింది. లగచర్ల బంజారా ఆడబిడ్డలపై అర్ధరాత్రి వేళ అఘాయిత్యాలకు ఒడిగట్టింది. సర్కారు దుశ్చర్యకు అడ్డంకిగా ఉన్నారని బంజారా యువతపై థర్డ్ డిగ్రీ ప్రయోగించింది. రేవంత్ రెడ్డి ప్రభుత్వం సాగించిన ఈ రాక్షసకాండను జాతీయ మానవ హక్కుల కమిషన్ నిర్ధారించింది. కరెంట్ పోయిందని సోషల్ మీడియాలో పోస్ట్ పెడితే అరెస్టులు.. వేధింపులు.. బెదిరింపులని అన్నారు.

పచ్చని అడవిని సర్వనాశనం చేస్తున్నారని సెంట్రల్ యూనివర్సిటీ విద్యార్థులు నిరసనకు దిగితే వారిపై లాఠీల మోతలు.. అక్రమ కేసులు పెట్టారు. తెలంగాణ ప్రజలు సోనియాగాంధీని, ప్రియాంకా గాంధీని, రాహుల్ గాంధీని నమ్మి అధికారమిస్తే ఉమ్మడి రాష్ట్రంలో కన్నా తీవ్ర నిర్బంధం, అణచివేతను బహుమతిగా ఇచ్చారు. బిహార్ లో గ్రూప్ –1 బాధితుల గోడు వినాలని వారి పక్షాన గళమెత్తిన మీరు.. తెలంగాణలో గ్రూప్ –1 అభ్యర్థుల ఆందోళనలపై ఎందుకు మౌనంగా ఉన్నారు? రాహుల్ గాంధీ, సోనియా గాంధీ గారు ఇచ్చిన ఆరు గ్యారంటీల పరిస్థితి ఏమిటి ? రైతులకు రూ.2 లక్షల రుణమాఫీ చేస్తామని ఇచ్చిన హామీని సగానికే పరిమితం చేశారు. దేశానికి ఆదర్శంగా నిలిచిన రైతుబంధు పథకానికి తూట్లు పొడిచి ఆ పథకాన్ని నిర్వీర్యం చేశారు.. అయినా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని నిలదీయరెందుకు? కళ్యాణ లక్ష్మితో పాటు తులం బంగారం ఏమైంది? మహిళలకు నెలకు రూ.2500 ఏమయ్యాయి? 18 ఏళ్లు నిండిన ఆడపిల్లలకు స్కూటీలు ఎప్పుడు ఇస్తారు ? ఆరు గ్యారంటీలు, 420 హామీలను ఎప్పుడు అమలు చేస్తారు? ఎర్ర బుక్కు పట్టుకుని రాజ్యాంగాన్ని రక్షించాలంటూ దేశమంతా తిరిగే రాహుల్ గాంధీ తెలంగాణలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మానవ హక్కులను మంటకలుపుతూ.. దమనకాండ కొనసాగిస్తూ.. ప్రజాస్వామ్యాన్ని అపహస్యం చేస్తుంటే ఎందుకు మౌనంగా ఉన్నారు.. ? మీ మౌనం దేనికి సంకేతమని ప్రశ్నించారు.

# జవహర్ లాల్ స్టేడియం లో 'మాబ్ ఆపరేషన్' మాక్ డ్రిల్ ప్రాక్టీస్

## శాంతిభద్రతలను పరిరక్షించటమే మాబ్ ఆపరేషన్ డ్రిల్ ముఖ్య లక్ష్యం పెద్దపల్లి డీసీపీ కరుణాకర్







గోదావరిఖని: అక్రమంగా గుమ్మిగుడిన జన సమూహాలను కంట్రోల్ చేయుటకు, అవాంఛనీయ సంఘటనలు పోలీసుల దృష్టికి వచ్చినప్పుడు, (144) 163(బి ఎన్ ఎస్ ఎస్) సెక్షన్ అమల్లో ఉన్న సందర్భంలో ప్రజల శాంతి భద్రతల నేపథ్యంలో పోలీసులు ఏ విధంగా స్పందించాలి, అక్రమ జన సమూహాలను ఏ విధంగా చెదరగొట్టాలి అనే వ్యూహంలో భాగంగా రామగుండము పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా ఆదేశాల మేరకు రామగుండము గోదావరిఖని లోని జవహర్లాల్ నెహ్రూ స్టేడియం గ్రౌండ్ లో గోదావరిఖని ఏసీపీ ఎం. రమేష్ ఆధ్వర్యంలో గోదావరిఖని సబ్ డివిజన్ గోదావరిఖని 1 టౌన్, రామగుండంసర్కిల్ సివిల్ పోలీసులకు మాబ్ ఆపరేషన్-మాక్ డ్రిల్ ప్రాక్టీస్ నిర్వహించారు. ఈ కార్యక్రమం కు పెద్దపల్లి డిసిపి కరుణాకర్ ముఖ్యఅతిథిగా హాజరై సిబ్బంది తో మాట్లాడారు.

ఈ సందర్భంగా డీసీపీ మాట్లాడుతూ....ప్రజల, ప్రభుత్వ ఆస్తులు ధ్వంసం చేస్తూ విధ్వంసానికి పాల్పడుతున్న సందర్భాల్లో సమయస్ఫూర్తితో వ్యవహరిస్తూ, జన సమూహాలను నియంత్రించి శాంతిభద్రతలను ఎలా నియంత్రించాలన్న వాటిపై మాబ్ ఆపరేషన్ మాక్ డ్రిల్ ప్రాక్టీస్ ముఖ్య ఉద్దేశాన్ని సిబ్బందికి డీసీపీ గారు వివరించారు. మాబ్ ఆపరేషన్ మాక్ డ్రిల్ ముఖ్య ఉద్దేశం శాంతి భద్రతలకు విఘాతం కలిగినప్పుడు, ఘర్షణలు తలెత్తినప్పుడు శాంతిభద్రతలను పరిరక్షించడానికి పోలీస్ శాఖ ఎలా వ్యవహరిస్తుంది? ఘర్షణలకు పాల్పడిన వారిపై ఏవిధంగా చర్యలు తీసుకుంటారు? అనే దాని గురించి అవగాహన కల్పించేందుకు మాక్ డ్రిల్ నిర్వహించినట్లు డీసీపీ చెప్పారు.

మాబ్ ఆపరేషన్ డ్రిల్ లో ఓ వైపు ప్లకార్డులు చేతపట్టిన ఆందోళనకారులు, అల్లరి మూకలు మరోవైపు వారిని ఎదుర్కొనేందుకు సిద్ధమైన పోలీసులు జన సమూహాలను కంట్రోల్ చేసేందుకు మొదటగా హెచ్చరికలు వినకపోతే మెజిస్ట్రేట్ అనుమతి, ఉన్నతాధికారుల అనుమతితో భాష్పవాయువు ప్రయోగించడం, ఆ తర్వాత ఫైర్ డిపార్ట్మెంట్ వారితో వాటర్ కెనాన్ వారిపై ప్రయోగించడం, ఉద్రిక్త పరిస్థితుల్లో తనను తాను రక్షించుకుంటూ లాఠీ ఛార్జీ చేపట్టడం, ప్లాస్టిక్ పెల్లెట్స్ ఫైరింగ్ చేయడం అప్పటికీ పరిస్థితి అదుపులోకి రాకపోతే ఫైరింగ్ చేయడం వంటివి ఆర్ ఎస్ఐ శివ కుమార్, హెడ్ కానిస్టేబుల్ రఫీ లు సివిల్ సిబ్బందితో ప్రాక్టిస్ చేపించడం జరిగింది.

ఈ కార్యక్రమం లో గోదావరిఖని ఏసీపీ ఎం. రమేష్, గోదావరిఖని 1 టౌన్ ఇన్స్పెక్టర్ ఇంద్ర సేనా రెడ్డి, రవీందర్ రామగుండం సీఐ ప్రవీణ్ కుమార్, ట్రాఫిక్ ఇన్స్పెక్టర్ రాజేశ్వర్ రావు, గోదావరిఖని సబ్ గోదావరిఖని ఎస్ఐ రమేష్, భూమేష్, ఎన్టీపీసీ ఎస్ఐ ఉదయ్ కిరణ్, మానస, రామగుండం ఎస్ఐ సంధ్య రాణి, అంతర్గం ఎస్ఐ వెంకట్, ఆర్ఎస్ఐ శివ కుమార్, సివిల్ సిబ్బంది పాల్గొన్నారు.

## ఆర్టీసీ బస్సును నడిపించాలని ప్రభుత్వ విప్ కు వినతి

## లాంఛనంగా ఆర్టీసీ బస్సును ప్రారంభించనున్న అడ్లూరి



పెగడపల్లి జగిత్యాల జిల్లా పెగడపల్లి మండలంలోని రాములపల్లి, నంచర్ల, దేవికొండ, వెంగళాయి పేట గ్రామాల నుండి పెగడపల్లి మోడల్ స్కూల్ వరకు సోమవారం నుండి ఆర్టీసీ బస్సును నడపనున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం మహిళా సంఘాలకు కేటాయించిన ఆర్టీసీ బస్సును నంచర్ల ఎక్స్ రోడ్ కమాన్ వద్ద ప్రభుత్వ విప్, ధర్మపురి ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్ కుమార్ ఆర్టీసీ బస్సును లాంఛనంగా ప్రారంభించి, నంచర్ల వరకు ప్రయాణించనున్నారని ఏఎంసీ చైర్మన్ బుర్ర రాములు గౌడ్ తెలిపారు. గత కొన్ని సంవత్సరాల నుండి ఈ గ్రామాలకు ఆర్టిసి బస్సు సౌకర్యం లేకపోవడంతో ప్రజలు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ గ్రామాలకు బస్సు సౌకర్యం కల్పించి సమస్యను పరిష్కరించాలని మండల కాంగ్రెస్ పార్టీ నాయకులను ఆయా గ్రామాల ప్రజలు కోరగా కాంగ్రెస్ పార్టీ నాయకులతో కలిసి పెగడపల్లి ఏఎంసి చైర్మన్ బుర్ర రాములు గౌడ్ ధర్మపురి శాసనసభ్యులు, ప్రభుత్వ విప్ లక్ష్మణ్ కుమార్ ను జగిత్యాల కలెక్టర్ కార్యాలయంలో కలిసి జగిత్యాల నుండి గొల్లపల్లి మీదుగా రాములపల్లి, నంచర్ల, దేవికొండ, వెంగళాయి పేట గ్రామాల నుండి పెగడపల్లి మోడల్ స్కూలు వరకు ఆర్టీసీ బస్సును నడిపించాలని వినతి పత్రం అందజేసి కోరగా, వెంటనే స్పందించిన ప్రభుత్వ విప్ లక్ష్మణ్ కుమార్ టీజీఎస్ఆర్టిసి జగిత్యాల డిపో మేనేజర్ కు ఫోన్ లో మాట్లాడి లెటర్ ఎండార్స్ చేసి ఆర్టీసీ బస్సు సౌకర్యం కల్పించాలని ఆదేశించారు. సోమవారం నుండి ఉదయం 9:30 కి సాయంత్రం 5:30 కి ఆర్టీసీ బస్సును నడిపిస్తామని జగిత్యాల డిపో మేనేజర్ తెలిపారు. ప్రభుత్వ విప్ అడ్లూరి ఎండార్స్ చేసిన వినతి పత్రాన్ని మండల కాంగ్రెస్ నాయకులతో కలిసి ఏఎంసీ చైర్మన్ బుర్ర రాములు గౌడ్ జగిత్యాల డిపో మేనేజర్ కు వినతి పత్రాన్ని అందజేశారు.

టీజీఎస్ఆర్టిసి జగిత్యాల డిపో మేనేజర్ కు బస్సును నడిపించాలని ఆదేశించి, బస్సు సౌకర్యం కల్పిస్తున్న ధర్మపురి శాసనసభ్యులు ప్రభుత్వ విప్ లక్ష్మణ్ కుమార్ కు దేవికొండ, నంచర్ల, రాములపల్లి, వెంగళాయి పేట, పెగడపల్లి గ్రామాల ప్రజల పక్షాన పెగడపల్లి మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు ఈ సందర్భంగా కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పెగడపల్లి వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ బుర్ర రాములు గౌడ్, కాంగ్రెస్ పార్టీ జిల్లా ఉపాధ్యక్షులు ఒరుగల శ్రీనివాస్, మండల ఉపాధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు సంధి మల్లారెడ్డి, చాట్ల విజయభాస్కర్, మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు కడారి తిరుపతి, పూసాల తిరుపతి, ఏఎంసి డైరెక్టర్లు చెట్ల కిషన్, లింగంపల్లి మహేష్, తదితర నాయకులు పాల్గొన్నారు.

## ఎమ్మెల్యే చే గంగజాతర పోస్టర్ ఆవిష్కరణ



రుపతిః తాతయ్యగుంట గంగజాతర వాల్ పోస్టర్ ను ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు శనివారం ఉదయం ఆవిష్కరించారు. మే 6వ తేది చాటింపుతో జాతర ప్రారంభమై మే 13వ తేది వరకు జరుగుతాయని ఆయన చెప్పారు. మే 14 తేది తెల్లవారుజామున అమ్మవారి విశ్వరూప దర్శనంతో జాతర ముగుస్తుందని ఆయన తెలిపారు. మే 10వ తేది అమ్మవారికి శేషవస్త్రాలు సమర్పించనున్నట్లు ఆయన వివరించారు. గత ఏడాది ఎన్నికల కారణంగా అధికారుల పర్యవేక్షణలో జాతర జరిగిందని ఆయన చెప్పారు. ఎన్డీఏ కూటమి ప్రభుత్వం ఏర్పాటైయ్యాక జరుగుతున్న మొదటి జాతరను వైభవంగా నిర్వహిస్తామని ఆయన తెలిపారు. రాయలసీమలో అతి పెద్దదైన తాతయ్యగుంట గంగ జాతరను సంప్రదాయబద్దంగా నిర్వహించనున్నట్లు ఆయన చెప్పారు. రోజుకో వేషంతో అమ్మవారిని భక్తులు కొలుచుకోవడం ఆనవాయితీ అని ఆయన తెలిపారు. దీనికి అనుగుణంగా సామాన్యభక్తులకు అమ్మవారి దర్శనం శీఘ్రగతిన అయ్యేలా చర్యలు తీసుకున్నట్లు ఆయన చెప్పారు. ఈ కార్యక్రమంలో యాదవ కార్పోరేషన్ ఛైర్మన్ నరసింహ యాదవ్, నాయి బ్రాహ్మణ కార్పోరేషన్ ఛైర్మన్ రుద్రకోటి సదాశివం, ఈఓ జయకుమార్, డిప్యూటీ మేయర్ ఆర్సీ మునికృష్ణ, మాజీ ఎమ్మెల్యే సుగుణమ్మ, మబ్బు దేవనారాయణ రెడ్డి, బిజేపి నాయకులు అజయ్, జనసేన నాయకులు రాజారెడ్డి, పులుగోరు మురళీ, బుల్లెట్ రమణ, శ్రీధర్ వర్మ, ఆముదాల తులసి, పుష్పావతి తదితరులు పాల్గొన్నారు.

## నేను భారత్‌కు కోడలిని.. నన్ను ఇక్కడే ఉండనివ్వండి..

## పీఎం మోదీ, సీఎం యోగిలకు సీమా హైదర్ రిక్వెస్ట్..!

న్యూ డిల్లీ ఏప్రిల్ 26;భారత్‌లో ఉండేందుకు తనకు అనుమతి ఇవ్వాలని ప్రధాని నరేంద్ర మోదీ, ఉత్తరప్రదేశ్ సీఎం యోగి ఆదిత్యనాథ్‌కు సీమా హైదర్ విజ్ఞప్తి చేశారు. తాను ఖచ్చితంగా పాక్ కూతురినే అయినప్పటికీ.. ప్రస్తుతం భారత్‌కు కోడలినని.. ఈ క్రమంలో భారత్‌లో ఉండనివ్వాలని కోరారు. ఇందుకు సంబంధించిన వీడియో సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నది. ఇటీవల పహల్గాంలో ఉగ్రవాదుల దాడిలో 26 మంది పర్యాటకులు ప్రాణాలు కోల్పోయిన విషయం తెలిసిందే. ఆ తర్వాత భారత ప్రభుత్వం పాకిస్తాన్ విషయంలో కఠిన చర్యలు తీసుకుంది.సార్క్ వీసాలను రద్దు చేస్తున్నట్లు ప్రకటించింది. ఇప్పటికే భారత్‌కు వచ్చిన వారంతా వారంలోగా దేశం విడిచి వెళ్లిపోవాలని ఆదేశించింది. ఆ తర్వాత సీమా హైదర్‌ను పాక్‌కు పంపాలనే డిమాండ్ మొదలైంది. వైరల్ అవుతున్న వీడియోలో సీమా హైదర్ మాట్లాడుతూ.. 'నేను పాక్‌కు వెళ్లాలనుకోవడం లేదు. ఇప్పుడు వారి ఆశ్రయంలో ఉన్నానని మోదీ జీ, యోగి జీకి విజ్ఞప్తి చేస్తున్నాను. నేను పాకిస్తాన్ కూతురిని, కానీ ఇప్పుడు నేను భారత్ కోడలిని. నన్ను ఇక్కడే ఉండనివ్వండి' అని పేర్కొంది. సచిన్ మీనాను వివాహం చేసుకున్న తర్వాత తాను హిందూ మతాన్ని స్వీకరించానని హైదర్ తెలిపింది. గ్రేటర్ నొయిడా నివాస సచిన్ మీనాతో ఆన్‌లైన్ పబ్‌జీ గేమ్ ద్వారా కనెక్ట్ అయ్యింది.ఆ తర్వాత ఇద్దరి మధ్య ప్రేమ చిగురించింది. ఆ తర్వాత నలుగురు పిల్లలతో కలిసి నేపాల్ ద్వారా భారత్‌కు చేరుకుంది. సచిన్‌తో కలిసి నోయిడాలో నివిస్తుంది. ఇటీవల ఈ జంటకు ఓ కూతురు సైతం జన్మించింది. దేశవ్యాప్తంగా నిరసనలు వ్యక్తమవుతున్నప్పటికీ సీమా హైదర్ న్యాయవాది ఏపీ సింగ్ మాత్రం ఆమెను భారత్‌లో ఉండేందుకు అనుమతిస్తారని ఆశాభావం వ్యక్తం చేశారు. ఆమె ఇకపై పాకిస్తాన్ పౌరురాలు కాదన్నారు. సచిన్ మీనాను వివాహం చేసుకుందని.. ఇద్దరికి కుమార్తె సైతం జన్మించిందని తెలిపారు. ఆమె పౌరసత్వం భారత్‌కు చెందిన భర్తతో ముడిపడి ఉందన్నారు. పహల్గాం దాడి ఘటనపై సీమా విచారం వ్యక్తం చేసిందని పేర్కొన్నారు.

## పెహల్‌గామ్ ఉగ్రదాడి ఘటనపై ఉగ్రసంస్థ

## 'ది రెసిస్టెన్స్ ఫ్రంట్' సంచలన ప్రకటన

### పెహల్‌గామ్‌లో పర్యాటకులపై దాడి తమ పని కాదు ..

న్యూ డిల్లీ ఏప్రిల్ 26 పెహల్‌గామ్ ఉగ్రదాడి ఘటనపై ఉగ్రసంస్థ 'ది రెసిస్టెన్స్ ఫ్రంట్' సంచలన ప్రకటన చేసింది. మొదట ఈ దాడి తమ పనే అని ప్రకటించుకున్న ఆర్‌టీఎఫ్ .. ఇప్పుడు మాట మార్చింది. పెహల్‌గామ్‌లో పర్యాటకులపై దాడి తమ పని కాదని తెలిపింది. ఈ మేరకు సంచలన ప్రకటన విడుదల చేసింది. ఈ సందర్భంగా భారత్‌పై తీవ్ర ఆరోపణలు చేసింది.తమ వ్యవస్థలి భారత్ హ్యాక్ చేసినట్లు ప్రకటనలో ఆరోపించింది. 'పెహల్‌గామ్ ఘటనలో మా ప్రమేయం లేదు. ఈ చర్యను టీఆర్ఎఫ్‌కు ఆపాదించడం తొందరపాటు చర్యే అవుతుంది. ఇంతకు ముందు వచ్చిన ప్రకటనతో కూడా మాకు సంబంధం లేదు. భారత్ మా వ్యవస్థల్ని హ్యాక్ చేసి ఆ మెసేజ్ పోస్ట్ చేసింది. ఇది భారత సైబర్-ఇంటెలిజెన్స్ ఆపరేటివ్‌ల పని. దీనిపై మేము పూర్తి దర్యాప్తు చేస్తున్నాం. రాజకీయ ప్రయోజనాల కోసం భారత్ ఇలా చేయడం ఇదేమీ తొలిసారి కాదు' అంటూ ఆరోపించింది.మంగళవారం మధ్యాహ్నం జమ్ము కశ్మీర్‌లోని పెహల్‌గామ్‌లో మినీ స్విట్జర్లాండ్‌గా పేరొందిన బైసరాన్‌లో ఉగ్రవాదులు నరమేధం సృష్టించిన విషయం తెలిసిందే. అడవిలో నుంచి వచ్చిన ఉగ్రమూక పర్యాటకులే లక్ష్యంగా విచక్షణా రహితంగా కాల్పులకు తెగబడింది. ఈ దాడిలో 26 మంది అమాయకులు ప్రాణాలు కోల్పోయారు. ఈ దాడి తమ పనే అని పాకిస్థాన్ కేంద్రంగా పనిచేసే నిషేధిత ఉగ్రసంస్థ లష్కరే తోయిబా అనుబంధ సంస్థ అయిన ది రెసిస్టెన్స్ ఫ్రంట్ ప్రకటించింది. ఇప్పుడు మాత్రం మాట మారుస్తూ.. భారత్‌పై ఆరోపణలు చేయడం గమనార్హం.

## మత్స్యకారులు రియల్ హీరోలు

### :- గంగపుత్రులకు ఎన్డియే ప్రభుత్వం అండగా ఉంటుంది

### హోం శాఖ మంత్రి వంగలపూడి అనిత

### మత్స్యకారులకు వేట నిషేధ భృతి రూ 25.88 కోట్ల చెక్కును అందజేసిన

### చేసిన హోం మంత్రి అనిత

నక్కపల్లి,ఏప్రిల్ 26: మత్స్యకారులు రియల్ హీరోలని, గంగపుత్రులకు ఎన్డియే ప్రభుత్వం అండగా ఉంటుందని రాష్ట్ర హోం శాఖ మంత్రి వంగలపూడి అనిత అన్నారు. శనివారం నక్కపల్లి స్థానిక ఎంపీడీఓ కార్యాలయం ఆవరణంలో జిల్లా మత్స్యశాఖ ఆధ్వర్యంలో జరిగిన మత్స్యకారుల సేవలో కార్యక్రమంలో హోం మంత్రి వంగలపూడి అనిత, జిల్లా కలెక్టర్ విజయకృష్ణన్ పాల్గొన్నారు.ఈ సందర్భంగా హోం మంత్రి మాట్లాడుతూ ఎన్నికల సమయంలో మత్స్యకారులకు ఇచ్చిన హామీని నిలబెట్టుకున్నామని చెప్పారు. మత్స్యకారులకు ఎప్పుడు అండగా ఉంటాం, అని హామీ ఇచ్చారు.2004లో వేట నిషేధ భృతి కింద 30 కేజీల బియ్యం మాత్రమే ఇచ్చేవారని, 2014లో టీడీపీ ప్రభుత్వం భృతిని రూ.4,000కి పెంచినదని ఆమె గుర్తు చేశారు. ఇప్పుడు నిషేధ భృతి 10 వేల నుంచి 20,000, వేలకు పెంచిన ఘనత ముఖ్య మంత్రి చంద్రబాబు నాయుడు దక్కుతుందని ఆమె తెలిపారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పాలనలో మత్స్యకారుల అభివృద్ధి కోసం ఫించన్, తుఫాను రక్షిత భవనాలు, కమ్యూనిటీ హాల్స్, చేపల ఎండబెట్టే ఫ్లాట్ ఫాంలు, సబ్సిడీ ఇంధనం, వలలు, పడవలు వంటి పథకాలు అందించామన్నారు.అలాగే మత్స్యకారులకు 50 సంవత్సరాలకే ఫించన్ ఇస్తున్నామని ఆమె పేర్కొన్నారు. గత ప్రభుత్వంలో మత్స్యకారులకు అన్యాయం జరిగిందని విమర్శించారు. మత్స్యకార మహిళల కోసం అడ్డురోడ్డులో షెడ్ నిర్మాణం, మత్స్యకార పిల్లల కోసం త్వరలో జిల్లా కేంద్రంలో ఒక బి సి రెసిడెన్షియల్ ఇన్స్టిట్యూట్ ఏర్పాటు చేస్తామని హోం మంత్రి అనిత తెలిపారు.మత్స్యకారుల వేట నిషేధ భృతి 25,288 కోట్ల రూపాయల చెక్కును లబ్ధిదారులకు హోం మంత్రి అనిత, జిల్లా కలెక్టర్ విజయ క్రిష్ణన్ అందజేశారు



## జిల్లాలో 1 వేయి 493 మంది రైతుల ఖాతాలలో 35 లక్షల రూపాయలు జమ

### జిల్లా అదనపు కలెక్టర్ సబావత్ మోతిలాల్

**ప్రజాబలం మంచిర్యాల జిల్లా ప్రతినిధి ఏప్రిల్ 26 :** ప్రభుత్వ ఆదేశాల మేరకు జిల్లాలో కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి రైతుల వద్ద నుండి నాణ్యమైన వరిధాన్యం కొనుగోలు చేయడం జరుగుతుందని, ఇప్పటి వరకు 1 వేయి 493 మంది రైతుల వద్ద నుండి 12 వేల 74 మెట్రిక్ టన్నుల వరిధాన్యం కొనుగోలు చేసి సంబంధిత రైతుల ఖాతాలలో 35 లక్షల రూపాయలు జమ చేయడం జరిగిందని జిల్లా అదనపు కలెక్టర్ సబావత్ మోతిలాల్ ఒక ప్రకటనలో తెలిపారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం నాణ్యమైన వరిధాన్యంను రైతులు కొనుగోలు కేంద్రాలకు తీసుకువచ్చి కనీస మద్దతు ధర పొందాలని,సన్నరకం వడ్లకు మద్దతు ధరతో పాటు 500 రూపాయలు అదనపు బోనస్ ఇవ్వడం జరుగుతుందని తెలిపారు. రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు.

# నిర్దేశిత సమయంలో టి.జి.ఐ.పాస్ అనుమతులు జారీ చేయాలి::జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝ

### జిల్లా పరిశ్రమల ప్రమోషన్ కమిటీ/ జిల్లా స్థాయి మానిటరింగ్ కమిటీ సమావేశాన్ని నిర్వహించిన జిల్లా కలెక్టర్



**రాజన్న సిరిసిల్ల జిల్లా, ఏప్రిల్ -26 (ప్రజాబలం ప్రతినిధి)**జిల్లాలో త్వరగా పరిశ్రమలు స్థాపించి యువతకు ఉపాధి కల్పించేందుకు టిజిఐపాస్ కింద వచ్చిన దరఖాస్తులను నిర్దేశిత సమయంలో జారీ చేయాలని జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝ సంభందిత అధికారులను ఆదేశించారు.శనివారం సమీకృత జిల్లా కలెక్టరేట్ కార్యాలయంలోని తన ఛాంబర్ లో జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝ జిల్లా పరిశ్రమల ప్రోత్సాహక కమిటీ సమావేశం నిర్వహించి పరిశ్రమల స్థాపన, టి.ఎస్.ఐ పాస్, టి - ప్రైడ్ పై సంభందిత అధికారులతో సమీక్షించారు.జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, జిల్లాలో టీజి ఐపాస్ విధానం అమలవుతున్న తీరును ఆరా తీశారు. జిల్లాలో పరిశ్రమల అనుమతుల దరఖాస్తులను సకాలంలో జారీ చేయాలని అధికారులకు స్పష్టం చేశారు.జిల్లాలో నూతన పరిశ్రమల స్థాపనకు సంబంధించి వచ్చిన 27 ప్రతిపాదనలలో 21 ప్రతిపాదనలకు వివిధ శాఖల వారు జారీ చేసిన అనుమతులను కలెక్టర్ సమీక్షించారు. పెండింగ్ లో ఉన్న 6 ప్రతిపాదనలు సైతం తక్షణమే సమీక్షించి వెంటనే అనుమతులు జారీ చేయాలని , జారీ చేసిన అనుమతులు ఆన్ లైన్ లో ప్రతిభంబించేలా చూడాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.జిల్లాలో టీ - ప్రైడ్ పథకం క్రింద మంజూరు చేసిన 42 యూనిట్లు ఫైల్స్ సంపూర్ణ వివరాలు అందించాలని అన్నారు. టీ ప్రేడ్ క్రింద అందించిన ట్రాక్టర్లను గతంలో అక్రమ ఇసుక రవాణాకు వాడుతున్నారని, భవిష్యత్తులో ఇటువంటివి జరగకుండా చూడాలని అన్నారు.పోలీస్ అధికారులతో సమన్వయం చేసుకుంటూ అక్రమ ఇసుక రవాణా కేసులు ఏ ట్రాక్టర్ల పైన ఉన్నాయ్, వాటికి ట్రీ ప్రైడ్ కింద ఏదైనా సబ్సిడీ ప్రతిపాదన చేశామా పరిశీలించి నివేదిక అందించాలని అన్నారు.ఈ సమావేశంలో జి.ఎం. పరిశ్రమల శాఖ టి.హన్మంత రావు, టిజిఐఐసి జోనల్ మేనేజర్ మహేశ్వర్, ట్రాన్స్పోర్ట్ అధికారి లక్ష్మణ్, ఈడి ఎస్సీ కార్పొరేషన్ డి.స్వప్న, ఇతర శాఖల జిల్లా అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# ప్రజలు మళ్లీ కేసీఆర్ నే కోరుకుంటున్నారు.

## బిఆర్ఎస్ పార్టీ జెండా ఆవిష్కరణ.

## 6వ వార్డు ఇన్చార్జ్ నాగుల విజయ్ కుమార్.



**సంగారెడ్డి నియోజకవర్గ ప్రతినిధి ఏప్రిల్ 26(ప్రజాబలం)**సంగారెడ్డి జిల్లా/సదాశివపేట పట్టణంలోని 6వ వార్డు శ్రీకృష్ణ నగర్ కాలనీలో శనివారం సంగారెడ్డి ఎమ్మెల్యే చింత ప్రభాకర్ ఆదేశాల మేరకు బిఆర్ఎస్ పార్టీ వార్డు ఇంచార్జ్ నాగుల విజయకుమార్ ఆధ్వర్యంలో బిఆర్ఎస్ పార్టీ జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా నాగుల విజయకుమార్ మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ఏడాదిన్నర పాలనలో అన్ని వర్గాల ప్రజలు విసుకుపోయారన్నారు. సబ్బండ వర్గాల ప్రజలు మళ్ళీ కేసీఆర్ నే కోరుకుంటున్నారని అన్నారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్వి పట్టణ ప్రధాన కార్యదర్శి నాసిర్, బిఆర్ఎస్ నాయకులు మంబి గారి ఆంజనేయులు, గంజి రమేష్, శ్రీశైలం, బాలు, జగదీశ్వర్, సంగమేశ్వర్, నాగరాజు,రాజు, శ్రీనివాస్, నరేష్ తదితరులు పాల్గొన్నారు.

## పహాల్గం ఉగ్రదాడిని నిరసిస్తూ వేములవాడలో చల్మెడ కొవ్వొత్తుల ర్యాలీ.




**వేములవాడ టౌన్, ( ప్రజాబలం ),** జమ్మూ కాశ్మీర్ లోని పహాల్గం ఉగ్రదాడిని నిరసిస్తూ వేములవాడ పట్టణంలోని అమరవీరుల స్థూపం వద్ద కొవ్వొత్తుల తో శనివారం రోజున బిఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించడం జరిగింది . ఈ సందర్భంగా వేములవాడ బి ఆర్ఎస్ పార్టీ నియోజకవర్గ ఇన్చార్జ్ చల్మెడ లక్ష్మీనరసింహారావు మాట్లాడుతూ అమాయకులపై ఉగ్రదాడులు జరపడం చాలా బాధాకరమన్నారు. కాశ్మీర్లోని ఉగ్రదాడిలో మరణించిన వారి పవిత్ర ఆత్మకు శాంతి చేకూరాలని ఆ భగవంతున్ని కోరుతున్నామన్నారు. దాడిలో మరణించిన వారి కుటుంబ సభ్యులకు తమ ప్రగాఢ సానుభూతి, సంతాపాన్ని తెలియజేశారు.

ఈ దాడి చేసిన ఉగ్రవాదులను గుర్తించి వారిని కఠినంగా శిక్షించాలి అన్నారు. ఈ దాడికి బాధ్యత వహిస్తున్న ఉగ్రవాద సంస్థలపై కఠిన చర్యలు తీసుకోవాలని కేంద్ర ప్రభుత్వాన్ని ఆయన డిమాండ్ చేశారు. కేంద్రం ఎటువంటి సంకోచం లేకుండా కఠినంగా వ్యవహరించాలని కోరుతూ, మృతుల కుటుంబాలకు సంతాపాన్ని వ్యక్తం చేస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు రామతీర్థపు రాజు, పట్టణ ప్రధాన కార్యదర్శి కాంతి కుమార్, పట్టణ మాజీ కౌన్సిలర్లు నిమ్మిశెట్టి విజయ్, సిరిగిరి చందు, గోలి మహేష్, నరాల శేఖర్, జోగిని శంకర్, రూరల్ మండల అధ్యక్షుడు గోస్కుల రవి తదితరులు పాల్గొన్నారు.

# సన్న వడ్ల సేకరణకు రైస్ మిల్లులు సిద్ధం

## కలెక్టర్ సందీప్ కుమార్ ఝూ



**రాజన్న సిరిసిల్ల జిల్లా, ఏప్రిల్ -26 (ప్రజాబలం ప్రతినిధి)**జిల్లాలో సన్న వడ్లు పండించిన రైతుల ధాన్యం సేకరించేందుకు రైస్ మిల్లర్లు సిద్ధంగా ఉన్నారని కలెక్టర్ సందీప్ కుమార్ ఝూ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలో సన్న వడ్లు పండించిన రైతులు తమ గ్రామంలోని కొనుగోలు కేంద్రాల్లో సరైన తేమశాతం తో విక్రయించాలని కలెక్టర్ సూచించారు. జిల్లాలోని 18 రైస్ మిల్లులు సన్న వడ్లు సేకరించేందుకు సిద్ధంగా ఉన్నారని వెల్లడించారు. సరైన ప్రమాణాలతో సన్నవడ్లు విక్రయించి రైతులు ప్రభుత్వమిచ్చే బోనస్ పొందాలని సూచించారు.

## శాంతి భద్రతలకు భంగం కలిగిస్తే కఠిన చర్యలు తప్పవు

### వివిధ కుల, మతాలకు చెందిన పవిత్ర స్థలాలలో సిసి కెమెరాలను ఏర్పాటు చేసుకోవాలి.

### అనవసర రూమర్స్ ప్రచారం చేసి.

### శాంతి భద్రతల పరిరక్షణలో జిల్లా పోలీసులకు సహకరించాలి.

### జిల్లా ఎస్పీ పరితోష్ పంకజ్ ఐపిఎస్



**సంగారెడ్డి జిల్లా ప్రతినిధి ఏప్రిల్ 26(ప్రజాబలం)**సంగారెడ్డి జిల్లా/సంగారెడ్డి:జిల్లాలో శాంతి భద్రతల దృష్ట్యా వివిధ కుల, మతాలకు చెందిన పవిత్ర స్థలాలలో సిసి కెమెరాలను ఏర్పాటు చేసుకోవాలని జిల్లా ఎస్పీ ఒక ప్రకటనలో తెలియజేశారు. ఈ సందర్భంగా ఎస్పీ గారు మాట్లాడుతూ.. జిల్లాలోని గుడులు, మసీదులు, చర్చిలు మరియు ఇతర కుల సంఘాల వద్ద అత్యాధునిక హై-రెజల్యూషన్ సిసి కెమెరాలు మరియు కనీసం 1 నెల రోజుల రికార్డింగ్ సామర్థ్యంతో కూడిన డీవీఆర్ లు అత్యవసరంగా ఏర్పాటు చేయాల్సి ఉందని, ఇది ఆయా మత సంఘాల కమిటీ ఇన్‌చార్జ్‌ల బాధ్యత అని అన్నారు. సిసి కెమెరాలు నేరాలను నివారించడంలోనే కాదు, జరిగిన నేరాలను ఛేదించడంలో కూడా ఎంతో ఉపయోగపడతాయని ఎస్పీ గారు తెలియజేశారు,ఒకరి మత సాంప్రదాయాలను మరొకరు గౌరవించినప్పుడే మత సామరస్యం నెలకొంటుందని, జిల్లాలో శాంతి భద్రతల పరిరక్షణలో జిల్లా పోలీసులకు సహకరించవలసిందిగా సూచించారు. వాస్తవాలను తెలుసుకోకుండా ప్రజలను రెచ్చగొట్టే విధంగా తప్పుడు ప్రచారాలు చేస్తూ.., ప్రజాశాంతికి భంగం కలిగిస్తే ఎంతటి వారైన ఉపేక్షించేది లేదని, అట్టి వ్యక్తులపై చట్టరిత్యా కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని అన్నారు,జిల్లా ప్రజలకు తెలియజేయునది ఏమనగా శాంతి భద్రతల సమస్యలు తలెత్తే సంఘటనలు ఎదురైనప్పుడు ఎంటనే సమీప పోలీసు స్టేషన్ లో సమాచారం అంధించాలే గాని ఎవ్వరూ చట్టాన్ని చేతుల్లోకి తీసుకోకూడదని అన్నారు. సామాజిక మాధ్యమాల్లో రెచ్చగొట్టే విధంగా వ్యాఖ్యల చేసినా,సోషల్ మీడియాలో పోస్ట్ లు పెట్టినా చట్టరిత్య కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు.

# విద్యుత్ వినియోగారులకు విన్నపం

## విద్యుత్ బిల్లుల చెల్లింపుపై మోసపూరిత కాల్‌లు/సందేశాలను నమ్మవద్దు

## - సీఎండీ ముషారఫ్ ఫరూఖి,

విద్యుత్ వాడకం బిల్లలు, బకాయిల పేరుతొ కొంత మంది వ్యక్తులు తమ వినియోగదారులను మెసేజ్ ల ద్వారా/ ఫోన్ ల ద్వారా సంప్రదించి విద్యుత్ బిల్లులు, వాటి బకాయిలు పెండింగ్ లో ఉన్నాయని అవి వెంటనే కట్టకుంటే రాత్రిపూట విద్యుత్ సరఫరా నిలిపివేస్తామని, వారిని వెంటనే సంప్రదించాలిసిందిగా ఒక మొబైల్ నెంబర్ ను పంపుతున్నారు. ఆ మెసేజ్ ను నమ్మి ఎవరైనా వారిని సంప్రదిస్తే బ్యాంకు అకౌంట్ మరియు డెబిట్ కార్డు వివరాలు తీసుకుని వారి అకౌంట్ల నుండి నగదును విత్ డ్రా చేసుకుంటూ మోసగిస్తున్నారని తమ దృష్టికి వచ్చిందని, కనుక విద్యుత్ వినియోగదారులు, ప్రజలు ఇలాంటి మోసపూరిత మెసేజ్ లు నమ్మి మోసపోవద్దని దక్షిణ తెలంగాణ విద్యుత్ పంపిణి సంస్థ చైర్మన్ ఓ మేనేజింగ్ డైరెక్టర్ ముషారఫ్ ఫరూఖి, తెలిపారు.

టీజీఎస్పిడిసిఎల్పంపే సందేశాలలో విభాగం పేరు, జూఅ/సర్వీస్ నంబర్, వినియోగదారుని పేరు ఓ బిల్లు మొత్తం ఉంటాయి, టీజీఎస్పిడిసిఎల్ ఎప్పుడూ మొబైల్ నంబర్ నుండి సందేశాలు పంపదు.టీజీఎస్పిడిసిఎల్ ఉద్యోగులు చెల్లింపు రసీదు తప్ప బ్యాంక్ ఖాతా/డెబిట్ కార్డ్/క్రెడిట్ కార్డ్ వివరాలను ఎన్నడూ సేకరించరు. మరియు సంస్థ బిల్లుల చెల్లింపు కోసం వాటూ/సందేశం ద్వారా ఎటువంటి వెబ్‌సైట్ లింక్‌లను పంపదు. విద్యుత్ వాడకం బిల్లులు మరియు బకాయిల వివరాలను విద్యుత్ బిల్లు ద్వారా వినియోగదారులకు తెలియజేస్తుంది. వినియోగదారులు సంస్థ వెబ్‌సైట్ లిలిలి.బిణబనీబీబిష్ట్రవతీనిజూనీలివతీ.నీతీణ లేదా టీజీఎస్పిడిసిఎల్ మొబైల్ యాప్ ద్వారా ప్రస్తుత వినియోగ బిల్లులు మరియు బకాయిల సమాచారాన్ని పొందవచ్చు. అంతేగాక సంస్థ రాత్రిపూట/అర్ధరాత్రి విద్యుత్ సరఫరాను నిలిపివేయదు.విద్యుత్ వినియోగదారులు బ్యాంక్ ఖాతా/క్రెడిట్ కార్డ్/డెబిట్ కార్డ్ వివరాలను ఇతరులతో పంచుకోవద్దని, విద్యుత్ బిల్లుల చెల్లింపు కోసం అనుమానాస్పద లింక్‌లను అనుసరించవద్దని ముషారఫ్ ఫరూఖీ, తెలిపారు.

# గులాబీ పండుగకు సర్వం సిద్ధం

## చరిత్ర సృష్టించాలన్నా..చరిత్ర తిరగరాయాలన్నా..కేసీఆర్ కే సొంతం

### మాజీ ఎమ్మెల్యే బొల్లం మల్లయ్య యాదవ్ ,

### మాజీ ఎంపీ బడుగుల లింగయ్య యాదవ్

కోదాడరాష్ట్రంలో ప్రజలకు ఏ సమస్య వచ్చినా బీఆర్ఎస్ పార్టీ అండగా నిలిచింది. ప్రతిపక్షంలో ఉన్నా.. ప్రజల పక్షాన నిలబడి పోరాటం చేస్తున్నా నాయకుడు కేసీఆర్ అని మాజీ ఎమ్మెల్యే , బిఆర్ఎస్ పార్టీ ఇంచార్జ్ బొల్లం మల్లయ్య యాదవ్, మాజీ ఎంపీ, జిల్లా పార్టీ అధ్యక్షులు బడుగుల లింగయ్య యాదవ్ లు అన్నారు. శనివారం కోదాడ పట్టణంలోని గడపగడపకు వెళ్లి బొట్టుపెట్టి బిఆర్ఎస్ సభకు హాజరుకావాలని కోరారు. అనంతరం మాజీ ఎమ్మెల్యే మల్లయ్య యాదవ్ గారి నివాసంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ... రేవంత్ సర్కార్ లోపాలను ఎప్పటికప్పుడు ఎత్తిచూపుతూ ప్రభుత్వాన్ని నిలదీస్తున్నమన్నారు.అసెంబ్లీ ఎన్నికల తరువాత పార్టీ కొన్ని ఇబ్బందులు ఎదుర్కొన్నప్పటికీ ప్రజల్లో ఆత్మవిశ్వాసం నింపడంలో ముందు వరుసలో ఉంటుందని ఆయన అన్నారు.రేవంత్ రెడ్డి ఇంకా ప్రతిపక్షంలోనే ఉన్నట్లుగా భావిస్తున్నారు.తెలంగాణ రాష్ట్ర సాధన కోసం ఆవిర్భవించి, ఆ లక్ష్యాన్ని సాకారం చేసి, నిన్న అధికార పార్టీగా రాష్ట్రాన్ని పదేండ్ల పాటు సుభిక్షంగా, సుఖ, సంతోషాలకు ఆలవాలంగా నిలబెట్టి, నేడు ప్రతిపక్ష పార్టీగా 16 నెలలుగా తెలంగాణ ప్రజల ప్రయోజనాల కోసం ప్రభుత్వ దుర్మార్గాన్ని అడుగడుగునా చీల్చి చెండాడుతూ తెలంగాణ ప్రాంత ప్రయోజనాలే ఆశగా, శ్వాసగా కేసీఆర్ నాయకత్వాన రజతోత్సవం జరుపుకొంటున్న వేళ చరిత్రాత్మకమైన భారీ బహిరంగసభకు భారీగా తరలిరావాలని అన్నారు.

చరిత్రలో అనేక సందర్భాల్లో తెలంగాణకు ద్రోహం తలపెట్టిన, ఇప్పటికీ తలపెడుతూనే ఉన్న కాంగ్రెస్ పార్టీ ద్రోహాన్ని ప్రజా సమూహంగా నిలదీద్దాం వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా నాయకులు పైడిమర్రి సత్యబాబు, ఏలూరి వెంకటేశ్వరరావు, అరె లింగారెడ్డి, టౌన్ పార్టీ అధ్యక్షులు నయుం, కౌన్సిలర్లు అల్వాల వెంకట్, మేదర లలిత, చింతల నాగేశ్వరరావు, యూత్ అధ్యక్షులు ఇమ్రాన్ ఖాన్, పట్టణ నాయకులు కర్ల సుందర్ బాబు, సుంకర అభి నాయుడు, సంగిశెట్టి గోపాల్, ఉపేందర్ గౌడ్, తాజ్, ఉపేందర్ యాదవ్, తుపాకుల భాస్కర్, బొజ్జ గోపి, కాసాని మల్లయ్య గౌడ్, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# 113 సీసీ కెమెరాలను ప్రారంభించిన ప్రభుత్వ విప్, ఏఎస్పి శేషాద్రిని రెడ్డి

## ఒక్క సీసీ కెమెరా 100 మందితో సమానం
## పోలీస్ స్టేషన్ కి వచ్చే ఫిర్యాదు దారులకు గౌరవం ఇవ్వాలి
## ఫ్రెండ్లీ పోలీస్ అంటే ఏమిటో ప్రజలకు చూపించాలి
## జిల్లా పోలీస్ పనితీరు అభినందనీయం ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్




**వేములవాడ - ఏప్రిల్ - 26 (ప్రజాబలం దినపత్రిక)**వేములవాడ పట్టణంలోని పరిసర ప్రాంతాల రక్షణ కొరకై శనివారం రోజున ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్, ఏఎస్పీ శేషాద్రిని రెడ్డి తో కలిసి 113 సీసీ కెమెరాలను వేములవాడ సబ్ డివిజనల్ పోలీస్ అధికారి కార్యాలయంలో ప్రారంభించారు. ఈ సందర్భంగా ప్రభుత్వ విప్ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ మాట్లాడుతూ దక్షిణ కాశీగా పిలవబడే రాజన్న క్షేత్రం అయినా వేములవాడను అన్ని విధాలుగా అభివృద్ధి చేయడమే లక్ష్యంగా పెట్టుకున్నామని సుదూర ప్రాంతాల నుంచి వచ్చే భక్తులకు ఈ ప్రాంత ప్రజలకు భద్రత కలిగించే దిశగా వేములవాడ రాజరాజేశ్వర స్వామి దేవస్థానం నిధులతో 12,00000/- లక్షల రూపాయలతో 113 సీసీ కెమెరాలను అందుబాటులో ఉంచామని ఇక్కడికి వచ్చే భక్తులను దొంగలు ఆసరాగా చేసుకొని డబ్బులను, పిల్లలను దొంగలించకుండా కట్టు దీట్టమైన భద్రత తో ఈ సిసి కెమెరాలు పని చేస్తాయని ఒక్క సీసీ కెమెరా 100 మందితో సమానం అని ఎలాంటి సంఘటనలు జరగకుండా సీసీ కెమెరాలలో చూసి తక్షణమే పోలీసు వారు చర్యలు తీసుకోవడానికి అవకాశం ఉంటుందని అన్నారు. అలాగే రాజన్న దర్శనానికి వచ్చే భక్తులకు టిఫిన్ సెంటర్లు, హోటల్లు, రాత్రి వేలల్లో 11:30 వరకు తెరిచి ఉండే విధంగా పోలీసు వారు మూసి వేయకుండా చూడాలని భక్తులకు మర్యాదలు ఇవ్వాలనీ అన్నారు. అలాగే పోలీస్ స్టేషన్ కి వచ్చే నిరక్షరాస్యులైన ఫిర్యాదుదారులకు వారి నుంచి వచ్చే మాటల ఆధారంగానే ఫిర్యాదులు తీసుకోవాలని సమస్యని పరిష్కరించాలని ఫ్రెండ్లీ పోలీస్ లా ప్రతి ఒక్క అధికారి పని చేయాలని, డ్రగ్స్ మత్తు పదార్థాలకు బానిసలు కాకుండా మారక ద్రవ్యాలపై ఉక్కు పాదం మోపి నియంత్రించాలి మన జిల్లా పోలీస్ యంత్రాంగం పనితీరు అభినందనీయంగా ఉందని వారన్నారు.

ఏఎస్పీ శేషాద్రిని రెడ్డి మాట్లాడుతూ కొత్తగా బాధ్యతలు చేపట్టిన తర్వాత వేములవాడ లో పట్టణానికి తగ్గట్టుగా సీసీ కెమెరాలు తక్కువగా ఉన్నాయని ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ దృష్టికి తీసుకురాగానే వెంటనే వారు స్పందించి ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి రాజరాజేశ్వర స్వామి దేవస్థానం వారిచే నిధులు మంజూరు చేయించినందుకు ప్రభుత్వ విప్ , ఆలయ ఈవో వినోద్ రెడ్డి లకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ సీసీ కెమెరాల ద్వారా పట్టణం నలుమూలల పోలీస్ నిఘా కన్ను ఉంటుందని ప్రమాదాలు, నేర నియంత్రణకు, దొంగతనాలకు పాల్పడకుండా ప్రతినిత్యం సీసీ కెమెరాల ద్వారా పోలీస్ నిఘా ప్రత్యేకంగా ఉంటుందని గతంలో దేవస్థానం ప్రాంగరంలో జరిగిన బాలిక కిడ్నాప్ కేసును సీసీ కెమెరాల ద్వారా చేదించి పాపను వారి తల్లిదండ్రులకు అప్పగించడం జరిగింది అని గుర్తు చేశారు. ప్రజలకు ఎలాంటి సమస్యలు ఉన్న నేరుగా పోలీస్ స్టేషన్ కి వచ్చి ఫిర్యాదు చేయాలని తప్పకుండా వారి సమస్యను న్యాయబద్ధంగా పరిష్కరిస్తామని ఆమె అన్నారు. ఈ కార్యక్రమంలో వేములవాడ శ్రీ రాజరాజేశ్వర స్వామి దేవస్థానం ఈవో కె. వినోద్ రెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ రొండి రాజు, మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ బింగి మహేష్ ,టౌన్ సిఐ వీరప్రసాద్, ఎస్సైలు రమేష్, ట్రాఫిక్ ఎస్ఐ సముద్రాల రాజు, పోలీస్ సిబ్బంది, కాంగ్రెస్ శ్రేణులు తదితరులు పాల్గొన్నారు.

# ఉగ్ర దాడికి నిరసనగా దస్తావేజు లేఖరుల కార్యాలయాలు బంద్





**వేములవాడ టౌన్ -ఏప్రిల్ 26 (ప్రజాబలం దినపత్రిక)**పహల్గాం ఉగ్ర దాడిని నిరసిస్తూ వేములవాడ దస్తావేజు లేఖరులు శనివారం రోజున ఉగ్రవాదుల దాడిలో మరణించిన వారికి శ్రద్ధాంజలి ఘటించి తమ విధులను బహిష్కరించారు. ఈ సందర్భంగా దస్తావేజు లేఖరుల అధ్యక్షులు చేట్టిపల్లి మల్లారెడ్డి మాట్లాడుతూ అమాయకులైన టూరిస్టులను అత్యంత దారుణంగా చంపడం దుర్మార్గమైన చర్య అని భారతదేశంలో టెర్రరిజానికి తావు లేదని ఇటువంటి ముష్కరులకు కేంద్ర ప్రభుత్వం తగిన విధంగా బుద్ధి చెప్పాలని మన దేశంలో ఇటువంటి సంఘటనలు మరో మారు జరగకుండా కేంద్ర ప్రభుత్వం కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని ఉగ్రవాదాన్ని పెంచి పోషిస్తున్న పాకిస్తాన్ ని అణచివేయాలని భారతీయుల రక్షణకు ప్రతి ఒక్కరం ఐకమత్యంగా ఉండాలని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో గౌరవ అధ్యక్షులు మచ్చ కిషన్, రాజయ్య, కల్లపెల్లి శేఖర్, లింగాల సుదర్శన్, పంపరి నాగరాజు, ఎర్రం సంతోష్ , క్రాంతి,భరత్, జలంధర్, సృజన్, వినయ్, మహేష్, గసిగంటి సంతోష్ తదితరులు దస్తావేజులేఖరులు పాల్గొన్నారు.

# గ్రామాన్ని పట్టించుకోని పంచాయతీ కార్యదర్శి



**అందోల్ నియోజకవర్గం ప్రతినిధి ఏప్రిల్ 26, (ప్రజాబలం )** సంగారెడ్డి జిల్లా, అందోల్ నియోజకవర్గం లోని చౌటాకూర్ మండల కేంద్రంలో గత కొన్ని రోజుల నుండి విద్యుత్ దీపాలు లేకపోవడంతో ప్రజలు రాత్రి వేళల్లో బయటకు వెళ్లాలంటే జంకుతున్నారు, అంతేకాకుండా గ్రామంలో మురికి కాలువలు లేక, ఉన్న కొద్దిపాటి మురికి కాలువలను శుభ్రపరచక పోవడంతో, వాటిపై దోమలు స్వైర విహారం చేసి ప్రజలకు ఈ దోమల వల్ల డెంగు మలేరియా వంటి రోగాలు ప్రబలుతున్నాయి, దీంతో అమాయక ప్రజలు తీవ్ర నరకయాతన అనుభవిస్తున్నారు, ఇట్టి విషయాన్ని పలుమార్లు గ్రామ పంచాయతీ కార్యదర్శి దృష్టికి తీసుకువెళ్లినప్పటికి గ్రామ పంచాయతీలో నిధులు లేవు నేను ఎక్కడ నుండి అప్పు తీసుకొచ్చి పెట్టాలని చెప్పడం దురదృష్టకరం, కావున ఇప్పటికైనా సంబంధించిన అధికారులు స్పందించి, తమ గ్రామంలో నెలకొని ఉన్న సమస్యలను, వెంటనే పరిష్కరించాలని గ్రామస్తులు కోరుతున్నారు, పరిస్థితి ఇలాగే కొనసాగితే గ్రామ పంచాయతీ కార్యదర్శి ఈ సమస్యలపై స్పందించకపోతే, మేము గ్రామస్తులమంత ఏకమై తమ గ్రామంలో నెలకొని ఉన్న సమస్యలపై జిల్లా కలెక్టర్ కు ఫిర్యాదు చేస్తామని, గ్రామస్తులు తెలిపారు, విధుల పట్ల నిర్లక్ష్యం వహిస్తున్న గ్రామపంచాయతీ కార్యదర్శినీ వెంటనే తొలగించాలని, సంబంధిత అధికారులను గ్రామస్తులు కోరుతున్నారు....

# వడదెబ్బ తగలకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలి -కె కె -5 గని కార్మికులకు అవగాహన సదస్సు




**ప్రజాబలం చెన్నూరు నియోజకవర్గ రిపోర్టర్ ఏప్రిల్ 26:**మందమర్రి ఏరియా కె.కె%-%5 గని ఉద్యోగులకు వేసవి కాలంలో వడదెబ్బ తగలకుండా తీసుకోవలసిన జాగ్రత్తల గురించి కేకే%-%5 గని మేనేజర్ శంభునాథ్ పాండే ఆధ్వర్యంలో అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సదస్సులో సింగరేణి వైద్యాధికారి డాక్టర్ లోకనాథ్ రెడ్డి మాట్లాడుతూ, ఉద్యోగులు ఎండలో ఎక్కువసేపు తిరిగ వద్దన్నారు. నీరు ఎక్కువ తీసుకోవాలని శరీరంలో నీటి శాతం తగ్గకుండా చూసుకోవాలని నిమ్మరసం పండ్ల రసాలు తాగాలని ఆహారపు అలవాట్లు మార్పులు చేసుకోవాలని ఎండలో వెళ్లేటప్పుడు తలకు టోపీ లేత రంగు కాటన్ దుస్తులు ధరించాలన్నారు. వేపుడు పదార్థాలు తినవద్దని మద్యపానం మాంసం తగ్గించాలని ముఖ్యంగా గుండె సంబంధిత వ్యాధులు మరియు బి.పీ ఉన్నవారు తగు జాగ్రత్తలు వహించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో కే.కే%-%5 ఇంక్లైన్ గని మేనేజర్ శంభునాథ్ పాండే, గుర్తింపు సంఘం పిట్ కార్యదర్శి గాండ్ల సంపత్, ఏ.ఐ.టీ.యూ.సీ బ్రాంచ్ అసిస్టెంట్ సెక్రటరీ కంది శ్రీనివాస్,రమేష్ గని సేఫ్టీ ఆఫీసర్, ఎం.కార్తీక్, సీనియర్ పర్సనల్ ఆఫీసర్, శ్రీమతి ఏ.రవళి మేనేజ్మెంట్ ట్రైని పర్సనల్ కేకే-5 ఇంక్లైన్, మరియు ఉన్నతాధికారులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

# ఎంపీటీసీ నీ పరామర్శించిన కాంగ్రెస్ అధ్యక్షుడు నిమ్మ రమేష్



**ఆందోల్ నియోజకవర్గం ప్రతినిధి ఏప్రిల్ 26 (ప్రజాబలం)** సంగారెడ్డి జిల్లా ఆందోల్ నియోజకవర్గం లోని టేక్మాల్ మండల పరిధిలో గల తంప్లూర్ గ్రామానికి చెందిన సీనియర్ కాంగ్రెస్ నాయకులు తంపులూరు కాదులూరు తాజా మాజీ ఎంపిటిసి, బుడాల భూమయ్య ఇటీవల బైకు ప్రమాదానికి గురైన సంఘటన విషయాన్ని తెలుసుకొన్న మండల కాంగ్రెస్ అధ్యక్షుడు నిమ్మ రమేష్, మరియు కాంగ్రెస్ నాయకులు, భూమయ్య స్వగృహానికి వెళ్లి, అతని బాగోగులు తెలుసుకొని అతనికి మనోధైర్యం కల్పించారు, వారి కుటుంబ సభ్యులతో మాట్లాడి త్వరగా కోలుకుంటాడని అధైర్య పడొద్దు అని చెప్పారు, వీరి వెంట మండల కాంగ్రెస్ నాయకులు విద్యాసాగర్, మాజీ సర్పంచ్, ఆకులపల్లి పాపయ్య, టేక్మాల్ పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు భక్తుల కిషోర్, తంపులూరు మాజీ సర్పంచ్ కొండ నాగయ్య, యువ నాయకులు సర్వాణి లక్ష్మణ్ ప్రసాద్, సాయి శేషు గౌడ్, సతీష్,రవీందర్ యాదవ్, తదితరులు పాల్గొన్నారు....

# రాజన్న ఆలయంలో భక్తుల కోలాహలం.



**వేములవాడ టౌన్, ( ప్రజాబలం ),** దక్షిణ కాశీగా ప్రసిద్ధి పొందిన వేములవాడ శ్రీ రాజరాజేశ్వర స్వామి ఆలయంలో పాఠశాలలకు, కళాశాలలకు వేసవి సెలవులు కావడంతో సుదూర ప్రాంతాలను నుండి ఎండ వేడిమిని సైతం లెక్కచేయకుండా శనివారం రోజున రాజన్న ఆలయానికి భక్తులు పోటెత్తినారు. భక్తులు వేకువజాము నుండే తలనీలాలు సమర్పించి, పవిత్ర ధర్మగుండంలో కుటుంబ సమేతంగా పుణ్యస్నానాలు ఆచరించి, క్యూలైన్ల ద్వారా వెళ్లి శివునికి అత్యంత ప్రీతికరమైన కోడెమొక్కులను చెల్లించుకొని, తదనంతరం స్వామివారిని దర్శించుకుని తమ తమ మొక్కులను చెల్లించుకున్నారు. అనుబంధాలయాలలో వివిధ రకాల పూజలు నిర్వహించి, తమ పిల్లాపాపలను, తమ పాడి పంటలను, తమ పిల్లల ఆరోగ్యాలను చల్లగా చూడు తండ్రి అంటూ ఆ శివున్ని వేడుకున్నారు. స్వామి వారి దర్శనానికి సుమారుగా రెండు గంటల సమయం పట్టింది. ఆలయంలో రద్దీ కారణంగా ఆలయ ప్రాంగణం, పరిసర ప్రాంతాలలో సందడి నెలకొంది. భక్తులకు ఎలాంటి అసౌకర్యాలు కలగకుండా ఆలయ అధికారులు తగిన ఏర్పాట్లు చేసినారు.

# ఉగ్రదాడిలో మరణించిన వారికి నివాళి



**ఆందోల్ నియోజకవర్గం ప్రతినిధి ఏప్రిల్ 26 (ప్రజాబలం )** సంగారెడ్డి జిల్లా అందోల్ నియోజకవర్గ పరిధిలోని టేక్మాల్ మండల కేంద్రం చౌరస్తాలో పహల్గాం ఉగ్రదాడికి నిరసనగా బిజెపి ఆధ్వర్యంలో నిన్న శుక్రవారం సాయంత్రం కొవ్వొత్తులతో నివాళులు అర్పించారు, ఈ సందర్భంగా 2 నిమిషాల పాటు మౌనం పాటించారు, ప్రతి ఒక్కరూ ఈ ఉగ్రదాడిని ఖండించాలన్నారు, దాడి చేసిన వారిని కఠినంగా శిక్షించాలని నినాదాలు చేశారు, ఈ కార్యక్రమంలో జిల్లా కార్యవర్గ సభ్యులు రాజు, మండల ప్రధాన కార్యదర్శి సిద్ధిరాములు, ఉపాధ్యక్షులు వడ్డె రాములు, గిరిజన మోర్చా అధ్యక్షుడు సేనాపతి, నాయకులు రమేష్, శంకర్, మారుతి, విట్టల్, మరియు గ్రామస్తులు పాల్గొన్నారు....

# గండిమైసమ్మ గ్రామంలో భూ భారతి అవగాహన సదస్సు

## భూ భారతి చట్టంలో పిఓబి రద్దుచేసే అధికారం

## మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కలెక్టర్ గౌతం




**ప్రజాబలం ప్రతినిధి మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా ఏప్రిల్ 26:**భూభారతి చట్టం పై జరిగిన అవగాహన సదస్సులోరైతులు తెలిపిన అన్ని సమస్యలకుఈ చట్టంలో పరిష్కరించే అవకాశం ఉందని, మీ గ్రామాలలో రెవెన్యూ అధికారులు నిర్వహించే రెవెన్యూ సదస్సులో మీరు దరఖాస్తులు ఇస్తే వాటికి శాశ్వత, సత్వర పరిష్కారం ఉంటుందని మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కలెక్టరు గౌతం స్పష్టం చేసారు .

శనివారం దుండిగల్ మండలంలోని గండిమైసమ్మ గ్రామంలో గల మేకల వెంకటయ్య ఫంక్షన్ హాలు లో ఏర్పాటు చేసిన అవగాహాన సదస్సుకు మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కలెక్టరు గౌతం ముఖ్య అతిథిగా విచ్చేసారు.ఈ సందర్భంగా కలెక్టరు మాట్లాడుతూ అవగాహాన సదస్సులోరైతులు తెలిపిన సమస్యలకుఈ భూభారతి చట్టంలో పరిష్కారం ఉంటుందని, భూభారతి పరిధిలో లేని సమస్యలకు తగు సూచనలు రెవెన్యూ అధికారులు ఇస్తారని అన్నారు. భూధాన్, ఇనాం చట్టాల ద్వారా కలిగే సమస్యల పట్ల సదస్సు ఏర్పాటు చేస్తామని రెవెన్యూ శాఖామాత్యులు చేప్పారని కలెక్టరు తెలిపారు. దాదాపు 20 నుండి 25 భూ చట్టాలు ఉన్నాయని, వాటన్నీంటిని క్రోడీకరించి ఒక నూతన చట్టాన్ని తీసుకురావాలని రెవెన్యూ మంత్రి ఆలోచనలో ఉందన్నారు. రైతులకు, ప్రజలకు ఉపయోగపడేలా అన్ని చట్టాలను కలిపి సింగిల్ రెవెన్యూ చట్టం త్వరలోనే తేవడం జరుగుతుందన్నారు. ధరణి చట్టం లోరెవెన్యూ శాఖ చేతులు కట్టేసినట్టు అయిందని,ఈ భూభారతితో రైతుల, భూస్వాముల భూ సమస్యలు తీర్చే అధికారం రెవెన్యూ అధికారులకు ఈ చట్టంలో ఇవ్వడం జరిగిందన్నారు. రెవెన్యూ, జిహెచ్ఎంసి, హెచ్ఎండిఎ, హైడ్రా అన్ని శాఖల సమన్వయంతో ఎంక్రోచ్ మెంట్ సమస్యల పై కఠిన చర్యలు తీసుకుంటామని కలెక్టరు తెలిపారు . ఈ సదస్సులో మీరు అందించిన భూభారతిలో తీరని సమస్యలను, సూచనలను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళతామని కలెక్టరు సూచించారు.

మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా అదనపు కలెక్టరు మాట్లాడుతూ రైతులకు ఆదరాబాదర అవసరం లేదని, మీ గ్రామాలలో ఏర్పాటు చేసే రెవెన్యూ సదస్సులలో మీ సమస్యలకు అపీలు చేసుకోవచ్చని, ఆ సమస్యలను తప్పకుండా పరిష్కరిస్తామని అన్నారు. ధరణి వల్ల పిఓబి సమస్యలు చాలా ఉన్నాయని, భూభారతి చట్టంలో పిఓబి రద్దుచేసే అధికారం కల్పించడం జరిగిందన్నారు. ఈ భూభారతి చట్టంలో ప్రతి సంవత్సరం డిసంబర్ 31న ఆ సంవత్సరంలో జరిగిన మార్పులు, చేర్పులను ఆన్ లైన్ లో ప్రింట్ తీసి ప్రతి గ్రామ పంచాయతీ నోటీసు బోర్డులలో ప్రదర్శిస్తారని అందువల్ల మీకందరికి మీమీ భూముల రికార్డుల వివరాలు తప్పక తెలుస్తాయని అదనపు కలెక్టరు వివరించారు. గ్రామ పంచాయతీ అధికారులను నియమించి ప్రతి గ్రామంలోని చిన్న చిన్న సమస్యలను పరిష్కరించడమే కాకుండా ఏవైనా భూ వివాదాలు, తగాదాలు ఉంటే వాటిని తహాసీల్దార్ల దృష్టికి తీసుకువెళతారని తెలిపారు.

ఈ సదస్సులో జిల్లా అగ్రికల్చర్ మార్కెట్ కమిటీ ఛైర్మన్ నర్సింహాలు, జిల్లా గ్రంథాలయ సంస్థ కమిటీ ఛైర్మన్ శ్రీనివాస్ రెడ్డి, మల్కాజిగిరి ఆర్డిఓ శ్యాంప్రకాష్, దుండిగల్ తహాసీల్దారు మతిన్, రెవెన్యూ అధికారులు, సిబ్బంది, రైతులు, ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

# భూ భారతి చట్టంతో రైతులకు విస్తృత ప్రయోజనాలు.

## అవగాహన సదస్సులో జిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్.




**ప్రజాబలం ప్రతినిధి తేది.26.4.2025.ములుగు జిల్లా.** రాష్ట్ర ప్రభుత్వం కొత్తగా ప్రవేశపెట్టిన భూ భారతి' (ఆర్.ఓ.ఆర్) చట్టంతో రైతులకు విస్తృత ప్రయోజనాలు కలుగుతాయని, భూ వివాదాలకు శాశ్వత పరిష్కారం లభిస్తుందని కలెక్టర్ దివాకర టి.ఎస్. అన్నారు.

శనివారం కన్నాయి గూడెం మండలకేంద్రం లోని రైతు వైదిక లో భూభారతి నూతన చట్టంపై రైతులకు అవగాహన సదస్సు నిర్వహించారు.

ఈ సదస్సులో జిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్. పాల్గొని భూభారతి చట్టంపై, అందులో పొందుపర్చిన అంశాల గురించి కలెక్టర్ రైతులకు అవగాహన కల్పించారు. ఎలాంటి వివాదాలకు తావు లేకుండా రైతులకు సంబంధించిన భూములపై వారికి పూర్తి యాజమాన్య హక్కులు కల్పించేందుకు ప్రభుత్వం ఆనేక కొత్త అంశాలను పొందుపరుస్తూ ఈ నూతన ఆర్.ఓ.ఆర్ చట్టాన్ని తెచ్చిందని వివరించారు. భూమి హక్కుల భద్రత, భూ సమస్యల సత్వర పరిష్కారం, రైతుల మేలు కోసం చారిత్రక మార్పు దిశగా ఈ నూతన ఆర్ఓఆర్ చట్టం ఉపకరిస్తుందని, రైతుల భూములకు భరోసా కల్పిస్తుందని సూచించారు. భూ సమస్యలు కలిగిన రైతులు దీనిని సద్వినియోగం చేసుకోవాలని హితవు పలికారు.

పైలెట్ ప్రాజెక్టు కింద రాష్ట్రంలోని నాలుగు మండలాలలో దీనిని ఈ నెలాఖరు వరకు ప్రయోగాత్మకంగా అమలు చేస్తారని, క్షేత్రస్థాయిలో ప్రభుత్వం దృష్టికి వచ్చే ఇతర ఏవైనా అంశాలు, సమస్యలను కూడా పరిశీలించి ఈ చట్టంలో చేర్చడం జరుగుతుందని తెలిపారు. నిర్ణీత కాల వ్యవధిలోపు వాటిని పరిష్కరిస్తారని అన్నారు. తమకు న్యాయం జరగలేదని భావిస్తే రైతులు ఆర్డీఓకు, అనంతరం కలెక్టర్ కు అప్పీల్ చేసుకోవచ్చని,

ల్యాండ్ ట్రిబ్యునల్ లో కూడా అప్పీలు చేసుకోవచ్చని తెలిపారు. ఈ చట్టం ప్రవేశపెట్టిన ఏడాది కాలం లోపు భూ సంబంధిత సమస్యలపై అర్జీలు పెట్టుకునే అవకాశం కల్పించారని వివరించారు. ఆన్లైన్లో భూ భారతి పోర్టల్ ద్వారా కూడా దరఖాస్తు చేసుకునే అవకాశం ఉందన్నారు. భూ సమస్యల పరిష్కారానికి రెండంచెల వ్యవస్థ ఉంటుందని, ఈ చట్టం ద్వారా రైతులకు వారి భూముల వివరాలతో కూడిన భూధార్ కార్డులను కేటాయిస్తారని తెలిపారు. భూ సమస్యలు తెలుసుకుని సులభతరంగా పరిష్కరించేందుకు భూభారతి చట్టం ఎంతో ఉపయోగపడుతుందని అన్నారు. వ్యవసాయ భూములతో పాటు వ్యవసాయేతర, మిగితా అన్ని రకాల భూముల రికార్డులు రెవెన్యూ కార్యాలయంలో నమోదు అయి ఉంటాయని అన్నారు. ఇదివరకటి ధరణిలో రికార్డుల నిర్వహణ లేదని, ఇప్పుడు రికార్డుల నిర్వహణ ఉంటుందని, గతంలో ఏదైనా సమస్య పరిష్కారం కాకుంటే అప్పిల్ వ్యవస్థ లేదని సివిల్ కోర్టులను ఆశ్రయించాల్సి వచ్చేదని, ఇప్పుడు ఆర్డీఓ, కలెక్టర్, సీసీఎల్ఏ స్థాయిలలో అప్పీల్ వ్యవస్థ ఉందని, ప్రతి అంశం భూభారతి పోర్టల్ లో ఉంటుందని, ఎవరైనా వారి భూములకు సంబంధించిన వివరాలను పరిశీలించుకోవచ్చని తెలిపారు.

సాదాబైనామా దరఖాస్తుల క్రమబద్ధీకరణకు సంబంధించి కూడా త్వరలోనే ప్రభుత్వం సమగ్ర మార్గదర్శకాలను జారీ చేయనుందని తెలిపారు. ఈ సందర్భంగా భూభారతి చట్టంలోని కీలక అంశాలైన భూ రికార్డులలో తప్పుల సవరణ, వ్యవసాయ భూముల రిజిస్ట్రేషన్, మ్యుటేషన్, వారసత్వంగా వచ్చిన భూములకు మ్యుటేషన్, ఇతర మార్గాల ద్వారా వచ్చిన భూమికి మ్యుటేషన్, సాదా బైనామాల క్రమబద్ధీకరణ, పట్టాదారు పాసు పుస్తకాలు, అప్పీల్ వ్యవస్థ, రివిజన్ అధికారాలు, గ్రామ రెవెన్యూ రికార్డులు, రికార్డుల నకలు పొందడం ఎలా అనే అంశాలపై రైతులకు అవగాహన కల్పించారు. ధరణి పోర్టల్ లో లేని అనేక సమస్యలకు భూభారతి చట్టం ద్వారా పరిష్కారం లభిస్తుందని అన్నారు. అనంతరం ఆయా అంశాలపై రైతులు వెలిబుచ్చిన సందేహాలను కలెక్టర్ నివృత్తి చేశారు. ఈ సదస్సులో తహసిల్దార్ వేణుగోపాల్, ఎంపిడిఓ అనిత, స్థానిక అధికారులు, ప్రజా ప్రతినిధులు, రైతులు పాల్గొన్నారు.

# మిడ్ మానేరు జలాశయంలో చేపలు పట్టు లైసెన్స్ దారులకు అవగాహన సదస్సు. జిల్లా మత్స్యశాఖ.






**వేములవాడ టౌన్, ( ప్రజాబలం ),** శనివారం రోజున వేములవాడా అర్బన్ మండలం రుద్రవరం గ్రామంలోని కమ్యూనిటీ హాల్ లో మధ్య మానేరు జలాశయం మత్స్య శాఖ పరిధిలో చేపలు పట్టు లైసెన్స్ దారులకు అవగాహన సదస్సు కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో మధ్య మానేరు జలాశయ పరిధిలో గల లైసెన్స్ దారులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించే దిశగా పలు అంశములను అమలుపరచుటకు నిర్ణయించడమైనది, పలు సూచనలు చేయడం జరిగింది.






లైసెన్సుదారులు విధిగా ప్రతి సంవత్సరం సెప్టెంబర్ మొదటి రోజు నుండి రెన్యువల్ లేదా నూతన లైసెన్సులను తగు సంబంధిత రుజువుల జతపరిచి లైసెన్స్ రుసుము మత్స్యశాఖ శాఖ, రాజన్న సిరిసిల్ల జిల్లా నందు చెల్లించి లైసెన్స్ పొందవలసిందిగా, లేదా లైసెన్స్ రెన్యువల్ చేసుకోవాల్సిందిగా నిర్ణయించడమైనది.

మధ్య మానేరు జలాశయంలో చేపలు పట్టుకునే లైసెన్స్ దారులకు, తెప్పలు, వలలను సబ్సిడీపై ఇప్పించగలరని జిల్లా మత్స్యశాఖ అధికారిని కోరడం జరిగింది.

అలాగే చేపలు వేట నిషేధ కాలం అనగా జూలై, ఆగస్టు మాసంలలో మధ్యమనేర్ జలాశయం పరిధిలోని గ్రామాల మత్స్యకారులు లైసెన్స్ దారులు చేపలు పట్టకూడదని తెలియజేయడమైనది. ఒకవేళ నిబంధనలకు విరుద్ధంగా లైసెన్స్ దారులు గాని, మరెవరైనా చేపలు పట్టినట్టయితే వారిపై చట్టరీత్యా అమలులో ఉన్న నియమ నిబంధన ప్రకారం చర్యలు తీసుకోబడతాయని తెలియజేయడమైనది.

మధ్య మానేరు జలాశయంలో నీటి నిల్వలు 10 టీఎంసీల వరకు మాత్రమే ఉన్నప్పుడు అందులో కేవలం భూములు కోల్పోయిన నిర్వాసిత లైసెన్స్ దారులకు మాత్రమే చేపలు పట్టుకొనుటకు గాను లైసెన్సుదారులు జిల్లా మత్స్యశాఖ అధికారి, రాజన్న సిరిసిల్లని కోరడమైనది. ఈ సమావేశంలో ఏం సౌజన్య, జిల్లా మత్స్యశాఖ అధికారి, చొప్పరి రామచంద్రం, అధ్యక్షులు జిల్లా మత్స్య పారిశ్రామిక సహకార సంఘం, జిల్లా డైరెక్టర్లు, లైసెన్సుదారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# జిల్లా ప్రధాన న్యాయమూర్తి ని మర్యాదపూర్వకంగా కలిసిన వేములవాడ బార్ అసోసియేషన్ కార్యవర్గం.



**వేములవాడ టౌన్, ( ప్రజాబలం),** రాజన్న సిరిసిల్ల జిల్లా ప్రధాన న్యాయమూర్తిగా బాధ్యతలు చేపట్టిన నీరజను వేములవాడ బార్ అసోసియేషన్ కార్యవర్గం మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో ఘనంగా సన్మానించి, పుష్పగుచ్ఛం అందించి, రాజన్న లడ్డు ప్రసాదాన్ని అందించడం జరిగింది. ఈ కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షులు గుండా రవి, ఉపాధ్యక్షులు కటకం జనార్ధన్, ప్రధాన కార్యదర్శి గడ్డం సత్యనారాయణ రెడ్డి, సభ్యులు నాగుల సంపత్ కుమార్, పంపరి శంకరయ్య, గుజ్జే మనోహర్, కనికరపు శ్రీనివాస్, కనపర్తి రాజశేఖర్, జక్కుల పద్మ, బూర సరిత తదితరులు పాల్గొన్నారు.

# బొల్లారంలోని అంగన్వాడీ కేంద్రానికి ఫ్యాన్ వితరణ.

## చిన్నారుల ఉక్కపోత సమస్య పరిష్కరించిన కాంగ్రెస్ నేత.

## డిసిసి కార్యదర్శి బాలసాని శ్రీనివాస్ గౌడ్ ను అభినందించిన గ్రామస్తులు.



**వేములవాడ టౌన్, ( ప్రజాబలం ),** వేసవికాలంలో తీవ్రమైన ఎండ వేడిమి కి, ఉక్కపోతతో ఫ్యాన్ లేక ఇబ్బందులు పడుతున్న అంగన్వాడీ కేంద్రంలోని చిన్నారులకు ఊరట నిచ్చేలా రాజన్న సిరిసిల్ల జిల్లా డిసిసి కార్యదర్శి బాలసాని శ్రీనివాస్ గౌడ్ ముందుకు వచ్చారు. వేములవాడ రూరల్ మండలం బొల్లారం గ్రామంలోని అంగన్వాడీ కేంద్రానికి స్వంత ఖర్చులతో ఫ్యాన్ విరాళంగా అందించి తన మానవత్వాన్ని చాటుకున్నారు. ఆయన చూపిన సేవా దృక్పథాన్ని బొల్లారం గ్రామస్తులు అభినందించారు. ఫ్యాన్ సమకూరడంతో అంగన్వాడి కేంద్రంలోని చిన్నారులకు గాలి వెసులు పాటు కలగడంపై చిన్నారులు, వారి తల్లిదండ్రులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. చిన్నారుల ఆరోగ్య పరిస్థితులను దృష్టిలో పెట్టుకొని వెంటనే స్పందించి నా శ్రీనివాస్ గౌడ్ ను మనస్ఫూర్తిగా గ్రామస్తులు కృతజ్ఞతలు తెలిపారు. రాబోయే రోజులలో మరిన్ని సామాజిక సేవా కార్యక్రమాలు చేయాలని వారు ఆకాంక్షించారు.

ఈ కార్యక్రమంలో అంగన్వాడీ టీచర్ భారతి, ఆయమ్మ బాబాయి, మురుగం అనిల్, కంకణాల రాజు, బాలసాని దశరథం, పోతుగంటి రాములు, లింగంపల్లి సుజాత, లక్కే శిరీష, ఈసంపల్లి రజిత తదితరులు పాల్గొన్నారు.

# అజ్మీర తండాలో వరి బస్తాలకు నిప్పు పెట్టిన రైతులు..

## కొనరావుపేట ధాన్యం కొనుగోలు జాప్యంతో రైతుల ఆవేదన.



**రాజన్న సిరిసిల్ల ప్రతినిధి, కోనరావుపేట, ( ప్రజాబలం ),** రాజన్న సిరిసిల్ల జిల్లా కోనరావుపేట మండలం అజ్మీర తండాలో శనివారం ఉదయం ఉద్రిక్తత పరిస్థితులు చోటుచేసుకున్నాయి. వరి ధాన్యం కొనుగోలులో ప్రభుత్వం జాప్యం చేస్తుందని ఆవేదన వ్యక్తం చేస్తూ, స్థానిక రైతులు తాము పండించిన వరి ధాన్యం బస్తాలకు నిప్పు పెట్టారు. గత కొన్ని వారాలుగా వరి ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో కొనుగోలు ప్రారంభించకపోవడంతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని రైతుల ఆరోపించారు. రైతులు తెలిపిన వివరాల ప్రకారం తీవ్రమైన ఎండల్లో వరి ధాన్యం బస్తాలు నిల్వ పెట్టే అందుకు వసతులు లేకపోవడంతో ధాన్యం నష్టపోతున్నామని తెలిపారు. అధికారుల స్పందన లేకపోవడంతో నిరాశకులోనే ఈ చర్యకు పాల్పడ్డామని చెప్పారు. ఎంత కష్టం వచ్చినా వ్యవసాయాన్ని నమ్ముకొని బతుకుతున్న మాలాంటి రైతన్నల కష్టాలు ఏ ప్రభుత్వం పట్టించుకోకపోవడం తో మా పరిస్థితి అగమ్య గోచరంగా తయారైందని మహిళా రైతుల కంటతడి పెట్టారు. రాత్రి, పగలు అని తేడా లేకుండా మా కుటుంబాలతో వరి ధాన్యం కేంద్రాల వద్ద పడిగాపులు కాస్తున్నామని, ఒకవైపు అకాల వర్షంతో పంట నష్టం ఏర్పడితే, మరొకవైపు వన్యప్రాణుల బెడదతో పంట నష్టం వాటిల్లడంతో, ముందు నుయ్యి, వెనుక గొయ్యి అన్నట్లు తయారైంది మా పరిస్థితి అని వాపోయారు. మా సమస్యలు పలుమార్లు అధికారుల దృష్టికి తీసుకెళ్లిన మా చేతిలో ఏమీ లేదని పట్టించుకోవడంలేదని, ఇటు అధికారులు, అటు ప్రభుత్వం పట్టించుకోకపోతే రైతన్నల పరిస్థితి ఏంటి అని అన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి వెంటనే వారి ధాన్యం కొనుగోలు ప్రక్రియను ప్రారంభించి రైతులకు మేలు చేయాలని లేనియెడల పెద్ద ఎత్తున ఆందోళన నిర్వహిస్తామని అజ్మీర్ తండావాసులు తెలిపారు.

# ప్రోటోకాల్ విస్మరించిన ప్రభుత్వ అధికారులు.

## భూభారతి ఆరో ఓ ఆర్ చట్టంపై అవగాహన కార్యక్రమంలో ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ కు తీవ్ర అవమానం.





**రాజన్న సిరిసిల్ల ప్రతినిధి, తంగళ్ళపల్లి, ( ప్రజాబలం ),** శనివారం రోజున తంగళ్ళపల్లి మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన భూభారతి ఆర్ఓఆర్ చట్టంపై అవగాహన కార్యక్రమం సదస్సులో ప్రభుత్వ అధికారులు అధికారికంగా ఏర్పాటుచేసిన స్వాగత ఫ్లెక్సీలో వేములవాడ ఎమ్మెల్యే ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ ఫోటో ముద్రించకపోవడంతో ప్రభుత్వ అధికారుల నిర్లక్ష్యం వెరసి ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ కు అవమానం. 10 సంవత్సరాల తర్వాత కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చింది. రాజన్న సిరిసిల్ల జిల్లాలో కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యే వేములవాడ నుంచి గెలిచిన ఆది శ్రీనివాస్ ను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సముచిత స్థానం కల్పించి ప్రభుత్వ విప్ పదవి ఇవ్వడం జరిగింది. రాజన్న సిరిసిల్ల జిల్లా అధికారులు మాత్రం ఆది శ్రీనివాస్ కు సరియైన గౌరవం ఇవ్వడం లేదని విమర్శ వెల్లువెత్తుతున్నాయి. ప్రభుత్వ అధికారిక కార్యక్రమాలలో సైతం ఆయన ఫోటోలు పెట్టకపోవడం తీవ్ర విమర్శలకు దారి తీస్తుంది.

ఈ మధ్యకాలంలో సిరిసిల్ల ఆ పారేల్ పార్కు కార్యక్రమంలో ఆది శ్రీనివాస్, సిరిసిల్ల శాసనసభ్యుడు కేటీఆర్, కేంద్ర హెూంశాఖ సహాయ మంత్రి, కరీంనగర్ పార్లమెంటు సభ్యుడు బండి సంజయ్ ఫోటోలు ఫోటో కాల్ ప్రకారం లేవని తెలియడంతో అధికారులే ఆ ఫ్లెక్సీలను తొలగించారు.

శనివారం రోజున తంగళ్ళపల్లి మండల కేంద్రంలో భూభారతి ఆర్ వో ఆర్ చట్టంపై అవగాహన కార్యక్రమంలో బండి సంజయ్ తో పాటు కేటీఆర్ ఫోటోలు కూడా పెట్టి స్వాగతం, సుస్వాగతం ఫ్లెక్సీని ఏర్పాటు చేశారు. కానీ అధికార పార్టీ ఎమ్మెల్యే ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ ఫోటో ఫ్లెక్సీలో లేకపోవడం తీవ్ర చర్చకు దారి తీసింది. ఆది శ్రీనివాస్ బీసీ సామాజిక వర్గంలో పుట్టడమే ఆయన చేసిన పాపమా.. రాజన్న సిరిసిల్ల జిల్లా అధికారులు ఇప్పటికైనా తమ తప్పును తెలుసుకొని మరొకమారు ప్రభుత్వ విప్ కు అవమానం కలగకుండా చూడాలని జిల్లా ప్రజలు కోరుతున్నారు.

# వేములవాడ బ్రిడ్జి పైన పహేల్గం ఉగ్రవాదుల దిష్టిబొమ్మ దహనం.



**వేములవాడ టౌన్, ( ప్రజాబలం ),** శనివారం రోజున రాజన్న సిరిసిల్ల జిల్లా వేములవాడ బ్రిడ్జి పైన పహేల్గంలో మారణ హెూమం సృష్టించిన ఉగ్రవాదుల దిష్టిబొమ్మను దహనం చేయడం జరిగింది. ఈ సందర్భంగా సిపిఐ వేములవాడ నియోజకవర్గ ఇన్చార్జ్, ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి కడారి రాములు మాట్లాడుతూ మారణ హెూమం సృష్టించిన ఉగ్రవాదులను ఎన్కౌంటర్ చేయాలని, ఉగ్రవాద మూలాలను సైతం ధ్వంసం చేయాలని, ఈ దేశంలో ఉంటూ ఉగ్రవాదులకు, ఉగ్రవాద దేశాలకు మద్దతు ఇచ్చేవారు, ఆశ్రయం కల్పించేవారు, అక్రమ వలసదారులను దేశద్రోహులుగా ప్రకటించి కఠినంగా శిక్షించి భారతదేశం నుండి వెళ్లే కొట్టాలని, భారతదేశంలో ఎవడు పడితే వాడు వచ్చి, అక్రమంగా ఉండడానికి ఈ దేశం ఏమి అన్న సత్రం కాదని, పహేల్గం దాడిలో మరణించిన వారి కుటుంబాలకు సిపిఐ, మరియు ఏఐటీయూసీ రాజన్న సిరిసిల్ల ద్వారా ప్రగాఢ సానుభూతి వ్యక్తం చేస్తున్నామని అన్నారు. ఈ కార్యక్రమంలో వేములవాడ పట్టణ సిపిఐ పార్టీ కార్యదర్శి గాజులపోశెట్టి, రూరల్ మండల కార్యదర్శి శ్రీ రాముల నరసయ్య, పెంట మల్లయ్య, బొంబాయి లక్ష్మణ్, శ్రీనివాస్, శేఖర్, రాజన్న తదితర సిపిఐ నాయకులు, కార్మిక సంఘం నాయకులు పాల్గొన్నారు.

## ఛలో వరంగల్ సభకు భారీగా తరలి రండి.. సతీష్ అరోరా




**కూకట్పల్లి (ప్రజబలం)ఏప్రిల్ 26:** తెలంగాణ ప్రజల ఆత్మ గౌరవ నినాదమైన ప్రత్యేక రాష్ట్ర సాధనను ప్రపంచ నలుమూలల చాటి చెప్పి దేశ పాలకులను మెప్పించి ఒప్పించి తెలంగాణ రాష్ట్రాన్ని సాధించిన టీ ఆర్ ఎస్ జెండా(బీ ఆర్ ఎస్) రజతోత్సవ పండుగకు ఉవ్వెత్తున తరలి రండి. బి ఆర్ యస్ పార్టీ కూకట్ పల్లి నియోజకవర్గం కో ఆర్డినేటర్ సతీష్ అరోరా పిలుపునిచ్చారు. తెలంగాణ జాతి పిత కేసిఆర్ నాయకత్వంలో ఏర్పడిన తెలంగాణ రాష్ట్ర సమితి అసాధ్యం అనుకున్న తెలంగాణ రాష్ట్ర సాధనను సుసాధ్యం చేసి దేశంలోనే అన్ని రంగాల్లో అగ్రగామి రాష్ట్రంగా తీర్చిదిద్ది షహభాష్ అనిపించేలా దశాబ్ద కాలంపాటు పాలించిన కేసిఆర్ నాయకత్వానికి మద్దతుగా మేళ తాళాలతో డప్పు వాయిద్యాలతో తరలి రండి తెలంగాణ రాష్ట్ర ప్రజల వరంగల్ ఎల్కతుర్తి వద్ద జరిగే భారీ బహిరంగ రజతోత్సవ సభ కు కూకట్పల్లి నియోజకవర్గం నుండి అన్ని డివిజన్ల లోని అన్ని కాలనీలు బస్తీల నుంచి బస్సులు కార్లలో వేలాదిగా తరలిరావాలని బి ఆర్ యస్ పార్టీ కూకట్ పల్లి నియోజకవర్గం కో ఆర్డినేటర్ సతీష్ అరోరా పిలుపునిచ్చారు.

## రైతులకు ఇబ్బంది కలుగకుండా ధాన్యం కొనుగోలు చేయాలి.

జయశంకర్ భూపాలపల్లి రైతులకు ఎలాంటి ఇబ్బంది జరగకుండా ధాన్యం కొనుగోలు ప్రక్రియ నిర్వహించాలని భూపాలపల్లి శాసన సభ్యులు గండ్ర సత్యనారాయణ రావు పేర్కొన్నారు. శనివారం రేగొండ, గోరి కొత్తపల్లి మండలాల్లోని రూపురెడ్డిపల్లి మరియు దామరంచపల్లి గ్రామాల్లో ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తాలు, తరుగు పేరిట రైతులకు ఇబ్బందులు కలిగించకూడదని స్పష్టం చేశారు. ప్రతి బస్తా 40 కిలోల ధాన్యానికి గరిష్టంగా 650 గ్రాముల బస్తా తూకమే అనుమతించబడుతుందని, దీనికన్నా అధికంగా తీసుకుంటే కఠిన చర్యలు తీసుకోవాల్సి ఉంటుందని హెచ్చరించారు. అలాగే, సన్నరకం ధాన్యానికి ప్రభుత్వం రూ.500 బోనస్ చెల్లించనున్నట్లు తెలిపారు. రైతులకు గిట్టుబాటు ధర అందేలా ప్రభుత్వ విధానాలను సమర్థంగా అమలు చేయాలని అధికారులను ఆయన ఆదేశించారు. ఈ కార్యక్రమంలో రెవెన్యూ అదనపు కలెక్టర్ అశోక్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# జర్నలిస్టుకాలనీ స్థలంను కబ్జా చెర నుండి విడిపించాలి

## బెల్లంపల్లి ఎమ్మెల్యే గడ్డం వినోద్ పాటు రెవెన్యూ అధికారులకు విజ్ఞప్తి

## బెల్లంపల్లి ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు కారుకూరి సదానందం



**ప్రజాబలం బెల్లంపల్లి నియోజకవర్గం రిపోర్టర్ ఏప్రిల్ 26 :** పాత్రికేయ వృత్తిని నమ్ముకొని జీవనం సాగిస్తున్న జర్నలిస్టులకు గత కొంతకాలంగా బెల్లంపల్లి పట్టణం కన్నాల గ్రామ శివారులో జాతీయరహదారిని ఆనుకొని ఉన్న జర్నలిస్టుకాలనీ స్థలంలో కొంతమంది గుర్తు తెలియని వ్యక్తులు ఇటీవల ప్లాటింగ్ చేసి నిర్ణీత కొలతల ప్రకారం ప్లాట్లుగా విభజించి సిమెంట్ పోల్స్ ను ఏర్పాటు చేసి కబ్జా చేసేందుకు ప్రయత్నిస్తున్న వ్యక్తులను గుర్తించి చర్యలు చేపట్టాలని స్థానిక ఎమ్మెల్యేను మరియు రెవెన్యూ అధికారుల బెల్లంపల్లి ప్రెస క్లబ్ అధ్యక్షుడు కారుకూరి సదానందం విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా శనివారం నాడు క్షేత్రస్థాయిలో జర్నలిస్టు కాలనీ స్థలాన్ని సభ్యుల తోపాటు పరిశీలించిన అనంతరం ప్రెస్ క్లబ్లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ...కన్నాల గ్రామ రెవెన్యూ శివారు సర్వే నంబర్ 144 నుండి148 వరకు185,186,211 లలో ఉన్న సుమారు ఐదున్నరఎకరాల స్థలంలో గుర్తుతెలియని వ్యక్తులు పూర్తిస్థాయిలో ప్లాట్లుగా చేయడం స్థానిక జర్నలిస్టులకు ఎవరికి సమాచారం లేకపోవడం ఆందోళనకు గురిచేస్తున్నదని అన్నారు.సంబంధిత జర్నలిస్టు కాలనీలోని స్థలం ను పట్టణంలో పాత్రికేయ వృత్తిని కొనసాగిస్తున్న అర్హులైన జర్నలిస్టులలో సీనియార్టీ ప్రాతిపదికన ఉన్నవారితో పాటు అక్రిడేషన్ కలిగిన జర్నలిస్టులకు సైతం స్థలాన్ని కేటాయించి ఇందిరమ్మ ఇళ్ల పథకం వర్తించేలా స్థానిక ఎమ్మెల్యే గడ్డం వినోద్ వెంకట స్వామి తోపాటు బెల్లంపల్లి ఆర్డీవో హరికృష్ణ,తహసిల్దార్ జోష్నలు దృష్టిసారించి జర్నలిస్టులకు న్యాయం చేయాలని విజ్ఞప్తి చేశారు.జర్నలిస్టులకు చెందిన స్థలాన్ని ఫ్లాటింగ్ చేసి కబ్జా చేసేందుకు ప్రయత్నించిన విషయమైస్థానిక ఆర్డిఓ హరికృష్ణను ఎమ్మార్వో జోష్ణలను వివరణ కోరగా తమకు ఎలాంటి సమాచారం లేదని స్పష్టం చేశారు.జర్నలిస్టు కాలనీలో స్థలం కబ్జా చేసేందుకు ప్రయత్నించిన విషయమై పూర్తిస్థాయిలో విచారణ జరుపుతామని ఈ సందర్భంగా తహసిల్దార్ జోష్న బెల్లంపల్లి ప్రెస్ క్లబ్ కార్యవర్గానికి హామీ ఇచ్చారు.జర్నలిస్టులకు కేటాయించిన స్థలాన్ని కబ్జా చేయడానికి ప్రయత్నించిన వారిని సత్వరమే గుర్తించి వారిపై చట్ట ప్రకారం చర్యలు తీసుకోవాలని బెల్లంపల్లి ప్రెస్ క్లబ్ కార్యవర్గం డిమాండ్ చేసింది.ఈ కార్యక్రమంలో బెల్లంపల్లి ప్రెస్ క్లబ్ ప్రధాన కార్యదర్శి మనోజ్ పాండే,ఉపాధ్యక్షులు దండ బోయిన భాస్కర్,కోశాధికారి కత్తుల నవీన్,కార్యవర్గ సభ్యులుశ్రావణ్,సాగర్,రాకేష్ పాండే తదితరులు పాల్గొన్నారు.

# మే 4వ తేదీన జిల్లాలో నీట్ పరీక్షను పకడ్బంధీగా నిర్వహించాలి

## జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్





**మంచిర్యాల జిల్లా ప్రతినిధి ఏప్రిల్ 26 :** జిల్లాలో మే 4వ తేదీన నీట్ పరీక్షను పకడ్బంధీగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు.శనివారం జిల్లాలోని నస్పూర్ లో గల సమీకృత జిల్లా కార్యాలయాల భవన సముదాయంలోని కలెక్టర్ సమావేశ మందిరంలో డి.సి.పి.ఎ.భాస్కర్,జిల్లా అదనపు కలెక్టర్ సబావత్ మోతిలాల్,మంచిర్యాల ఎ.సి.పి.ప్రకాష్ లతో కలిసి వివిధ శాఖల అధికారులతో నీట్ పరీక్ష నిర్వహణపై సమీక్ష సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ...జిల్లాలో మే 4వ తేదీన జరుగనున్న నీట్ పరీక్షను పకడ్బంధీగా నిర్వహించాలని తెలిపారు. జిల్లాలో జరుగనున్న నీట్ పరీక్షకు1వేయి204 మంది అభ్యర్థులు హాజరు కానున్నారని, ఇందుకు గాను జిల్లాలో 4 పరీక్షా కేంద్రాలను ప్రభుత్వ డిగ్రీ కళాశాల-మంచిర్యాల, తెలంగాణ ఆదర్శ పాఠశాల-రాజీవ్ నగర్, మంచిర్యాల పట్టణంలోని జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల,జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలలో ఏర్పాటు చేయడం జరిగిందని తెలిపారు.మే 4వ తేదీన మధ్యాహ్నం 2 గంటల నుండి సాయంత్రం 5 గంటల వరకు పరీక్ష నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. కంట్రోల్ రూమ్,పరీక్ష కేంద్రాలలో సి.సి.కెమెరాలు ఏర్పాటు చేయాలని,ప్రశ్నా పత్రాలను పూర్తి బందోబస్తుతో భద్ర పర్చడం జరుగుతుందని తెలిపారు. పరీక్ష కేంద్రాల వద్ద 144, 163 సెక్షన్లు అమలు చేయడం జరుగుతుందని, పరీక్షా కేంద్రాల సమీపంలో జిరాక్స్ సెంటర్లు మూసి ఉంచాలని తెలిపారు. తపాలా శాఖ ఆధ్వర్యంలో ప్రశ్నాపత్రాల రవాణా జరుగుతుందని,ఇందుకు గాను పోలీసు శాఖ ఆధ్వర్యంలో బందోబస్తు ఏర్పాట్లు చేయాలని,పరీక్ష రోజున ఉదయం 9 గంటల లోపు ప్రశ్నాపత్రాలు కంట్రోల్ రూమ్లో ఉంచాలని,నీట్ పరీక్ష విషయాలకు సంబంధించి ఎలాంటి పరిజ్ఞానం లేని ఇన్విజిలేటర్లను నియమించాలని, తదనుగుణంగా ఇన్విజిలేటర్ల జాబితా రూపొందించాలని తెలిపారు.పరీక్ష కేంద్రంలోనికి మొబైల్లు, ఎలాంటి ఎలక్ట్రానిక్ పరికరాలను అనుమతించడం జరుగదని,ప్రతి అభ్యర్థిని పరిశీలించి పరీక్షా కేంద్రంలోనికి అనుమతించడం జరుగుతుందని,మహిళా అభ్యర్థుల పరిశీలన కొరకు మహిళా సిబ్బందిని నియమించాలని తెలిపారు. పరీక్ష ముగిసిన తరువాత ఓ.ఎం.ఆర్.పత్రాల తరలింపు నిబంధనల ప్రకారం పకడ్బందీగా చేపట్టాలని తెలిపారు.4 పరీక్షా కేంద్రాలలో ఒక్కొక్క పరీక్షా కేంద్రానికి ఒక ముఖ్య పర్యవేక్షకుడు,పాలనా విభాగం నుండి ఒక నోడల్ అధికారి,పోలీసుశాఖ నుండి ఒక నోడల్ అధికారిని నియమించడం జరుగుతుందని తెలిపారు. పరీక్షా సమయంలో ఎలాంటి అంతరాయం లేకుండా విద్యుత్ సరఫరా జరిగేలా ఏర్పాట్లు చేయాలని,వైద్య-ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో వైద్య సిబ్బందిని నియమించి,ఓ.ఆర్.ఎస్.,అవసరమైన మందులు అందుబాటులో ఉంచాలని,అభ్యర్థులు సకాలంలో పరీక్షా కేంద్రాలకు చేరుకునే విధంగా ఆర్.టి.సి. అధికారులు బస్సులు నడిపించాలని, మున్సిపల్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో పరీక్షా కేంద్రాలలో పారిశుధ్య నిర్వహణ పకడ్బంధీగా చేపట్టాలని తెలిపారు. అగ్నిమాపక సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని, నిబంధనల ప్రకారం అనుమతి లేకుండా పరీక్షా కేంద్రంలోనికి ఎవరికి అనుమతి ఉండదని తెలిపారు.దివ్యాంగుల సౌకర్యార్థం పరీక్షా కేంద్రాలలో వీల్ చైర్స్ అందుబాటులో ఉంచాలని తెలిపారు. జిల్లాలో నీట్ పరీక్ష విజయవంతంగా నిర్వహించేందుకు అధికారులు సమన్వయంతో పని చేయాలని తెలిపారు.

ఈ కార్యక్రమంలో ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ చక్రపాణి,కస్తూరిభా గాంధీ బాలికల విద్యాలయం ప్రిన్సిపల్ ప్రసాద్, వైద్య-ఆరోగ్యశాఖ, రెవెన్యూ,అగ్నిమాపక, పోలీస్ శాఖల అధికారులు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

Edited ,Printed Published & Owned by A.SRAVANTHI ,Printed at: SRAVANTHI ENTER PRISES 1-9-18/A,Ramnagar,Hyderabad - 500020, T.S
and Published at 5-2-518,Osmangunj ,Risala Abdulla,Hyderabad -95 Editor; A.SRAVANTHI, RNI NO ; TELTEL/2005/16755 Cell ; 92921 04449
Email;prajaabalamnews@gmail.com